ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక




కుప్పనూర్పిడి...


3-3-48 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాలు

ఆంధ్రనాటక కళాపరిషత్తు


14-వ సమావేశ చిత్రాలు*




ఆంధ్రరాష్ట్రసినిమా ఉద్యోగులు శ్రీ కాంతారాంగారికి సన్మానపత్రము సమర్పించిన సందర్భములో తీసినఛాయాచిత్రం పూలమాల చేతిలోపట్టుకునిలుచున్నవారు శ్రీ కాంతారాంగారు




సమావేశానికి అధ్యక్షతవహించిన గౌ. శ్రీ గోపాలరెడ్డిగారు
అధ్యక్షోపన్యాసం చేస్తున్నదృశ్యం



ఆంధ్రనాటక కళాపరిషత్తు 14-వ సమావేశంలో శ్రీ కాంతారాంగారు
ప్రారంభోపన్యాసం చేస్తున్న దృశ్యం



రాఘవకళామందిరం నిర్మింపబడనున్న ఆవరణలో జాతీయపతాకారోహణ జరిపినప్పటి
దృశ్యం గౌ. శ్రీగోపాలరెడ్డి, శ్రీ కాశేశ్వరరావు, శ్రీ కాంతారాం, శ్రీ య.
మాధవాచారిగారలు చిత్రంలో ముందువరుసన కనిపిస్తున్నారు



సమావేశ ప్రారంభోత్సవం జరుపుటకు శ్రీ కాంతారాంగారు
బయలుదేరుచున్న దృశ్యం.

* గతనెల 14, 15 తేదీలలో బెజవాడలో ఆంధ్రనాటక కళాపరిషత్ సమావేశాలు జరిగిన సందర్భములో తీసిన ఈ ఛాయాచిత్రాలు, ఆ తర్వాత జరిగిన విచారకర సంఘటనవలన వెంటనే ప్రచురించజాలక, ఇప్పుడు ప్రచురించుచున్నాము.

ఆంధ్రపత్రిక

ప్రతి బుధవారమున ప్రకటింపబడును

సంవత్సర చందా రు. 12-0-0

విడిప్రతిక అణాలు 0-4-0


సంపుటము 40

సంచిక 25


ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము

Founder : K. NAGESWARA RAO.

సర్వజిత్తు సంవత్సర మాఘ బహుళ అష్టమి బుధవారము



శి ధి ల హృ ద య



ఆంధ్రపత్రిక

1948-వ సం॥ మార్చి నెల 3-వ తేది బుధవారము

భారతప్రభుత్వ బడ్జెట్

అధినివేశ శాసనసభలో భారత ప్రభుత్వ ఖజానాశాఖమంత్రి శ్రీ షణ్ముఖంచెట్టిగారు ప్రతిపాదించిన బడ్జెట్ ప్రస్తుతకాలములో మన దేశ పరిస్థితులకు తగినట్లుగా వుండి, దేశ ఆర్థికపరిస్థితిని మరింత బలపరుచుటకు, ఆర్థికాభ్యున్నతికి దోహద మొసంగుటకు అనువుగా నున్నది. అధిక లాభములపైనను, ఆదాయముపైనను పన్నులు తగ్గించి, కాఫీ, తేయాకు, పొగాకు మొదలగు వానిపై పన్ను లెక్కువచేయుట ఒకవంక సామాన్య మానవుని జీవనవ్యయమును వృద్ధిపరచుచు, వేరొకవంక ధనికవర్గము వారి లాభములను వృద్ధిచేయుటయే నని స్థూలదృష్టితో ఈ బడ్జెట్‌ను పరికించినవారికి అనిపించవచ్చును. కాని మరి కొంచెము జాగ్రత్తతో పరిశీలించినచో సామాన్యమానవుని జీవనవ్యయమును వృద్ధిచేయు క్రొత్తపన్నుల విధింపు, ధనికవర్గము లాభములను వృద్ధిచేయు పన్నుల తొలగింపు కూడ చాల తక్కువ మొత్తములకే సంబంధించి యుండుటవలన జీవన వ్యయముగాని, లాభములుగాని ఎక్కువగా పెరుగుటకు అవకాశము లేదనియు, తమపై పన్నుల భారమధికముగా పడినదని గత సంవత్సరమునుండి ఆందోళన చేయుచున్నవారికి, వారాశించినదానికన్న తక్కువ సౌకర్యమే లభించినదనియు బోధపడగలదు.

1948-49 వ సం.లో భారతప్రభుత్వ ఆదాయము రూ. 230 కోట్ల 52 లక్షలు వుండుననీ, వ్యయము రూ. 257 కోట్ల 37 లక్షలు వుండుననీ అంచనావేసి, అందువలన సంభవించిన రూ. 26 కోట్ల 85 లక్షల లోటును భర్తీ చేయుటకు కొన్ని క్రొత్తపన్నులు విధింపదలచినట్లు శ్రీషణ్ముఖంచెట్టిగారు తెలియజేసినారు. వీనిలో కొన్ని మన దేశములోని ప్రజలే భరించవలసి యుండును. మరికొన్ని విదేశములలోని దిగుమతిదారులు భరింతురు. నూనె గింజలు, నూనె, మ్యాంగనీసుల ఎగుమతిపై విధించిన పన్నులు విదేశస్థులే భరింతురు. సిగరెట్లు, పొగాకు, కాఫీ, తేయాకు మొదలగువానిపై విధించిన పన్ను వాని నుపయోగించువారే భరించుకొనవలసివచ్చును. అందువలననే బీదవారుపయోగించు చౌకరకపు సిగరెట్లు, పొగాకుపై చాల తక్కువరేటు పన్ను విధించి, ఇతరులుపయోగించు సిగరెట్లు, పొగాకులపై ఎక్కువరేటు పన్ను విధింపబడినది. నిప్పుపెట్టెలపై పన్ను కొద్దిగా హెచ్చింపబడినది వాని ధర పెరుగుటకు అవకాశము లేదు. విదేశముల కెగుమతిచేయబడుచున్న నూనెగింజలపై ఎగుమతి పన్ను విధించుటవలన, మన గింజలకు ఆదేశములలో గిరాకీ తగ్గిపోదు సరికదా, వానిని మన దేశములోనే ఉపయోగించుటకు పరిశ్రమ లేర్పరచదలచిన వారికి కొంత ప్రోత్సాహము కూడ లభించును. పోకచెక్కలపై పన్ను తీసివేసినందుకు అందరు సంతసింతురు.

గత సంవత్సరము, భారతదేశము విభజింపబడక పూర్వము, అప్పుడు ఖజానాశాఖసభ్యులుగా వున్న లియాకతాలీఖాన్‌గారు విధించిన అధిక లాభముల పన్ను, అధికఆదాయపు పన్ను రేట్లు తమపై పన్ను భారము నధికము చేసిన వనియు, సంపాదనలో కొంత భాగమును మిగిల్చి, కూడబెట్టి పరిశ్రమాభివృద్ధి జరుపవలెననువుత్సాహమునకు వ్యాఘాతము కలిగించి, దేశ పారిశ్రామికాభివృద్ధిని కుంటుపరచిన వనియు పారిశ్రామికవేత్తలు, వర్తకులు అప్పటినుండి ఆందోళన జేయుచునే యున్నారు. గత నవంబరు నెలలో అధినివేశ శాసనసభలో తాత్కాలిక బడ్జెట్ ప్రతిపాదించుచు, పారిశ్రామిక వేత్తలు చెప్పుచున్నది ఎంతవరకు సమంజసమో సమగ్రముగా పరిశీలించి, అవసరమని తోచినచో అధికపన్ను భారమును కొంత తగ్గింతునని శ్రీ చెట్టిగారు వాగ్దానము చేసియుండిరి. ఆ ప్రకారమే ఇప్పుడు ఆపన్నులు కొంచెము తగ్గింపబడినవి. అధిక లాభముల పన్ను విధించుటకు కనీస లాభము రూ. 1 లక్షనుండి రూ. 2 లక్షలవరకు పెంచి, పన్ను రేటు నూటికి $16\frac{2}{3}$ వంతులనుండి 10 వంతుల వరకు తగ్గించిరి. కాని ఇందువలన ప్రభుత్వము పోగొట్టుకొను ఆదాయము రూ. 1 కోటి మాత్రమే. అదేవిధముగా అధికాదాయపు పన్నుకూడ కొంచెము తగ్గింపబడి, మరొక కోటి రూపాయల ఆదాయము వదలుకొనబడినది. కాబట్టి తమ సొమ్మును క్రొత్త పరిశ్రమలకు వినియోగించి, పారిశ్రామికాభివృద్ధికి, అధికోత్పత్తికి, తద్వారా దేశసౌభాగ్యమునకు తోడ్పడుటకు పన్ను భారము తమకు అధిక ఆటంకముగా నున్నదని ఆందోళన జరుపుచున్న పారిశ్రామికవర్గమువారు ఇప్పుడు పన్నుభారము. ఖజానా మంత్రి దృష్టిలో, తగినంతవరకు తగ్గింపబడినది గాన, తామై పూనుకొని, చొరవ చేసి, నూతన పరిశ్రమలను స్థాపించవలసిన బాధ్యత తమపై నున్నదని గ్రహింపవలెను. వాటాదారులకు పంచిపెట్టక, పరిశ్రమలోనే ఉపయోగించిన లాభములపైనను, చిన్న చిన్న కంపెనీల లాభములపైనను పన్నును తగ్గించుట పారిశ్రామికాభివృద్ధికి ఎట్టి సహాయమునైనను చేయుటకు ప్రభుత్వము సంసిద్ధముగా నున్నదనుటకు నిదర్శనము.

క్రొత్తగా తీసివేయబడిన, విధింపబడిన పన్నుల సంగతటుంచి, ఇతర విషయములను పరిశీలించినచో శ్రీ షణ్ముఖంచెట్టిగారి బడ్జెట్ ప్రకారము మనదేశ ఆర్థికవ్యవస్థ బలవత్తరముగానే యున్నట్లు గోచరింపగలదు. మొత్తము వ్యయము రూ. 257 కోట్ల 37 లక్షలలో, రూ. 136 కోట్లకుపైగా ఒక్క రక్షణశాఖకే ప్రత్యేకింపబడినది. ఇందు దాదాపు రూ. 15 కోట్లు క్రొత్త కట్టడములకు, క్రొత్త నౌకలకు మొదలగువానికి వినియోగింపబడును. కాశ్మీర్ పరిస్థితి చక్కబడి, పాకిస్థాన్‌తో అన్ని సమస్యలు సంతృప్తికరముగా పరిష్కరింపబడగలిగిననుకూడా అంతర్జాతీయ పరిస్థితుల తీవ్రతనుబట్టియైనను మన దేశములోని యువకుల కందరికి సైనికశిక్షణ యిచ్చుట, తగినంత ఆయుధసామగ్రిని తయారు చేసికొని యుంచుట, తయారు చేయుటకు వలసిన యంత్రాగారములు నెలకొల్పుట అత్యావశ్యకములు గాన ఇప్పట్లో రక్షణశాఖవ్యయము తగ్గునవకాశము కనిపించుటలేదు. దేశరక్షణ విషయమున ధన వ్యయము లెక్క జూచుకొనదగినదికూడ కాదు.

పాకిస్థాన్‌నుండి తరిమివేయబడిన కాందిశీకులకు సౌకర్యములు ఏర్పాటు చేయుటకు గత బడ్జెట్‌లో రూ. 22 కోట్లు ప్రత్యేకింపబడినదిగాని అందులో రూ. 15 కోట్లు మాత్రమే ఇంతవరకు ఖర్చయినది. వ్యవసాయదారులగు కాందిశీకులందరికి పునరావాసపు ఏర్పాట్లు జరిగినవి.

ఇతరులుకూడ తమ తమ వృత్తులలో ప్రవేశించుటకు తగినంత ధన సహాయము చేయుట కొరకు ప్రత్యేక సంస్థ నేర్పరచి అందుకొరకు రూ. 10 కోట్లను ప్రత్యేకించుటయే గాక ఈ విషయములో రాష్ట్రములకు సహాయముచేయుట కొరకు 5 కోట్ల రూపాయలు, కేంద్రప్రభుత్వమే నేరుగా సహాయముచేయుటకు మరొక రూ. 10 కోట్లు ప్రత్యేకింపబడినవి. ఈధనముతో అభాగ్యులగు కాందిశీకులందరికి శాశ్వతపునరావాసపు ఏర్పాట్లు ఎంతత్వరలో చేసిన అంత మంచిది.

విద్య, వైద్యము, ఆరోగ్యము, ప్రచారము మొదలగు అభ్యుదయ కార్యక్రమములకు రూ. 21 కోట్లు వినియోగింపదలచినారు. రాష్ట్రములు తలపెట్టిన అభ్యుదయ కార్యములకు గ్రాంట్లుగా 30 కోట్ల రూపాయలును, అప్పులుగా 34 కోట్ల రూపాయలును ఇచ్చుటకు కూడ నిర్ణయించినట్లు మంత్రిగారు తెలిపిరి. ఆర్థికాభ్యున్నతికి 1945-వ సం.లో కేంద్ర ప్రభుత్వ సలహాపై రాష్ట్రములు ప్రణాళికలు రచియించుకొనినవి. ఆ ప్రణాళికలు అమలు జరుపుటకు వానికి ధన సహాయము, ఋణసహాయము చేయుటకు కేంద్రప్రభుత్వ మప్పుడే అంగీకరించినది. ఆ వాగ్దానముప్రకారము 5 సంవత్సరముల కాలములో ఇప్పుడున్న రాష్ట్రములకు మొత్తము 180 కోట్ల రూపాయలు సహాయము చేయవలసి యుండునని మంత్రిగారి యభిప్రాయము. ఇదిగాక కోసి, సోన్‌లోయ, గండక్, అస్సాంలోయ, దామోదర్ లోయ మొదలగు ప్రాజెక్టుల నిర్మాణమునకు, సింద్రీ ఎరువుల ఫ్యాక్టరీ నిర్మాణము వగైరా అభివృద్ధి కార్యక్రమములకు సొమ్ము ప్రత్యేకింపబడినది. కాబట్టి అభివృద్ధి కార్యములకు తగినంత సొమ్ము ప్రత్యేకింపబడినదనియే చెప్పవలెను.

రానున్న సంవత్సరములో ప్రభుత్వము రూ. 150 కోట్లు ఋణము చేయదలచియున్నట్లును, అవకాశమున్నచో ఇంతకన్న ఎక్కువ మొత్తము ఋణముచే చేసెదమని శ్రీ చెట్టిగారు చెప్పిరి. ఈ ఋణము అభివృద్ధికార్యములకు వినియోగింపబడి ఫలప్రదమగుటయేగాక, ప్రజల వద్దనున్న అధికధనమును చలామణిలోనుండి ఉపసంహరించి, ధనోల్బణమును తగ్గించి, తద్వారా ధరలను తగ్గించుటకు అవకాశమిచ్చును. అందువలన ప్రభుత్వము జారీచేయు ఋణములు అన్ని తరగతులవారు తమ శక్త్యమైనంతవరకు కొనవలెను.

స్వతంత్రభారత ప్రథమబడ్జెట్ అతివాద, మితవాదవర్గముల భిన్నాభిప్రాయములకు అతీతముగానుండి, వాని రెంటిని అనుసంధానమొనర్చుచు, మధ్యమార్గము ననుసరించుచుండుట హర్షదాయకము.

కమ్యూనిజముకు జెకోస్లావాకియా బలి

యూరప్‌ఖండ రాజకీయాలు శరవేగంతో మారిపోతున్నవి

ద్వితీయ ప్రపంచ సంగ్రామ విషమఫలితాల నుంచి ఆర్థికంగాగాని, రాజకీయంగాగాని ఇప్పటికీ కోలుకోని యూరప్‌ఖండంలో ఘోరమైన అశాంతి తాండవిస్తున్నది. రాజకీయాలు శరవేగంతో మారిపోతున్నవి. రోజుకు ఒక నూత్నఘట్టం ఏర్పడుతున్నది. ఒకవైపు సోవియెట్‌రష్యా, మరొకవైపు బ్రిటన్, అమెరికాలు తమతమ ఆధిపత్యాన్ని విస్తరింపజేసుకునే నిమిత్తం పన్నుతున్న రాజకీయ ఆర్థిక వ్యూహాలే ఈ అశాంతికి ముఖ్యకారణం. సోవియెట్‌రష్యా అనుసరిస్తున్న కమ్యూనిస్టు సిద్ధాంతానికీ, అమెరికా అనుసరిస్తున్న ధనికవాద సిద్ధాంతానికీమధ్య సాగుతున్న ప్రబల సంఘర్షణ ఫలితంగా ప్రాచ్య, పశ్చిమ యూరప్‌ఖండంలో చిన్నరాజ్యాలు తమకు నచ్చిన స్వతంత్ర పద్ధతులలో యథేచ్ఛగా నడుచుకోవడం అసంభవంగా పరిణమిస్తున్నది.

ప్రాచ్య యూరప్‌కుచెందిన పోలెండు, రుమేనియా, హంగరీ దేశాలు, ఆగ్నేయ యూరప్‌ఖండములోని యుగోస్లావియా బల్గేరియా ఆల్బేనియాలు, ఉత్తరదిశన వున్న బాల్టిక్‌దేశాలు



స్టాలిన్

ప్రస్తుతం పూర్తిగా కమ్యూనిస్టు ఆధిపత్యం కింద పనిచేస్తున్నవి. ఇవన్నీ నేడు రష్యాకు ఉపగ్రహరాజ్యాలు. గ్రీసులో కమ్యూనిస్టు ప్రజాస్వామ్య శక్తులమధ్య నేటికీ ప్రచండమైన సంఘర్షణ సాగుతున్నది.

అధికార విస్తరణకోసం, ఉపగ్రహ రాజ్యాల సంఖ్యను పెంపొందజేసుకోవడంకోసం సోవియట్ రష్యా ప్రారంభించిన అశాంతి మధ్య యూరప్ రాజ్యాలకుకూడా వ్యాపించింది.

ఇప్పటివరకూ సర్వపక్ష ప్రాతినిధ్యంతో సంకీర్ణప్రభుత్వంకిందవున్న జెకోస్లావాకియాలో ఈవారం కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడింది. పోలీసు, సైన్యం మొదలైన వివిధ ప్రభుత్వశాఖలనూ పూర్తిగా కమ్యూనిస్టులతో నింపివేస్తున్నారు. భూవసతిని విభజించివేస్తున్నారు. పాఠశాలలన్నిటిలో స్టాలిన్‌చిత్రాన్ని పెట్టి కమ్యూనిస్టు ధోరణిన రాజకీయ ప్రబోధం సాగిస్తున్నారు. కమ్యూనిస్టుపార్టీకిచెందని మంత్రులు పన్నెండుమంది రాజీనామా ఇవ్వడం హఠాత్తుగా తీవ్ర ప్రతిష్టంభన ఏర్పడడం, తత్ఫలితంగా సంపూర్ణ కమ్యూనిస్టు ప్రభుత్వాధికారాన్ని స్థాపించడం సంభవించింది. సంకీర్ణ మంత్రివర్గంనుంచి సోషలిస్టులు, ప్రజాపక్షప్రతినిధులు, స్లొవక్ డెమోక్రటిక్‌పార్టీ సభ్యులు ఫిబ్రవరి 21 వ తేదీన రాజీనామాలు ఇచ్చి తప్పుకున్నారు. సర్వపక్ష ప్రాతినిధ్యంగల ప్రభుత్వమే అయినప్పటికీ, ప్రధాని క్లిమెంట్ గొట్వాల్డుమాత్రం కమ్యూనిస్టు ప్రముఖుడే. ప్రధానమైన పరిపాలనా శాఖలన్నీ మొదటినుంచీ కమ్యూనిస్టుల చేతులలోనే వున్నవి.

రాజీనామా ఇచ్చిన పన్నెండుమంది మంత్రులు మంత్రివర్గంలో పనిచేస్తూనే జకోస్లావాకియా ప్రభుత్వాన్ని కూలద్రోయడానికి కుట్రపన్నారని ప్రధాని గొట్వాల్డు ప్రత్యక్షంగా వారిమీద ఆరోపణలు చేస్తున్నాడు.

దేశీయశాఖామంత్రి మెక్లవ్ నోసెక్ (ఇతడూ కమ్యూనిస్టే) కూడా రాజీనామా ఇచ్చిన మంత్రులపై ప్రధాని చేసిన ఆరోపణలనే చేస్తున్నాడు.

జెకోస్లావాకియా రిపబ్లికన్ ప్రభుత్వాధ్యక్షుడు ఎడ్వర్డ్ బెనెష్ పాతమంత్రుల రాజీనామాలను అంగీకరించడం, ప్రధాని గొట్వాల్డ్ అధ్వర్యం కిందనే తమకు ఇష్టులైన కొత్త సభ్యులను ఎన్నుకొని మొత్తం 24 మందితో కొత్త మంత్రివర్గాన్ని స్థాపించబడం జరిగింది.

ఎడ్వర్డ్ బెనెష్ ఉత్తమదేశభక్తుడు. తమదేశ స్వాతంత్ర్యాన్ని నాజీనియంత అపహరించినప్పుడు, ప్రవాసంలోవుండి జెక్ ప్రభుత్వాన్ని నడిపి, దేశస్వాతంత్ర్యాన్ని పునఃస్థాపనచేసిన యోధుడు. జెకోస్లోవాకియా ప్రజల ఆదరాభిమానాలకు పాత్రుడైన నాయకుడు. తన దేశంలో ఏర్పడిన ఆకస్మిక రాజకీయ ప్రతిష్టంభనకు బెనెష్‌సైతం ఆశ్చర్యచకితుడై వారం రోజులపాటు ఏమీ చెప్పలేకపోయినాడు. ఒక పరిస్థితిలో బెనెష్ ఆత్మరక్షణకోసం దేశంనుంచి పలాయనం కావలసివస్తుందేమోనని వార్తలు కూడా రాలేకపోలేదు. చివరకు దేశంలోవుండే రాజకీయక్లిష్టపరిస్థితిని పరిదిద్దడానికి బెనెష్ నిర్ణయించుకొన్నట్లు తోస్తున్నది. అధ్యక్ష పదవిలో కొత్త మంత్రివర్గ సభ్యులచేత ప్రమాణవచనాన్ని స్వీకరిస్తూ, "ఈ ప్రతిష్టంభననుగురించి దీర్ఘంగా అతి త్రికరణశుద్ధిగా ఆలోచించానుమీ ప్రతిపాదనను ఒప్పుకోవడమే మంచిదని నిర్ణయించుకున్నాను. మనదేశ వ్యవహారాలను మీరు కొత్త పద్ధతులలో, నూత్న ప్రజాస్వామిక పంథాలో నడపవలెనని ఉద్యుక్తులైనారు. మీకు, జాతికీకూడా ఈ పంథా శుభప్రదం కావాలని ఆకాంక్షిస్తున్నాను" అని ఆశీర్వదించాడు.

జెక్ ప్రభుత్వాన్ని కూలద్రోయడానికి కమ్యూనిస్టు పార్టీకి చెందిన మంత్రులే కుట్రపన్నారో, సంపూర్తిగా కమ్యూనిస్టు ప్రాబల్యాన్ని స్థాపించుకోడానికి రష్యా సహాయంతో కమ్యూనిస్టులే ఈ తతంగమంతా నడిపారో స్పష్టపడడంలేదు ఉభయవర్గాల విభిన్న ఆరోపణలే ఈ సందిగ్ధానికి కారణాలు.

జెకోస్లావాకియానుండి ఫ్రాంక్‌ఫర్ట్ నగరానికి పలాయనమైన ప్రభుత్వ ప్రతికూలపక్ష ప్రముఖుడొకడు, రష్యా ప్రోద్బలం ఫలితంగానే తన దేశానికి ఈ విపత్తు సంభవించిందని బాహాటంగా చెబుతున్నాడు. రష్యా విదేశమంత్రి



ఎడ్వర్డ్ బెనెష్



జార్జి బిడాల్టు

మొలటోవ్‌కు కుడిభుజ మనదగిన జోరిన్ (విదేశశాఖ సహాయమంత్రి) ఫిబ్రవరి 19-వ తేదీన జెకొస్లావాకియా రాజధాని ప్రాగ్ నగరానికి వచ్చాడనీ, కమ్యూనిస్టుల కుట్రను ఆచరణలో పెట్టించడమే జోరిన్ రాకకు కారణమనీకూడా ఇతడు స్పష్టపరుస్తున్నాడు. రష్యానుంచి జెకొస్లావాకియాకు గోధుమలు మొదలైన ఆహారధాన్యాల దిగుమతివిషయమై ఆలోచించడానికి జోరిన్ వచ్చాడని ప్రచారంచేస్తున్న వారలు అబద్ధమనీ ఆ పనిమీదనే అతడు వచ్చివుంటే బెనెష్‌ను తప్పక కలుసుకునేవాడేననీ, ఐతే అలా కలుసుకోలేదనీ ఇతడు వాదిస్తున్నాడు.

గొట్వాల్డ్‌కు పూర్వం జెక్ ప్రధానిగా పనిచేసిన జెడ్నెక్ ఫైర్లింగర్‌ను, జోరిన్ కలుసుకొని, ఎడ్వర్డ్ బెనెష్ రాజీనామా ఇచ్చే పక్షములో అధ్యక్షస్థానాన్ని ఇస్తామనికూడా వాగ్దానం చేశాడట.

దేశంలో ఏర్పడిన రాజకీయ పక్షాల కలతలవల్ల నైతేనేమి, రష్యా దురాశా ఫలితంగా నైతేనేమి, ఇప్పటికి దాదాపు 30 సంవత్సరాలనుంచీ (నాజీ ఆక్రమణ సమయంలో తప్ప) ఉత్తమ ప్రజాస్వామ్య పరిపాలనా విధానాన్ని అనుభవిస్తూన్న జెకొస్లవాకియా ఈనాడు కమ్యూనిజముకు బలిఅయిపోయింది. 1938 లో నాజీ సిద్ధాంతానికీ, ఈనాడు కమ్యూనిస్టు సిద్ధాంతానికీ ఈ దేశం దోసిలి ఒగ్గింది.

1945 మే 9-వ తేదీన సోవియెట్ సేనలు జెక్ రాజధాని ప్రాగ్‌నగరాన్ని నాజీ ఆక్రమణనుంచి ఎప్పుడైతే ప్రప్రథమంగా విముక్తిచేసినవో జెకొస్లోవాకియాకు ఏదో ఒకనాటి ఈ దుర్గతి తప్పదని అందరూ భావించారు.

మధ్యయూరప్‌లోవున్న ఈ చిన్నదేశం యూరప్‌ఖండ వ్యాపారదృష్టిలోనూ, రాజకీయాలదృష్టిలోనూ అతి ప్రధానమైనట్టిది. ఆగ్నేయ దిశన నల్లసముద్రంవరకూ ప్రవహించే డాన్యూబ్‌నదీ వాయవ్యదిశన ఉత్తరసముద్రంవరకూ ప్రవహించే ఎల్బ్‌నదీ వుండడంవల్ల జెకొస్లావాకియా విస్తారంగా వ్యాపారంచేయడానికి వీలవుతున్నది.

ఈ విధంగా విస్తరణ కార్యక్రమాన్ని సాగించి, రష్యా తన ఉపగ్రహరాజ్యాల పశ్చిమ సరిహద్దును ఉత్తరదక్షిణదిశలగా సరిదిద్దుకొంటూ విస్తరింపజేసుకుంటున్నది.

ఈ కమ్యూనిస్టు అశాంతి ఇంతటితో ఆగేది కాదు. అచిరకాలంలోనే ఇటలీ, ఫ్రాన్సులకుకూడా పాకిపోయేమాట వాస్తవం. ఉత్తరదిశన వున్న ఫిన్లెండుతో పరస్పర సైనిక సహాయ ఒడంబడిక చేసుకోడానికి మార్షల్ స్టాలిన్ ఎత్తువేసి ఫిన్నిష్ ప్రభుత్వాధ్యక్షుడితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నాడు. ఫిన్లెండు ఇందుకు సుముఖంగా వుండక గత్యంతరంలేదు.

నాజీ నియంత హిట్లర్ రహస్యంగా బ్రహ్మాండమైన యుద్ధసన్నాహాలు జరుపుతూ 1938 లో ఏ తంత్రాంగాన్ని అనుసరించాడో, అదే తంత్రాంగాన్ని ఈనాడు మార్షల్ స్టాలిన్ కూడా అనుసరిస్తున్నాడు.

అంతర్జాతీయ రాజకీయరంగంలో రష్యా అమెరికా ప్రభుత్వాలు వేస్తున్న ఎత్తులవల్ల వాటిమధ్య సంఘర్షణ అనివార్యమే. ఏ ఒక ప్రాంతములో ఈ సంఘర్షణ ఏర్పడినా, మరొక భయంకర ప్రపంచ సంగ్రామంగా పరిణమించి తీరుతుంది.

కృత్రిమంగానూ, బుద్ధిపూర్వకంగానూ తెచ్చిపెట్టిన ప్రతిష్టంభనఫలితంగా జెకొస్లావాకియాలో పార్లమెంటరీ పరిపాలన అంతరించి ఏకపక్ష ప్రచ్ఛన్న నియంతృత్వం ఏర్పడిందని బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సులు జెకొస్లావాకియాలో జరిగిన కమ్యూనిస్టుకుతంత్రాన్ని ప్రత్యక్షంగా ఖండిస్తున్నవి.

అంతర్జాతీయ రాజకీయరంగంలో భద్రత, సౌమ్యత పోయినవనీ, మాతృదేశ స్వాతంత్ర్య ఐక్యతల విషయంలో ఫ్రెంచివారు ఇక పరాకు చిత్తగించకూడదనీ ఫ్రెంచి విదేశమంత్రి జార్జి బిడాల్టు తన ప్రజలకు ప్రత్యేక హెచ్చరిక చేస్తున్నాడు.

ఇటు ఆసియాఖండంలోనూ, అటు యూరప్‌ఖండంలోనూ మహాప్రవాహం మాదిరిగా తోసుకువస్తున్న కమ్యూనిస్టు ప్రమాదాన్ని అరికట్టడానికి అంతర్జాతీయ ప్రజాస్వామ్యసంస్థను స్థాపించేనిమిత్తం వివిధదేశాలరాజకీయపక్ష నాయకులమధ్య సంప్రతిపులు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్నవి. బ్రిటన్, ఫ్రాన్సు, నార్వే, బెల్జియందేశాలు ఈ విషయంలో ముందంజవేసి పనిచేస్తున్నవి. ప్రపంచమంతటా ప్రజాస్వామ్యాన్ని సంరక్షించడానికీ, ప్రజాస్వామ్య సిద్ధాంతాలను వ్యాపింపజేసి, బలపరచడానికీ ఈ సంస్థ రష్యా అధ్వర్యం కింద పనిచేస్తున్న అంతర్జాతీయ కమ్యూనిస్టు ప్రచారక సంస్థకు ప్రతిగా పనిచేస్తుంది. ఈ ప్రజాస్వామ్య రక్షణ సంస్థకు ప్రధాన కార్యాలయం లండన్‌గా వుంటుందట. తృతీయప్రపంచ సంగ్రామ ప్రమాదం ఆసన్నమైనదనే సూచనలను గమనించి, మానవజాతి కలవరపడుతున్న ఈ సమయంలో ప్రపంచ పౌరుల వ్యక్తిస్వాతంత్ర్యాన్ని, ప్రజాస్వామిక హక్కులను కాపాడడానికి ఈ సంస్థ కొంతవరకైనా సహాయపడుతుందనే ఆశించవచ్చు. నిరంకుశమైన ఏకపక్ష పరిపాలనావిధానాన్ని తక్షణచర్యలద్వారా ప్రతిఘటించడానికి ఇది ఉపయోగపడుతుంది.

నవల

నారాయణభట్టు

శ్రీ నోరి నరసింహశాస్త్రి

౧౨

శ్రీమదాంధ్రమహాభారతావతారిక

అది విజయనామసంవత్సర వైశాఖ బహుళ ఏకాదశి శనివారము !

ఆనాడు రాజరాజనరేంద్రుడు సకల భువన లక్ష్మీ విలాసనివాసంబయిన రమ్యహర్మ్యంబున కొలువుతీరెను.

వజ్జియప్రెగ్గడ మంత్రీశ్వరుడును, పురోహితుడును, నృపకామ సేనాపతియు, ముప్పరాజు, జననాథుడు రాజమయ్య ఇత్యాది దండనాథులును, విజయాదిత్యుడు శక్తివర్మ ఇత్యాది మహాప్రధాన రాజబంధువులును, నాణ్యదేవుడు మొదలుగాగల సామంత మండలేశ్వరులును పరివేష్టించియుండిరి. యవనవిలాసినులు చామరములు గ్రహించి వేయుచుండిరి. దౌవారికుడు రావలసిన సభ్యులను రానిచ్చుచుండెను.

యువరాజ రాజేంద్రదేవుడు అంతకు పూర్వము వాయిదా నగరమునకు ప్రయాణమైయుండుటచే నా సభకు రాలేదు. వేంగీమండల మంతటను శాంతి నెలకొనినందున వజ్జియప్రెగ్గడ కుమారునికి విశ్రాంతి చిక్కి సభ కరుదెంచి వజ్జియకు సమీపమున కూరుచుండెను.

ఆ సభలో సపాదలక్షశాస్త్రపారగులగు వైయాకరణులును భారతరామాయణాద్యనేక పురాణప్రవీణులైన పౌరాణికులును మృదుమధుర రసభావ భాసుర నవార్థ వచనరచనా విశారదులయిన భీమనభట్టు, చట్టనభట్టు, ముట్టనభట్టు, కృపమిశ్ర, బిల్హణభట్టు, క్షేమేంద్ర, చిత్రపాద మహాకవులును, వివిధతర్క విగాహిత సమస్త శాస్త్రసాగరగరీయః ప్రతిభులైన చిదమార్య పంపనార్యాది తార్కికులును నాదిగా గల విద్వజ్జనంబులు రాజరాజనరేంద్రుని పరివేష్టించి విద్యావిలాసగోష్ఠికి కొలిచియుండిరి. నన్నయ భట్టారకుడు ప్రత్యేకముగా నున్న ఆసనమున నుపవిష్టుడయ్యెను. మాగధుని వంశానుకీర్తనానంతరము వంది నూతన శ్లోకములు చదివెను.

సంరక్షతి క్షితితలం కుపితారివర్గే
మార్గేన యేన నయశాలిని మానవేన
ప్రీతాః ప్రజా నిజపవిత్రచరిత్రతోయైః
ప్రక్షాలయంతి కలికాలకలంకపంకమ్.

సన్మార్గేణ కులం కలాగమరస
 జ్ఞానేన కర్వన్ ధియమ్
దీనానాథజనార్తితోరనివహా
 త్యాగేన లక్ష్మీం స్థిరామ్
సంపూర్ణామలచంద్రికావిశద యా
 కీర్త్యా జగద్గీతయా
యో దిక్చక్ర మలంకరోతి సుతరాం
 చాళుక్య చూడామణిః ॥

* * *

పిత్రోర్వంశగురూ బభూవతురలం
 యస్య స్ఫురత్తేజసా
సూర్యాచంద్రమసౌ నిరస్త తమసౌ
 దేవౌ జగచ్చక్షుషీ
దంష్ట్రాకోటిసముద్ధృతాఖిల మహీ
 చక్రం మహత్క్రీడయా
విష్ణో రాదివరాహరూప మభవ
 ద్యచ్ఛాసనే లాంఛనమ్ ॥

స సర్వలోకాశ్రయ శ్రీ విష్ణువర్ధన మహారాజాధిరాజ, పరమేశ్వరః జయతు జయతు. పరమ భట్టారకః జయతు జయతు. పరమ మాహేశ్వరః జయతు జయతు. పరమబ్రహ్మణ్యః జయతు జయతు శ్రీరాజరాజదేవో జయతుజయతేతరామ్.

అంతట మరియొక వంది ముందు నన్నయ భట్టారకునికి నమస్కరించి ఇట్లు ప్రారంభించెను.

శ్రీ వాణీ గిరిజా శ్చిరాయ దధతో
 వక్షో ముఖాంగేషుయే
లోకానాం స్థితి మావహం త్యవిహతాం
 స్త్రీపుంసయోగోద్భవామ్
తే వేదత్రయమూర్తయ స్త్రి
 పురుషాః సంపూజితా వ స్సురై
ర్భూయాసుః పురుషోత్త మాంబుజభవ
 శ్రీకంధరా శ్శ్రేయసే ॥

అని సకల భువన రక్షణ ప్రభువులైయాద్యులైన హరిహర హిరణ్యగర్భ పద్మోమా వాణీపతుల స్తుతియింతు. తత్ప్రసాద సమాసాదిత నిత్య ప్రవర్ధమాన మహామహీ రాజ్యవిభవుండును నిజ భుజ విక్రమ విజితారాతిరాజ నివహుండును సకల జగజ్జేగీయమాన నానాగుణరత్న రత్నాకరుండును నై పరగుచున్న రాజరాజనరేంద్రుండు,

రాజకులైకభూషణుడు
 రాజమనోహరు డన్యరాజతే
జోజయశాలిశౌర్యుడు వి
 శుద్ధయశశ్శరదిందుచంద్రికా
రాజితసర్వలోకు డప
 రాజితభూరిభుజాకృపాణధా
రాజలశాంతశాత్రవప
 రాగుడు రాజమహేంద్రు డున్నతిన్.

విమలాదిత్యతనూజుడు
 విమల విచారుడు కుమారవిద్యాధరుడు
త్తమశాళుక్యుడు వివిధా
 గమవిజితశ్రముడు తుహినకరు డురుకాం [తిన్.
ఘనదురితానుబంధ కలి
 కాలజదోషతుషారసంహతిం
దన యుదయప్రభావమున
 దవ్వగజూపి జగజ్జనానురం
జనమగు రాజ్యసంతతివ
 సంతనితాంతవిభూతి నెంతయుం
దనరు చళుక్యమన్మథుడు
 ధర్మదయార్ద్రనిబద్ధబుద్ధియై.
ఆశ్రితపోషణంబున న
 నంత విలాసమునన్ మనీషివి
ద్యాశ్రమ తత్త్వవిత్త్వమున
 దానగుణాభిరతిన్ సమస్తవ
ర్ణాశ్రమ ధర్మరక్షణమ
 హామహిమన్ మహి నొప్పు సర్వలో
కాశ్రయు డాదిరాజనిభు
 డత్యకలంకచరిత్రసంపదన్.

నిజమహీమండల ప్రజ ప్రీతి జెంచుచు
 బరమండలంబుల ధరణిపతుల
నదిమి కప్పంబుల ముదముతో గొనుచును
 బలిమినీయని భూమివలయపతుల
నుక్కడగించుచు దిక్కుల దనయాజ్ఞ
 వెలిగించుచును విప్రకులము నెల్ల
బ్రోచుచు శరణన్నగాచుచు భీతుల
 నగ్రజన్ములకు ననుగ్రహమున
జారుతర మహాగ్రహారంబు లిచ్చుచు
 దేవభోగముల మహావిభూతి
దనరజేయు చిట్లు మనుమార్గుడగు విష్ణు
 వర్ధనుండు వంశవర్ధనుండు.

అఖిల జలధి వేలా వలయ వలయిత వసుమతీ వనితావిభూషణంబైన వేంగీదేశంబునకు నాయకరత్నంబునుంబోని యీ రాజమహేంద్రపురంబునందు మహేంద్రమహిమతో పరమానందంబున ననవరతమహీ రాజ్యసుఖంబు ననుభవించు !"

వందికీర్తనమైన పిమ్మట రాజరాజు మాట్లాడ వలె నన్నట్లు కనపడగానే సభ నిశ్శబ్దమయ్యెను. రాజరాజిట్లనెను:

"నన్నయభట్టారకా, జనమేజయునకు వేదవ్యాసునివలె నీవు మాకు కులబ్రాహ్మణుడవు, పూజ్యుడవు, అనురక్తుడవు. నీవే సర్వవిధముల శ్రీ మహాభారత సంహిత తెనుగుచేయ నుత్తమాధికారి వని ని న్నా కార్యమునకు ఈ పరిషన్ముఖమున వరించుచున్నాను. ఈ పరిషత్తు నీ యోగ్యత వివరించుగాక !"

ముందు రాజరాజ పురోహితుడు, "నన్నయ యవిరళ జప హోమ తత్పరుడు !" అని వాక్రుచ్చెను.

"బ్రహ్మాండాది నానాపురాణ విజ్ఞాననిరతు" డని పౌరాణికులు నిర్ధారించిరి.

"ఇతడే పాత్రుడు !" అని పంపనభట్టాది మీమాంసకులు నిర్ణయించిరి.

"సద్వినుతావదాత చరిత్రుడు" అని నీతివిదులు పల్కిరి.

"నన్నయ లోకజ్ఞుడుకూడ" నని వజ్జియప్రెగ్గడ సెలవిచ్చెను.

"ఉభయ భాషా కావ్యరచనాభిశోభితు" డని నారాయణభట్టు పొగడెను.

"నిత్యసత్యవచను" డని ప్రాడ్వివాకుడు చీదమార్యుడు సెలవిచ్చెను.

"మత్యమరాధిపాచార్యు" డని నృపకామ పందుకొనెను.

"సుజనుడు నన్నయ" అని సభ వారందరు వచించిరి.

రాజరాజు సంతోషించి ఇట్లు మరల పలికెను:

"విమలమతిం బురాణములు
 వింటి ననేకము లర్థధర్మశా
స్త్రముల తెరంగెరింగితిని
 దాత్తరసాన్విత కావ్యనాటక
క్రమములు పెక్కు సూచితి జగ
 త్పరిపూజ్యము లైన యీశ్వరా
గమములయందు నిల్పితి బ్ర
 కాశముగా హృదయంబు భక్తితోన్.

"అయినను ననవరతంబును శ్రీ మహా భారతంబునందలి యభిప్రాయంబు విన నభిలాష పెద్దయైయుండు.

"ఇవి యేనున్ సతతంబు నాయెడ గరం
 బిష్టంబులై యుండు బ్రా
హ్మవు భూదేవకులాభి తర్పణ మహీ
 యః ప్రీతియున్ భారత
శ్రవణాసక్తియు బార్వతీ పతి పదా
 బ్జధ్యాన పూజామహో
త్సవమున్ సంతతదానశీలతయు ని
 శ్వాత్సానుసాంగత్యమున్.

"మరి యదియునుం గాక—

"హిమకరు దొట్టిపూరు భర
 తేశ కురుప్రభు పాండుభూపతుల్
క్రమమున వంశకర్తలన
 గామహి నొప్పిన యస్మదీయ వం
శమున బ్రసిద్ధులై విమల
 సద్గుణశోభితులైన పాండవో
త్తముల చరిత్ర నాకు సత
 తంబు వినంగ నభీష్టమెంతయున్.

"అమలసువర్ణశృంగఖుర
 మై కపిలంబగు గోశతంబును
త్తమ బహువేదవిప్రులకు
 దానము సేసిన తత్ఫలంబు త
థ్యము సమకూరు భారత క
 థా శ్రవణాభిరతిన్ మదీయ చి
త్తము ననిశంబు భారత క
 థాశ్రవణ ప్రవణంబు కావునన్.

"జననుత కృష్ణద్వైపా
యన మునివృషభాభిహితమహాభారత బ
ద్ధనిరూపితార్థ మేర్పడ
దెనుగున రచియింపు మధికధీయుక్తిమెయిన్.

"బహుభాషల బహువిధముల
బహుజనములవలన వినుచు భారతబద్ధ
స్పృహులగువారికి నెప్పుడు
బహుయాగంబుల ఫలంబు పరమార్థమగున్"

ఇట్లానతిచ్చిన విని యక్కవివరుం డిట్లనియె:

"అమలినతారకాసముద
 యంబుల నెన్నను సర్వవేదశా
స్త్రముల యశేషపారము ము
 కుంబున బొందను బుద్ధిబాహువి
క్రమమున దుర్గమార్థజల
 గౌరవభారత భారతీ సము
ద్రము దరియంగ నీదను వి
 ధాతృనకైనను నేర బోలునే"

నన్నయ భట్టారకు డొక్కక్షణ మాగెను. వజ్జియ ముఖమున కంత సూచితమయ్యెను. రాజరాజు ముఖము ఆశ్చర్యముతో ప్రశ్నించుచున్న ట్లుండెను. సభ యంతయు ఉద్వేగము హృదయముల ప్రేరేచుచుండగా నిస్తబ్ధమయ్యెను.

ఇంతలో నన్నయ—

"అయినను, దేవా—" అనెను.

ఆ రెండుమాటలు నను నప్పటికి సభలో నొక్కసారిగా జయజయనినాదములు వజ్జియ యొద్దనుండి దౌవారికునివరకు ప్రసరించెను. రాజరాజు ముఖము ప్రసన్నమై వికసించెను.

"అయినను, దేవా, నీయనుమతంబున విద్వజ్జనంబుల యనుగ్రహంబునంజేసి నా నేర్చువిధంబున నికావ్యంబు రచియించెద."

"హరిహర గజాననార్క ష
 డాస్యమాతృ సరస్వతీ
గిరిసుతాదిక దేవతాతతి
 కిన్ నమస్కృతి సేసి దు
ర్భరతపోవిభవాధికున్ గురు
 పద్య విద్యకు నాద్యు నం
బురుహగర్భనిభుం బ్రచేత సు
 పుత్రు భక్తి దలంచుచున్."

"భారత భారతీ శుభగ
 భస్తి చయంబులజేసి ఘోరసం
సారవికారసంతమస
 జాల విజృంభము వాపి సూరిచే
తోరుచిరాబ్జబోధనర
 తుండగు దవ్యపరాశరాత్మజాం
భోరుహమిత్రు గొల్చి ముని
 పూజితు భూరియశోవిరాజితున్.

"పరమవివేక సౌరభవి
 భాసిత సద్గుణపుంజ వారిజో
త్కరరుచిరంబులై సకల
 గమ్య సుతీర్థములై మహోన్నతో
హరసుచరిత్రపావనప
 యఃపరిపూర్ణములైన సత్సభాం
తరసరసీవనంబుల ము

(22-వ పేజీచూడుడు)

హైదరాబాదు సంస్థాన కాంగ్రెస్ ఉద్యమం

శ్రీ తెన్నేటి విశ్వనాధం

హైదరాబాదు సంస్థాన కాంగ్రెస్ ఆధ్వర్యం క్రింద జరుగుతున్న సంగ్రామం ప్రాధాన్యం సరిగా గుర్తించబడలేదనీ, కొందరు గుర్తించినా తరుణంమించిందనీ నా నమ్మకం. అయితే మరీ మించిపోలేదు.

హైదరాబాదు సంస్థానం దక్కను పీఠభూమిలో ముఖ్యప్రదేశం. భారత సమాఖ్యలో ఉత్తరదక్షిణాలుగానూ, తూర్పు పడమరలుగానూ పోయే మార్గాలన్నీ ఈ సంస్థానంగుండా పోవాలి. దక్షిణభారతదేశంలోకల్లా పెద్దదైన నది చాలవరకూ ఈ సంస్థానానికి సరిహద్దుగా ప్రవహిస్తూ సమీపరాష్ట్రాలకూ సంస్థానానికి మధ్య, నీటి పంపకాలవిషయంలో సమస్యలు తెచ్చిపెట్టుతోంది.

సంస్థానం తూర్పు పడమరలుగా వ్యాపించాలని యత్నిస్తోంది. ఇప్పుడు మొత్తం దాదాపు 82,000 చతురపుమైళ్ళ వైశాల్యం. జనాభాలో నూరింట 87 వంతులు హిందువులు. 12 వంతులు మహమ్మదీయులు. మిగతావారు ఒక వంతు.

పట్టణాల్లో ఉండే ఏ కొద్దిమంది మహమ్మదీయుల్లోనో భారతీయ విముఖత అలవడ్డం తప్ప పల్లె ప్రాంతాల్లో మహమ్మదీయులంతా జన్మభూమి పట్ల భక్తి గలవారే. వారు ప్రాంతీయ భాషలైన తెలుగు, మరాఠీ, కన్నడాలే ఉపయోగిస్తారు.

వారు చాలవరకూ హిందూ ఆచార వ్యవహారాలే అనుసరిస్తారు. హిందువుల మాదిరిగానే శోవతులు ధరిస్తారు. హిందూదేవతల్ని ఆరాధిస్తారు. వివాహాది విషయాల్లో హిందువుల మాదిరిగానే సుముహూర్తాలు, మంచి నక్షత్రాలూ చూసుకుంటారు.

ఇక్కడ మహమ్మదీయుల్లో నూరింట 10 వంతులు మాత్రమే భారతదేశంలోని రాజ్యాలపైకి దండెత్తివచ్చి ఇక్కడ స్థిరపడిపోయినవారయి ఉంటారు. మిగతా వారంతా మతాన్ని మార్చుకున్న వారని సులభంగా చెప్పవచ్చు. వాస్తవానికి షాహీ వంశంలో ఒక ప్రభువు కర్ణాటక బ్రాహ్మణుడే. ఇస్లాంమతం తీసుకున్నాడు. అయినప్పటికీ సంస్థానాన్ని ముస్లిం రాజ్యంగా పాలిస్తున్నాడిప్పుడు. ప్రధానమైన ఉద్యోగాలన్నిటిలోనూ మహమ్మదీయులే ఉన్నారు. మిలిటరీలో నూరింట నూరువంతులు మహమ్మదీయులే. పోలీసుశాఖలో నూరింట 90 వంతులు. ఇతర ప్రభుత్వోద్యోగాల్లోనూ నూరింట 80 వంతులు మహమ్మదీయులే ఉన్నారు.

ఒక్క ఆర్థిక శాఖ కార్యదర్శి తప్ప మిగతా ఉన్నత ప్రభుత్వోద్యోగాలన్నిటిలోనూ మహమ్మదీయులున్నారు. దాదాపు హిందువులంతా నిరాయుధులు.

సంస్థాన కాంగ్రెస్ 1938 లో జన్మించింది. ఈ సంస్థ నిజాం రాష్ట్ర ఆంధ్రమహాసభ, గ్రంథాలయోద్యమాలనుంచీ, మహారాష్ట్ర కన్నడ దేశాల్లో ఇట్టి సంస్థల నుంచీ పుట్టింది. 1938లో ఈ మూడు ఉద్యమాలూ కలిసి హైదరాబాదు సంస్థాన కాంగ్రెసుగా మారాయి. ఈ సంస్థను హైదరాబాద్ ప్రభుత్వం నిషేధించింది.

1946 జూలై 8 వ తేదీని నిషేధం తొలగించబడింది. తిరిగి 1947 ఆగస్టువరకూ ఉద్యమం పూర్తిగా అణచబడింది. భారతదేశానికి స్వాతంత్ర్యం లభించడంతో, భారత సంస్థానాలపై సార్వభౌమత్వం అంతరించడంతో ఒక క్లిష్ట సమస్య వచ్చింది. భారత అధినివేశంలో కాని, పాకిస్తాన్‌లోగాని చేరడానికి నిర్ణయ స్వాతంత్ర్యాన్ని పొందిన హైదరాబాదు సంస్థానం రెండింటిలో దేనిలోనూ చేరడానికి నిరాకరించింది నియంతృత్వ లక్షణాలుగల మహమ్మదీయుడు పాలకుడుగా ఉన్నందువల్ల, ఇటువంటి వైఖరివల్ల సంభవించే ప్రమాదం అందరూ గుర్తించినదే.

ఈ పరిస్థితుల్లో హైదరాబాదు ప్రజానీకం తరఫున భారతఅధినివేశంలో చేరాలనీ, సంస్థానంలో సంపూర్ణబాధ్యతాయుత ప్రభుత్వం నెలకొల్పాలనే ఈ లక్ష్య ద్వయంతో సంస్థాన కాంగ్రెస్ ఉద్యమం ఆరంభించింది. ఈ సంగ్రామం ఆగస్టులో ప్రారంభమైంది. కొంత చెప్పుకోదగిన విజయంకూడా సాధించింది. ఈ సంస్థకు స్వామి రామానందతీర్థ మొదలగు సమర్థులు, దేశభక్తులు, త్యాగశీలులైనవారి నాయకత్వం లభించింది.

సంస్థానకాంగ్రెస్‌లో ఇప్పుడు రెండున్నర లక్షల సభ్యులున్నారు. ఆంధ్ర ప్రాంతానికి హైదరాబాదు, మహారాష్ట్ర ప్రాంతానికి ఔరంగాబాదు, కన్నడప్రాంతానికి గుల్బర్గా కేంద్రాలుగా ఉన్నాయి. అనేకనిరోధాలున్నప్పటికీ ప్రజానీకాన్ని కూడ దీస్తున్నవి.

హైదరాబాదు సంస్థానంలో అనుమతిలేనిదే బహిరంగ సభలు జరపకూడదని నిషేధం ఉంది. ఈ నిషేదాన్ని అతిక్రమించి సంస్థానకాంగ్రెస్ సభలు జరపవలసి వచ్చింది.

సంస్థాన మంతటా సభలు జరిగాయి. భారత అధినివేశ పతాకాలు ప్రతిష్ఠితమైనాయి. సంస్థాన శాసనాన్ననుసరించి భారత అధినివేశ పతాకను ప్రతిష్ఠించడం నేరం.

ఉద్యమ వ్యాప్తికి మరొకమెట్టు అబ్కారీ శాసనాతిక్రమణ. వందలాది జనం ఊరేగింపులతో వెళ్ళి తాటిచెట్లు పడగొట్టారు. ఇప్పుడు సంస్థానం యొక్క అబ్కారీ ఆదాయం ఆరంభంలో ఎంత వుందో అంతకుదిగింది.

సంస్థాన కాంగ్రెస్ దాదాపు 200 గ్రామాలలో గ్రామ పంచాయితీలు స్థాపించింది. సంస్థాన కాంగ్రెస్ ఆదేశానుసారం 2000 మంది గ్రామోద్యోగులు రాజీనామా లిచ్చారు.

తరవాత ఉద్యమం శిస్తు నిరాకరణగా మారినది. ధాన్యపు సుంకాలను కూడా నిరాకరించారు. సంస్థానంలో ప్రతి ఉత్పత్తిదారు, ఎకరానికి మూడు మొదలు అయిదు మణుగుల వరకూ ధాన్యం సంస్థాన ప్రభుత్వానికివ్వాలి. జొన్నలు పండించేవారు అర మణుగు మొదలు ఒకటిన్నర మణుగుల చొప్పున ఇవ్వాలి. ఈ సుంకాలన్నీ ప్రజలు చెల్లించ నిరాకరించారు. అనేక వందల గ్రామాల్లో గ్రామానికి సంబంధించిన రికార్డుల్ని ప్రజలు స్వాధీనపర్చుకున్నారు. భారత ప్రభుత్వప్రాంత సరిహద్దుల్లో ఉన్న 750 కస్టమ్సు పోస్టుల్లో 500 మాయమైనాయి. పాఠశాలల్ని, కళాశాలల్ని, టెక్నికల్ విద్యాలయాల్ని విద్యార్థులు 15,000 మంది విడిచిపెట్టి ఉద్యమంలో ప్రవేశించారు. పదివేలమంది కారాగారాల్లో ఉన్నారు. ఇంకా వందలాది వారిని అనుసరిస్తున్నారు. ఇటీవల 200 మంది న్యాయవాదులు సంస్థాన కాంగ్రెస్ ఆదేశాన్ననుసరించి న్యాయస్థానాలు విడిచిపెట్టారు. సంస్థాన కాంగ్రెస్ ఎన్ని నిర్బంధాలలో పనిచేస్తున్నదో చూస్తే ఇంతవరకూ సాధించినది సామాన్యమైనది కాదని తెలుస్తున్నది.

ఉద్యమం సంస్థానంలో నలుమూలలా దట్టంగా వ్యాపించింది. తెలుగు సరిహద్దు జిల్లాలైన వరంగల్, నల్లగొండ, మహబూబ్ నగరాల్లోనూ, ఔరంగాబాద్, నందేడ్, ఉస్మానాబాద్ అనే మహారాష్ట్రజిల్లాల్లోనూ, రాయచూరులోని కన్నడ ప్రాంతాల్లోనూ ఈ ఉద్యమం తీవ్రంగా ఉంది. కరీంనగర్, పర్భనీ, బీదర్ జిల్లాల్లోకూడా ఉద్యమం బాగా సాగుతున్నది. మిగతా జిల్లాల్లో అనేకమంది కారాగారాలకు పోతున్నారు. భారత అధినివేశ పతాకలు ప్రతిష్ఠిస్తున్నారు. హైదరాబాదు నగరంలో సత్యాగ్రహం క్రమబద్ధంగా జరుగుతోంది.

అహింసావ్రతానికి కట్టుబడిన సంస్థాన కాంగ్రెస్‌కు ప్రభుత్వ నిరోధమేకాక మరొకటి ఎదురై నిలిచింది. భారతదేశంలో మనం సత్యాగ్రహం జరిపినప్పుడు ప్రభుత్వాన్ని మాత్రమే ఎదిరించాం. మనతో ఏకీభవించనివారు అసంతృప్తి వెల్లడించి ఊరకునేవారేగాని మనల్ని ఎదిరించి పోరాడలేదు.

1942 లో కొంత భిన్నంగా జరిగినా అట్టే కాలం లేదు. హైదరాబాదు సంస్థానంలో మాత్రం ప్రభుత్వం ప్రాపుగల ఇత్తెహాదుల్ ముసల్మీన్ ఉంది ఇది సంస్థానంలోని ప్రజలపైనా, కాంగ్రెస్‌పైనా విరుచుకుపడి విచ్చలవిడిగా సంచరిస్తోంది. ప్రతిదినం దోపిళ్లు, ఇళ్లకు నిప్పులు, స్త్రీలకు మానభంగాలు గురించినవార్తలు వస్తున్నాయి. వేలాదిగా శరణార్థులు తమ ఆస్తులను, తమ వారిని విడిచి సరిహద్దునున్న జిల్లాల్లోకి పారిపోయి వస్తున్నారు.

గడచినమాసాల్లో మనకు చేరుతున్న వార్తల్ని రూఢిపరచడానికి మంత్రి రామాచారిగారు తెలిపిన వృత్తాంతం సహాయపడుతోంది.

నీతికి నీళ్ళువదిలి ప్రజలపైన చెప్పరాని అత్యాచారాలు జరుపుతున్నారు. సంస్థాన కాంగ్రెస్ అహింసావ్రతానికి దీక్షవహించి ఉండగా ఇత్తెహాదుల్ వాలంటీర్లకు హైదరాబాదు ప్రభుత్వం ఉచితంగా మారణాయుధాలిచ్చి పోరాటం జరుపుతోంది సంస్థాన కాంగ్రెస్ ఈ అధర్మయుద్ధాన్ని ఎంతకాలం ఎదిరించి నిలవగలదో చూడవలసి ఉంది.


సంస్థాన కాంగ్రెస్ ఉద్యమం ఉధృతమై వ్యాపిస్తూఉన్న సమయంలో భారత ప్రభుత్వం హైదరాబాదు ప్రభుత్వంతో ఒక సంవత్సరం యథాతథపు ఒడంబడిక చేసుకుంది. ఇది సంస్థాన ప్రభుత్వంయొక్క నిరంకుశ పీడనకు దోహదం ఇచ్చింది. ఫలితాలనుబట్టి చూస్తే ఈ ఒడంబడిక విఫలమైనట్లే. ఈ ఒడంబడికకు విరుద్ధంగా హైదరాబాదు ప్రభుత్వం రు. 20 కోట్ల సెక్యూరిటీలను పాకిస్తాన్‌కు అప్పు ఇచ్చింది. సంస్థానంలో భారతీయ నాణీల చలామణిని నిషేధించింది, అనుబంధసైన్యాల శిక్షణకు సహాయపడింది. సరిహద్దులో భారత అధినివేశ గ్రామాలను దోచుకోడానికి అవకాశమిచ్చింది. మునగాలకు వచ్చిపోయే ప్రజలకు భారత అధినివేశ పోలీసులకు చిత్తంవచ్చినట్లు ఆటంకం పెట్టుతోంది.

భారత ప్రభుత్వంతో సమాలోచనలు జరుగుతున్నవన్న సమాచారం సంతోషదాయకంగానే వుంది. కాని మనం చేసే శైలనాసశే సంస్థాన కాంగ్రెస్‌కు సహాయపడితే సేతప్ప, హైదరాబాదు ప్రభుత్వం భారత ప్రభుత్వంగాని మన రాష్ట్రప్రభుత్వంగాని ఎన్ని సమాలోచనలు జరిపినా, ఎన్ని ఒడంబడికలు చేసుకున్నా వృథాయే.

భారత ప్రభుత్వం కోరేది సంస్థాన ప్రజలకు మనస్కరించేదయి వుండాలి. పరిస్థితి ఎంత క్లిష్టంగా ఉందో గ్రహించిన భారత ఆంతరంగిక శాఖామంత్రి వెంటనే తగుచర్య తీసుకోగలరని నమ్ముతున్నాను. జునాగఢ్‌లోగాని కాశ్మీరంలోగాని చర్య తీసుకోవడం తక్షణావసరమని తోచినట్లయితే, భారతదేశ క్షేమంకోసమే హైదరాబాదుకు ప్రాధాన్యం ఇవ్వవలసివుంటుందని చెప్పాలి.

మద్రాసు ప్రభుత్వం మన రాష్ట్రంలోఉన్న సంస్థాన కాంగ్రెస్ ఉద్యమకారులను ఏ విధంగానూ ఆటంకపరచరాదు. సరిహద్దు జిల్లాల్లోకి హైదరాబాదునుంచి పారిపోయివచ్చినవారిని దేశీయరక్షకదళాల్లోకి (హోంగార్డ్సు) చేర్చుకోవడం మంచిది. శరణార్థులకు ఈ రాష్ట్రవాసులు ప్రశంసార్హమైన సహాయం చేశారు. ఉద్యమానికి నైతికంగానూ, ఇతరత్రానూ ప్రజలు పత్రికలు చాలా తోడ్పడినాయి. కాని ఇంకా చేయవలసివుంది.

త్వరలో ఈ ప్రజోద్యమం సంస్థాన కాంగ్రెస్ నాయకత్వం క్రింద సఫలమై, సంస్థానం భారత సమాఖ్యలో చేరుతుందనీ, పరిస్థితులు సుముఖంగా ఉన్నప్పుడు సంస్థానం ఆంధ్ర, మహారాష్ట్ర, కన్నడ భాషా ప్రాంతాలుగా విడివడి మూడు రాష్ట్రాలలోనూ చేరగలవనీ మనం ఆశించవలసి ఉన్నది.



బొంబైలో ఈమధ్య ప్రత్యేక సమావేశం జరిపి తమసంస్థానాలను రాష్ట్రపరిపాలనకిందికి మార్చుటకు నిశ్చయించిన డక్కన్ సంస్థానాధీశులు. ఈ నిర్ణయంద్వారా 15 సంస్థానాలు బొంబై రాష్ట్రంలో చేరినవి.

నెహ్రూ వైదేశిక విధానము

అమర్ లహరి

విదేశీవ్యవహారాలను చాతుర్యంతో నిర్వహించటంలో అనుభవం లేక పోవటం వలన భారత దేశం విదేశాలతో రాజకీయ సంబంధాలలో అంతర్జాతీయ సంప్రదాయాను గుణములైన విధానాలను అనుసరింప లేక పోతున్నది. భారతదేశ విదేశీవ్యవహార శాఖ నిర్వహణయంత్రం ఈ మధ్యనే ఏర్పరచబడి, ఇప్పుడిప్పుడే స్థిమిత పడుతున్నది. ఇంత త్వరలో సక్రమంగా పనిచేయగల్గటం కష్టమే. అనుభవం సంపాదించుకున్న కొద్దీ విదేశీవ్యవహారాలలో జాతీయశ్రేయోభివృద్ధికి తగినట్లుగా వ్యవహరించటం, ఈ శాఖ అలవరుచుకోగలదు.

ప్రస్తుతం భారతదేశం "నెహ్రూ అంతర్జాతీయ విధానము" ద్వారా అంతర్జాతీయ సంబంధ బాంధవ్యాలు పెంపొందించుకొనవలెనని ఉద్దేశిస్తున్నది. నేటి కల్లోలిత అంతర్జాతీయ రాజకీయ రంగంలో, ఏ ఒక వైపుకూ మొగ్గిపోక, మధ్యమార్గము ననుసరించవలెనను ఈవిధానము పైకి చాల ఆకర్షణీయంగానే కనిపిస్తున్నది.

రెండు ఆశయాలు

నెహ్రూ అంతర్జాతీయ విధానము రెండు ఆశయాలను సాధించుటకు ఉద్దేశింపబడినది: ఒకటి, జాతీయ శ్రేయోభివృద్ధికి తగినటుగా విదేశములతో సంబంధ బాంధవ్యాలు ఏర్పరచుకొనడము; రెండు, తటస్థవైఖరి నవలంబిస్తుండటము. అంతర్జాతీయ సంఘర్షణలు సంభవించినప్పుడు ఏపక్షంతో చేరితే, మన దేశ శ్రేయోభివృద్ధికి ఎక్కువ దోహదం లభించగలదో ఆ పక్షముతో భారత దేశం చేరగలదని ఈ రెండవ ఆశయం వ్యాఖ్యానించబడింది. ఈ విధానము సూత్రప్రాయంగా బాగానే వున్నా, అందులో మనకు నమ్మకమున్నా, అలౌకికము, నిర్వీర్యము నని మనం గమనించాలి.

మన దేశ శ్రేయోభివృద్ధికి దోహదము చేయునట్లుగా విదేశములతో సంబంధము నేర్పరచుకొనవలెనను విధానము, జయప్రదముగా నిర్వహింపబడుటకు ఇతరదేశముల సహకార, సుహృద్భావములపై నాధారపడియుండును. రాయబారులద్వారాను, ప్రతినిధులద్వారాను ఇతర దేశములతో మామూలుగా సంబంధములు ఏర్పరచుకొనుటవలన ఈ ఆశయము ఈడేరదు.

ప్రత్యేక ఒడంబడికలు చేసుకోవాలి


అంతర్జాతీయ సంబంధాలద్వారా దేశ శ్రేయోభివృద్ధి జరగవలెనంటే, అంతర్జాతీయ రాజకీయ రంగనాయకులతోను, వారి అనుయాయులతోను భారతదేశం ప్రత్యేక ఒడంబడికలు చేసుకోవలెను. పరస్పరసహకారభావములతో మెలగుట, అన్ని పక్షములకు మేలని తద్వారా భారతదేశము గుర్తించగలదు. అప్పుడు తటస్థవైఖరి నవలంబించవలెననుట 'బూటక' మైపోతుంది. తటస్థవైఖరిద్వారా దేశ శ్రేయోభివృద్ధికి దోహదము జరుగదనుట నిస్సందేహము.

ప్రాముఖ్యతకు ప్రాకులాట

రెండవ ఆశయమునకు ఇచ్చిన వివరణను పరిశీలించినతో, అంతర్జాతీయ ప్రజాస్వామ్యమునకు, అంతర్జాతీయ కమ్యూనిజమునకు మధ్య చెలరేగుచున్న వివాదములో, తగిన సమయమున, మనకు లాభకారిగా కన్పట్టిన పక్షమున చేరవలెనని నెహ్రూవిధానము ఉద్దేశించుచున్నట్లు స్పష్టపడగలదు. ఇటువంటి ఉద్దేశ్యము తటస్థవైఖరి నవలంబించ దలచువారికి కలుగరలసినదికాదు. కొంతకాలమువరకు ఏ పక్షమును చేరకుండా, అనిశ్చితంగా వుండి, వివాదములో నున్న రెండుపక్షములమధ్య తాను పెత్తనము వహించవలెనని ఆశిస్తున్నట్లు ఇందులో ధ్వనిస్తున్నది. కాబట్టి నెహ్రూ విధానము తటస్థవైఖరి నవలంబించ దలచినట్లు లేదని ఈ పరిశీలన వలన స్పష్టపడుచున్నది. అయితే, మన ప్రధాన మంత్రి, విదేశాంగ శాఖమంత్రి అయిన పండిట్ నెహ్రూ ఇటువంటి అంతర్జాతీయ విధానమును ఎందుకు అనుసరించుచున్నాడు? ఒకవంక అంతర్జాతీయ కమ్యూనిజమునకు, అంతర్జాతీయ ప్రజాస్వామ్యమునకు మధ్య చెలరేగుచున్న వివాదముల నుండి భారతదేశమును కాపాడుతూ, వేరొక వంక, అగ్రరాజ్యముల సానుభూతిని సంపాదించి, తద్వారా మనదేశ ప్రతిష్ఠను వృద్ధిచేయవచ్చునను తలంపుతో పండిట్ నెహ్రూ బహుశ ఈ విధానమును అనుసరించుచుండ వచ్చును.

అపాయము

అంతర్జాతీయ విధానముల పరిణామములను గురించి పండిట్ నెహ్రూ స్వీయాభిప్రాయముల పైననే ఒక నిర్ణయమునకు వచ్చినట్లు కనిపిస్తున్నది. అంతర్జాతీయ ప్రజాస్వామ్యముతోగాని, అంతర్జాతీయ కమ్యూనిజముతోగాని, చేతులు కలిపి పనిచేయకపోతే, అథవా ఏదో ఒకపక్షము పట్ల పక్షపాతముతో వ్యవహరించకపోతే, అంతర్జాతీయ రాజకీయ రంగములో భారతదేశమునకు తగినట్టి ప్రముఖ భూమికను నిర్వహించ నివ్వరను విషయమును గాని, ఏ పక్షముతోను



చేరక స్వతంత్ర విధానమును అనుసరించుచూ, ఉభయులతోను మంచిగా నుందామన్న వైఖరి, ఒకప్పుడు రాజకీయ వత్తిడికి దారి తీయుననిగాని పండిట్ నెహ్రూ గమనించినట్లులేదు. భారత దేశం తటస్థవైఖరిగాని, స్వతంత్రవైఖరిగాని వహింపవచ్చును. కాని ఆ విధానము దేశ శ్రేయోభివృద్ధికి దోహదము చేయగలదా అనునదే ప్రశ్న. ఈ విషయమును గురించి రెండు అభిప్రాయము లున్నవి.

అంతర్జాతీయ విధులు

ఐక్యరాజ్యసమితి సభ్యరాలుగా భారత దేశం కొన్ని విధులను నిర్వహించవలసియున్నది. వీనిలో కొన్ని దైనందిన విధులు. మరికొన్ని భారతదేశ అంతర్జాతీయ విధానమునకు సంబంధించిన విధులు. ఉదాహరణకు: రెండు దేశములమధ్య జరుగుచున్న ఆయుధసంఘర్షణను ఆపు చేయుటకు ఐక్యరాజ్యసమితిచే నియమింపబడిన సంఘములో సభ్యత్వము కలిగియుండుట; క్రొత్తగా స్వాతంత్ర్యం పొందనున్న దేశములో ఇప్పుడే పైకివస్తున్న కొన్ని రాజకీయ పక్షములను గురించి విచారించుటకు ఐక్యరాజ్యసమితిచే నియమింపబడిన సంఘములో సభ్యత్వము కలిగియుండుట; రెండు దేశముల సరిహద్దులనుగురించి ఏర్పడిన వివాదములలో మధ్యవర్తిత్వము వహించు సంఘములో సభ్యత్వము కలిగియుండుట మొదలగునవి భారతదేశ అంతర్జాతీయ విధానముదృష్ట్యా పరిశీలింపబడవలెను. ఇటువంటి విషయములలో భారతదేశం అంతర్జాతీయ రాజకీయ పక్షములతో నేరుగా సంఘర్షణకు దిగవలసివచ్చును. న్యాయబద్ధము, సమంజసమునగు విధానము నవలంబించి, తీర్పు చెప్పినచో ఇరుపక్షములకు. కనీసము ఒక పక్షమునకైనను విరోధులమగుట తప్పదు. కాబట్టి ఆ అంతర్జాతీయ విధానము మన దేశ శ్రేయోభివృద్ధికి ప్రతిబంధకముగా పరిణమించవచ్చును. అటువంటప్పుడు, మేము అన్ని దేశములతోను సఖ్యముగా నుండదలచుచున్నాము. కాబట్టి ఇతర దేశముల వ్యవహారములలో జోక్యము కల్గించుకొనబోవుట లేదని చెప్పి, అటువంటి సంఘములలో పాల్గొనకుండుట మంచిది ఈ విధానము వాస్తవికము, తటస్థము కూడా అవుతుంది.

క్రొత్త సమస్యలు

ఇంతవరకు భారతదేశము ఐక్యరాజ్య సమితిలో పాల్గొన్నదాని పర్యవసానముగా, మన దేశమునకు లాభము కలుగక పోగా, మన విదేశ సమస్యలు మరింత విషమించినవి. దక్షిణాఫ్రికాతో మనకువున్న వివాదమును ఐక్యరాజ్యసమితి పరిష్కరించలేదు కాశ్మీర్‌పై మనము చేసిన ఫిర్యాదు భద్రతామండలి మనము ఆశించిన విధముగా ఆదరించలేదు.

ఇండియా–దక్షిణాఫ్రికా వివాదము ముఖ్యముగా ఈ రెండు దేశములకు మాత్రమే సంబంధించినది. ఈ విషయములో భారత దేశవైఖరి నైతికముగా సమర్థనీయము.

అంతర్జాతీయ సౌభ్రాతృత్వమును విశాలదృక్పథముతో దక్షిణాఫ్రికా భారతీయులపై నున్న విరోధములను తొలగింపవలెనని కోరుట సమర్థనీయము కావచ్చును. గాని ఐక్యరాజ్య సమితి ప్రణాళిక అట్టి సమస్యలు కేవలము ఒక దేశపు ఆంతరంగిక సమస్యలని స్పష్టపరుస్తున్నది. అయితే ఆ నిరోధములకు గురియైనవారు ఆ విషయములనుగురించి ఫిర్యాదుచేయుటకు అవకాశము లేకపోలేదు. కాని ఏదేశపు ఆంతరంగిక వ్యవహారములలోనైనా జోక్యము కలిగించుకొనుటకు ఐక్యరాజ్యసమితికి హక్కులేదు కాబట్టి, ఆ సమితి తన నిర్ణయములను న్యాయశాస్త్రరీత్యా ఆచరణలో పెట్టుటకు అవకాశము లేదు.

ఇండియాలో దక్షిణాఫ్రికా వివాదములో ప్రతిష్ఠంభన ఏర్పడుటకు కారణములు రెండు: 1. తన ఆంతరంగిక వ్యవహారములను, జాతివిభేదములతో సహా, తన యిష్టము వచ్చినట్లు నిర్వహించుటకు హక్కున్నదని దక్షిణాఫ్రికాపట్టు బట్టుట; 2. జాతివిభేదములను పాటిస్తున్న ఇతర దేశములు స్వలాభాపేక్షతో దక్షిణాఫ్రికాను సమర్థించుట. ఈ సమస్యను కొంతవరకైనా పరిష్కరించుటకు దక్షిణాఫ్రికాతోనే నేరుగా వ్యవహారములు జరుపుకొనుట ప్రస్తుతములో భారతదేశము అనుసరింపదగిన విధానము. నైతికముగా దక్షిణాఫ్రికావైఖరి తప్పే అయినను, భారతదేశము దక్షిణాఫ్రికాపై ఆర్థిక ఆంక్షలను విధించి, ఇంకనూ వానిని అమలు జరుపుచుండుట కూడ తప్పేయని అంగీకరించక తప్పదు. ప్రతీకారము ఏ సమస్యనూ పరిష్కరింపజాలదు; స్నేహపూరిత ప్రయత్నములు ఏపనినైనను చాలవరకు సాధింప గల్గును.

కాశ్మీర్ సమస్య

దక్షిణాఫ్రికా విషయములో ఐక్యరాజ్య సమితికి ఫిర్యాదు చేయుట అనవసరమైనట్లే, కాశ్మీర్ విషయములో భద్రతామండలి జోక్యమును కోరి తెచ్చిపెట్టకొనుట కేవలము అనవసరము. అంతర్జాతీయ సంబంధబాంధవ్యముల ద్వారా దేశశ్రేయోభివృద్ధి జరగవలెనను 'నెహ్రూ అంతర్జాతీయ విధానము' ప్రథమ ఆశయమువలననే ఈ రెండు విషయములపైనను ఐక్యరాజ్య సమితికి ఫిర్యాదుచేయుట జరిగినది. వీనిని ఐక్యరాజ్యసమితి పరిష్కారమునకు దాఖలు చేయుటద్వారా, అంతర్జాతీయ నాయకులకు, ప్రపంచమునకు భారతదేశము ఆంతరంగిక వ్యవహారములనుకూడా సమితిద్వారా పరిష్కరింప చేయుచున్నదను సద్భావము కల్గించవలెనని పండిట్ నెహ్రూ ఆశించినారు. ఆయన భావనలు ఉదాత్తమైనవేగాని వాస్తవికతకు విరుద్ధముగా నున్నవి.

మార్పు జరుగవలెను

'నెహ్రూ అంతర్జాతీయ విధానము'ను ఇప్పటి అంతర్జాతీయ విధానముల పరిణామముల దృష్ట్యా సవరించుకొనవలసిన అవసరము ఈ రెండు విషయములలోను ధృవపడినది. ఉదాత్త ఆశయములుండుట మంచిదే. కాని వాని ననుసరించుచు, అంతర్జాతీయ వ్యవహారములకు సంబంధించిన వాస్తవిక విషయములను, ఆ ఉదాత్త ఆశయముల ప్రకారం పరిష్కారము చేయింపజూచుట సమంజసము కాదు. భారత దేశ అంతర్జాతీయ విధానము 'వాస్తవికత' కు మరింత దగ్గరకు పోవలెను.

ఏ విషయములోనైనను ఇతర దేశములు భారతదేశముతో ఏకీభవించకపోవుటకు వర్గ రాజకీయములే కారణమని నిందించుట వ్యర్థము, బహుశః ప్రమాదకరము కూడాను. తాను స్వతంత్ర తటస్థవైఖరి నవలంబించ దలచుచున్న భారతదేశము, ఇతర వర్గ-రాజకీయ దేశములు తనను బలపరచునని ఎట్లు ఆశింపగలదు? వర్గ రాజకీయముల నవలంబిస్తున్న దేశాలు మనను బలపరచకపోవడం కన్న, మనను వాటి ఇష్టం వచ్చినట్లు ఆడించుకొనుటకు ప్రయత్నించుట నిజముగా ప్రమాదకరమే. భారతదేశం ఏ వర్గ-రాజకీయ పక్షములోను చేరిపోకుండ వుండగలదా? అగ్రరాజ్యములతో సంబంధము లేకుండ ఈ ప్రపంచములో భారతదేశము ఏమీ సాధించలేనట్లే కనపడుతున్నది. భారతదేశమునకు ఇష్టమువున్నా లేకపోయినా, భారతదేశము స్వతంత్ర తటస్థవైఖరి నవలంబించినా లేకపోయినా, ఈ దేశ శ్రేయోభివృద్ధికి అగ్రరాజ్యములతో సహకరించక తప్పదు.

అంతర్జాతీయ ప్రజాస్వామ్యముతో గాని, అంతర్జాతీయ కమ్యూనిజంతో గాని, నిర్దిష్టముగా చేరిపోవుట భారతదేశమునకు మంచిది కాకపోవచ్చును. ఈ విషయములో పండిట్ నెహ్రూ అనుసరిస్తున్న విధానము అభినందనీయమైనదే. కాని కేవలము ఆంతరంగిక విషయములైన వానిలో ఐక్యరాజ్య సమితిని తెచ్చిపెట్టి, తద్వారా అంతర్జాతీయ వర్గ-రాజకీయ పక్షముల మధ్యవర్తిత్వమును తెచ్చిపెట్టుకొనుట సరియైనది కాదు. భారతదేశ ఆంతరంగికవిషయములు గాని విషయములలో అగ్రరాజ్యముల సన్నిహిత సహకారముతో వ్యవహరించి, ప్రస్తుతవిధానపు రొంపి నుండి బైటపడి, ఒక వాస్తవిక అంతర్జాతీయ విధానమును మన మేర్పరచుకొనవలసియున్నది.

భారత రాజకీయాలు :

కాశ్మీర్‌ను పాకిస్థాన్‌కు కట్టబెట్టుటకు అమెరికా బ్రిటన్‌ల పన్నాగాలు

కలత్ సంస్థానమును కలుపుకొనుటకు పాకిస్థాన్ ప్రయత్నాలు

భద్రతామండలిలో కాశ్మీర్ సమస్యపై చర్చలు త్వరలోనే ప్రారంభింపబడుచున్నవి. కాని ఈచర్చలవలనను, ఐక్యరాజ్యసమితివలనను మనము న్యాయము పొందగలమను ఆశ నానాటికి సన్నగిలిపోవుచున్నది. కాశ్మీర్ విషయమై ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదు చేసి లేనిపోని తంటా తెచ్చిపెట్టుకొంటిమేయని భారతప్రభుత్వము పశ్చాత్తాపపడవలసివచ్చినట్లున్నది.

భారతప్రభుత్వ విదేశవిధానము ఆంగ్లో-అమెరికన్ రాజ్యాలకు నచ్చలేదు. పాకిస్థాన్ అధినివేశముగానే యుండిపోయి, బ్రిటన్‌కు అమెరికాకు సైనిక స్థావరములతో సహా అన్ని సౌకర్యములు కలిగించుటకు సిద్ధముగా నున్నది. కాని భారతదేశము సామ్రాజ్యకూటమి నుండి విడిపోవలెనని ఆలోచించుచుండుటయే గాక, అంతర్జాతీయ వర్గ-రాజకీయములకు అతీతమగు విధానము ననుసరించవలెనని నిర్ణయించుకొన్నది. అందువలన ఒకవేళ రష్యాతో యుద్ధమే తటస్థించినయెడల ఆంగ్లో-అమెరికన్లకు, భారతదేశముకన్న పాకిస్థాన్ ఎక్కువ సౌకర్యములు కలుగజేయును. అటువంటి పరిస్థితులలో రష్యాకు సరిహద్దుగా నున్న కాశ్మీర్ పాకిస్తాన్‌లో అంతర్భాగముగానుండుట ఆంగ్లో-అమెరికన్‌లకు మిక్కిలి లాభదాయకమగును. అందువలననే వారు పాకిస్థాన్ పక్షపాతులై, భారత ప్రభుత్వము ఫిర్యాదు చేయుటను తమ స్వలాభమున కుపకరించునట్లు వినియోగించుకొనవలెనని ఆలోచించుచున్నారు.

ప్రఖ్యాత బ్రిటిషు పత్రికా రచయిత కింగ్‌స్లీ మార్టిన్ కాశ్మీర్ పర్యటించి తను చూచిన సంగతులను వివరించుచు, కాశ్మీర్‌లో సేడు భారతసేనలనెదిరించి పోరాడుచున్నది. కాశ్మీర్ ప్రజలుగాక, కొంత ప్రాంతములనుండి వచ్చిన ముండగీడులేనని, భారత ప్రభుత్వ సేనలు తమను రక్షింపవలెనని కాశ్మీర్ ప్రజలందరు కోరుచున్నారనీ, దుండగులు కాశ్మీర్ ప్రజలను పలు బాధలు పెట్టుచున్నారనీ స్పష్టపరచి, కాశ్మీర్ సమస్యపై బ్రిటన్ తన ధోరణిని మార్చుకొనకపోయినచో బ్రిటన్-భారతదేశాల భవిష్యత్సంబంధాలు మరింత క్లిష్టమై పోగలవనీ హెచ్చరిక చేశాడు. కాని ఈ హెచ్చరిక సరియైన విధముగా ఆదరింపబడినట్లు కనిపించదు. కాశ్మీర్‌ను ఏ విధముగానైనను పాకిస్థాన్‌కు కట్టబెట్టి, తమ అదుపులోనికి తెచ్చుకోవలెననే, ఆంగ్లో-అమెరికన్‌లు ప్రయత్నించుచున్నారు.

కాశ్మీర్ విషయమై పాకిస్థాన్ కోరినట్లు ఒడంబడిక చేసికొనవలసినదని భారత ప్రభుత్వముపై ఒత్తిడి పెట్టుతూ, బ్రిటన్, అమెరికాలు భారత ప్రభుత్వమునకు కొన్ని ఆర్థిక చిక్కులను కల్పించవచ్చునని కూడ భావించబడుచున్నది. ఇందు వారు సఫలీకృత మనోరథులు గానిచో కాశ్మీర్‌ను విభజించి జమ్మూను భారతదేశముతోను, రష్యాకు సరిహద్దునవున్న కాశ్మీర్ ప్రాంతము పాకిస్థాన్‌కు కట్టబెట్టవలెనని వారు ప్రయత్నింపవచ్చునట. ఇందుకుకూడ భారత ప్రభుత్వము అంగీకరించకపోయినచో, తూర్పు బెంగాల్ నంతను భారతదేశముతో కలిపివేసి, కాశ్మీర్‌ను మాత్రము పాకిస్థాన్‌కు, తద్వారా తమకు దక్కించుకొనవలెనని వారు ప్రయత్నింతురనికూడ భావించబడుచున్నది. ఇట్టి తంత్రములు భారతదేశము నెన్నటికి మధ్యపెట్టవాలవు. కాశ్మీర్‌ను రక్షించుటకు కాశ్మీర్ మహారాజాకు, కాశ్మీర్ ప్రజలకు భారత ప్రభుత్వము వాగ్దానము చేసినది. కాశ్మీర్ భవిష్యత్తు నిర్ణయించుకొనవలసినది కాశ్మీర్ ప్రజలేగాని అంతర్జాతీయవర్గ-రాజకీయవేత్తలుకాదని భారత ప్రభుత్వదృఢవిశ్వాసము. ఒకవేళ భద్రతామండలి అన్యాయమునకే పాల్పడి, ప్రపంచ శాంతికి భద్రతగాక భంగమునే కలిగించినను, భారత ప్రభుత్వము కాశ్మీర్‌ను విడవరాదు.

రాజపుటానాసంస్థానాల ఐక్యత

భారతదేశము స్వాతంత్ర్యముపొందిన తరువాత సంస్థానముల వ్యవహారములలో జరుగుచున్న విప్లవకరమైన మార్పులు మనము గమనించుచునే యున్నాము. ఒక్క హైదరాబాద్‌లో తప్ప



పటేల్

ఇతర సంస్థానము లన్నిటిలోను బాధ్యతాయుత ప్రభుత్వములు నెలకొల్పబడినవి. చిన్నచిన్న సంస్థానములు ప్రక్కననున్న భారత రాష్ట్రములలో కలిసిపోవుటగాని, ఇతర సంస్థానములతో కలసిపోయి ప్రత్యేకరాష్ట్రములుగా ఏర్పడుటగాని జరుగుచున్నది. ఒరిస్సా, సి. పి. లలోనున్న సంస్థానములు ఆ రాష్ట్రములలో జేరిపోయి, ఇతరులకు మార్గదర్శకములైనవి. కథియవాడ్ సంస్థానము లన్నియు ఏకమై 'సౌరాష్ట్రము' అను పేర ఒక క్రొత్త రాష్ట్రమునే స్థాపించుకొన్నవి. అంతవరకు ఒకకూటముగా ఏర్పడవలెననుకొంటున్న బొంబాయి సంస్థానాలు ఈ మధ్యనే బొంబాయిరాష్ట్రములో జేరిపోయినవి. ఇక మిగిలినవి యు. పి. సంస్థానములు, రాజపుటానా సంస్థానములు, పంజాబ్ సంస్థానములు. వీనిలో రాజపుటానాసంస్థానాలు తమ భవిష్యత్తును ఇప్పుడు నిర్ణయించుకుంటున్నవి.

రాజపుత్ర స్థానములోని ఆల్వార్, భరత్‌పూర్, ఢోల్‌పూర్, కారోలీ సంస్థానములు కలసి 'మత్స్య' రాష్ట్రముగా ఏర్పడుటకు ఈ మధ్యనే ఆ సంస్థానాధీశ్వరులు, భారతప్రభుత్వ సంస్థానశాఖ అనుమతి పొందిరి.

తూర్పుపంజాబ్‌లోని సుకేత, సంగారు, దోజనా, లోహారు, పాటోడీ సంస్థానాలు తూర్పు పంజాబ్ రాష్ట్రముతో కలసిపోవుటకు నిర్ణయించుకొన్నట్లు తెలుస్తున్నది. తూర్పు పంజాబ్‌లోని పాటియాలా మొదలగు పెద్ద పెద్ద సంస్థానములుకూడ తూర్పు పంజాబ్ రాష్ట్రములో కలసిపోవుటయే మంచిదని డా. పట్టాభి గారు ఈమధ్యనే హితవొసంగిరి. సంస్థాన ప్రజాకోద్యమము ఇందుకు నవాబును వత్తిడి చేయుచునే యున్నది. ఇందుకు నవాబు త్వరలోనే ఆమోదింపగలడని ఆశించుచున్నాము.

మధ్య ఇండియా సంస్థానములగు మాళవ సంస్థానములు ఒక ప్రత్యేకరాష్ట్రముగా ఏర్పడవలెనను ఉద్యమము బలపడుచున్నది. గ్వాలియర్ ఇండోరు, జాబువా, దేవస్, సీతామూ మొదలగు సంస్థానాధీశ్వరులు ఇందుకు సమ్మతించినట్లు కూడ తెలియుచున్నది. ఉదయపూర్ మొదలగు కొన్ని సంస్థానములు తమ ప్రత్యేకతను కాపాడుకొనవలెనని ప్రయత్నించుచున్నవట. పాకిస్థాన్ సరిహద్దులోనున్న జైసల్మేర్ వంటిసంస్థానములు భారతప్రభుత్వముచేతనే, నేరుగా పాలింపబడుట వాని భద్రతకేగాక దేశరక్షణకుకూడ అవసరము. ఇండోర్, గ్వాలియర్ వంటి పెద్ద పెద్ద సంస్థానములు అంగీకరించిన ఐక్యతను ఇతర సంస్థానములుకూడ అంగీకరించి, దేశమును ఐక్యపరచు ఈ ఉద్యమమునకు తోడ్పడవలెను. భారతదేశములో ఏ పదియో తప్ప తదితర సంస్థానము లన్నియు త్వరలోనే ఈ విధముగా పెద్ద రాష్ట్రములుగా ఐక్యత జెందుటయో, ఇతర రాష్ట్రములతో కలసిపోవుటయో జరుగును. కాని తరువాత మిగిలెడి పెద్ద సంస్థానములుకూడ త్వరలోనే ఈ త్రోవ ననుసరించి, భారత దేశమంతట భాషా ప్రయుక్త రాష్ట్రము లేర్పడుటకు అవకాశ మివ్వవలెను. ఇట్టి ఉద్యమము ముఖ్యముగా దక్షిణములో బయలుదేర వలసియున్నది. తిరువాన్కూరు, కొచ్చిన్, మైసూర్, హైదరాబాద్ సంస్థానములు ఇతర భారత దేశముతో కలసిపోయి, సమగ్ర ఆంధ్ర కర్నాటక, కేరళ, తమిళ, మహారాష్ట్ర రాష్ట్రములు ఏర్పడుటకు అవకాశము ఎంత త్వరలో కల్పించిన అంత మంచిది.

భారత రాజ్యాంగ చట్ట ముసాయిదా

భారతరాజ్యాంగచట్ట ముసాయిదాను తయారు చేయుటకు రాజ్యాంగపరిషత్తుచే నియమింపబడిన ఉపసంఘము తాను తయారుచేసిన ముసాయిదాను రాజ్యాంగ పరిషదధ్యక్షునకు దాఖలుచేసినది. రాజ్యాంగపరిషత్తుచే ఆమోదింపబడిన లక్ష్యతీర్మానమును బట్టియు రాష్ట్రగవర్నరుల, శాసనసభల, కేంద్రఅధ్యక్షునిగురించి రాజ్యాంగపరిషత్తులో చర్చింపబడిన ఇతరసూచనలనుబట్టియు తయారుచేయబడిన ఈ ముసాయిదా ఇదివరకు ఆశించిన విధముగానే వున్నది. రాష్ట్రగవర్నరులు ప్రజలచే ఎన్నుకొనబడుటకన్న, శాసనసభచే సూచింపబడిన నల్గురిలో నుండి ఒకరు భారతదేశ అధ్యక్షునిచే నియమింపబడుట మంచిదని ఈసంఘము సూచించినది. ఈ ముసాయిదాను తయారుచేయుటలో బ్రిటిష్ రాజ్యాంగముయొక్కయు, అమెరికన్ రాజ్యాంగముయొక్కయు ముఖ్యవిధానములను సమన్వయించి వానిలోని మంచినే ఉపయోగించుటకు ప్రయత్నించినారు. ఈమధ్యనే అమెరికా, కెనడా, బ్రిటన్ మొదలగు విదేశాలలో పర్యటించివచ్చిన రాజ్యాంగ సలహాదారు బి. యన్. రావుగారు తాము పరిశీలించివచ్చిన వానిని జాగ్రత్తగా ఉపయోగించుటకు ప్రయత్నించినారు.

ఈ రాజ్యాంగ చట్టము ప్రకారము భారతదేశము సర్వస్వతంత్ర ప్రజాస్వామ్య రాజ్యముగా నుండగలదు. ప్రజలందరికి, స్వేచ్ఛ, సమత, న్యాయము, సౌభ్రాతృత్వము చట్టరీత్యా హామీయివ్వబడినది. కుల, మత, లింగ విభేదములను పాటింపక సర్వప్రజలకు సర్వ వ్యవహారములలోను సమాన అవకాశములు, సమాన హక్కులు ఇచ్చుట, అస్పృశ్యతను అన్నిరూపముల నాశనము చేయుట భారత ప్రభుత్వ నిధులుగా ఈ ముసాయిదా ప్రకారం పరిగణింపబడును.

డా. అంబేద్కర్, శ్రీ గోపాలస్వామయ్యాంగార్, అల్లాడి కృష్ణస్వామి, కె. యం. మున్షీ, యన్. మాధవరావు, డి. పి ఖైతాన్, సయ్యద్ మహమ్మద్ సాదుల్లా గారలు సభ్యులుగా గల రాజ్యాంగచట్టరచన ఉపసంఘము ఈ ముసాయిదాను తయారు చేసినది.

ఈ ముసాయిదాలో 315 నిబంధన లున్నవి. వీనిని భాగములుగా విభజించినారు. ఈ ముసాయిదా త్వరలోనే రాజ్యాంగపరిషత్తుచే చర్చించి, అంగీకరింపబడి, స్వతంత్ర భారత రాజ్యాంగ చట్టము కాగలదు.

కలత్ సంస్థాన వ్యవహారాలు

పాకిస్థాన్‌లోని సంస్థానములలో కలత్ సంస్థానము చాల ముఖ్యమైనది. ఈ సంస్థానము దక్షిణమున అరేబియన్ సముద్రమునుండి, ఉత్తరమున బెలూచిస్థాన్, సరిహద్దు రాష్ట్రముల వరకును, తూర్పున సింధురాష్ట్రమునుండి పడమర పర్షియా సరిహద్దులవరకును వ్యాపించి వున్నది. ఈ సంస్థానం వైశాల్యం 80 వేల చదరపుమైళ్లకు మించియుండును; జనాభా 20 లక్షలు మాత్రమే. ఇచ్చటి ప్రజలందరు మహమ్మదీయులే. కాని వారికి ముస్లింలీగునందును, పాకిస్థాన్ యందును వ్యామోహము లేదు.

దేశవిభజన కాలములో ముస్లింనాయకులు సంస్థానములు స్వతంత్రముగా నుండదలచుకొన్నచో వుండిపోవచ్చునని ప్రకటించినారు. కాని కలత్ సంస్థానము పాకిస్థాన్‌లో జేరిపోకుండ స్వతంత్రముగ యుండగల్గినను, వుండరాదనియే వారిప్పు డభిప్రాయపడుచున్నారు. కలత్ సంస్థానమునకు పాకిస్థాన్ పోకడలు నచ్చక భారతదేశములో జేరిపోవుటకు కొంతకాలము క్రిందట ప్రయత్నించినది. కాని నవాబును ప్రార్థించి, పాకిస్థాన్ నాయకులు అట్టి పని జరుగకుండ అప్పటికిచేయించగల్గినారు. ఏవిధముగానైనను నవాబునకు నచ్చచెప్పి సంస్థానమును పాకిస్థాన్‌లో కలుపుకొనవలెనని పాకిస్థాన్ ఇన్నాళ్ళనుండి ప్రయత్నించుచున్నది. కాని నవాబు మాత్రము అంత్యనిర్ణయాధికారము ప్రజా శాసనసభదేనని చెప్పుచున్నాడు. కలత్ సంస్థానచేరిక విషయమై కొన్నాళ్లు కరాచీలో సంభాషణలు జరిగిన తరువాత, కలత్ శాసన సభలు ఈ మధ్యనే సమావేశమై కలత్ సంస్థానము స్వతంత్ర రాజ్యముగానే వుండి, పాకిస్థాన్‌తో మైత్రిపూర్వక సంధిమాత్రమే చేసుకొనవలెనని తీర్మానించినవి. ఈ తీర్మానము సంస్థానాధీశ్వరునకు హర్షదాయకమే. పాకిస్థాన్ మాత్రము ఇట్టి కీలక ప్రాంతమును వదలుకొన లేకున్నది. కాబట్టి కాశ్మీరులో వలెనే, కలత్‌లో కూడా ఏదో ఒకరకపు దౌర్జన్యము ప్రారంభించుటకు పాకిస్థాన్ ప్రయత్నింపవచ్చును గాని అచ్చటి ప్రజలందరు సరిహద్దు జాతికే చెందినవారగుటచే, ఈ విధానము పనికిరాదు. కలత్ సంస్థానము విషయములో పాకిస్థాన్ ఎట్టి వైఖరి వహించునో శ్రద్ధతో గమనించవలసి యున్నది.

ఆస్థానకవులు

శ్రీ జి. యన్. సూరి

ఇటీవల మద్రాసు ప్రభుత్వం వారు ఆస్థాన కవులనే క్రొత్తఉద్యోగస్థులను నియమించ దలచినట్లు పత్రికాముఖంగా తెలియరాగానే ఆంధ్రసారస్వతరంగస్థలాన తెరలో కలకలం బయలుదేరింది. అప్పుడే కొందరు పాతశాలువలు దులుపుతున్నారు. కొందరు పండిన జులపాలకు రంగుపూస్తున్నారు. కొత్తరచనలను బరికివేస్తున్నారు మరికొందరు. పాతపుస్తకాలను తిరిగి అచ్చువేయిస్తున్నారు ఇంకా కొందరు. బాలకవులు, కవులు, కవిపక్షిజాలాలు, కవిరాజులు, కవిసార్వభౌములు, కవిసామ్రాట్టులు మొదలైన వారు మహోత్కృష్ట దుర్మరణానికి దేశమంతా మారు మోగేట్టు కష్టపడి వాపోతున్నారు.

కమ్యూనల్ జి. ఓ. ఈ ఉద్యోగాలకు కూడ వర్తించా లంటున్నారు కొందరు కులాభిమానులు. వీటిని నిర్ణయించవలసినది ఓటర్లేగాని ప్రభుత్వం కా దంటున్నారు ప్రజాకవులు. కవయిత్రులను మరచి పోగూడ దని హెచ్చరిస్తున్నారు మహిళామణులు. మొత్తంమీద ఒప్పుకున్నా ఒప్పుకోక పోయినా, పోషణచేసినా నిరసించినా అనేకులు యోగ్యతా పత్రాలను, సమూహారచనలను, రుసుము చలానా ఫారాలను సిద్ధంచేస్తున్నట్లు అభిజ్ఞవర్గాల అభిప్రాయం.

"అల్లావా డిల్లావాహో ఇల్లా వా డల్లా వాహో" అన్నాడు పిచ్చివాడుగా యుగంధరుడు. ఒకప్పుడు మన దేశంలో ప్రతి సంస్థానాధిపుడికీ కనీసం ఒక్క ఆస్థాన కవి అయినా ఉండి తీరేవాడు. తాహతును బట్టి అష్టదిగ్గజాలవరకు పోషించినట్లు చరిత్ర చెబుతుంది. క్రమంగా ఈ గజేంద్రులకు ఆస్థానాల ప్రాపు దూరమయింది. సినిమాలకు మాటలు, రేడియోకి పాటలు, పత్రికలకు ఆర్టికల్సులు, కళాశాలలకు ఉపన్యాసాలు వ్రాసుకోవలసిన దుస్థితి సంభవించింది. ఇప్పుడు అదంతా తారుమారయి గజేంద్రులకు మోక్షం లభించపోతున్నది. జమీందారీలరద్దుతో జమీందారులు సినిమా డైరెక్టర్లుగాను, రేడియో వ్యాపారస్థులుగాను, పత్రికాధిపతులుగాను వ్యవహరించవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నవి. సంస్థానాలు అంతరించగా ఆస్థానకవులు అవతరించబోతున్నారు. వచ్చే ఎలక్షనులలో జమీందార్లను రద్దుచేశాం, మహాకవులను ఉద్ధరించాం అని ప్రభుత్వ పార్టీవారు సింహనాదం చెయ్యవచ్చును.

ఏదైనా కొత్త సంస్థను నెలకొల్పేటప్పుడు అనేక విషయాలను ఆలోచించి చూడాలి. ఇప్పుడు చేసే నిర్ణయాలు ముందు కాలానికి అనుసరించ వలసిన ఆదర్శాలవుతవి. ఎవరూ ఏ విధంగానూ ఆక్షేపించడానికి వీలు లేనటువంటి వ్యక్తిని ప్రథమ మహాకవిగా నియమించితే తప్ప ఈ సంస్థవల్ల గౌరవంగాని ఉపయోగం గాని ఉండదు. ఆదరణ, ఆశ్రయింపు, కులాభిమానము మొదలైన వాటికి తావియ్యకూడదు. కేవలం ప్రతిభకే ప్రాతినిధ్యం ఇవ్వాలి.

మహాకవులను నియమించే ఆచారం ప్రస్తుతం ఇంగ్లండు దేశంలో అమలులో ఉన్నది. పట్టాభిషేకాలు, యుద్ధవిజయాలు, రాజకుటుంబ శుభకార్యాలు మొదలైనసమయాలలో పొయెట్ లారెట్ గారి పద్యాలు చూస్తునే ఉన్నాము. ఆదేశంలో ఈ పదవికి అర్హతను దేనిని బట్టి నిర్ణయిస్తారో మనం గమనించి అనుకరించవచ్చును. స్థూలంగా పరిశీలిస్తే మూడులక్షణాలు ఈ సందర్భంలో గోచరించ గలవు. గొప్ప కవిగా జనబాహుళ్యం భావించడము, ఆనాటి సారస్వతంలో ఉత్తమ రచనలను చేసి ఉండడము, రచనలద్వారాగాని వ్యక్తిగతంగాని ఇతర కవులను ప్రేరేపించడము — ఈ మూడు ప్రధానలక్షణాలు లేనివాడు ఇంతవరకూ మహాకవిగా నియమించబడలేదు.

ఈ లక్షణాలున్న కవి శ్రేష్ఠుడికోసం అద్దుపడకొట్టూ ఆంధ్రదేశాన్ని గాలించ నక్కరలేదు. మేరువు పర్వతంవలె శ్రీ చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారు మన కళ్లముందు కనబడుతుండగా మరి యొక వ్యక్తిని గురించి ఆలోచించడం నిష్ప్రయోజనం. నిష్ప్రయోజనమే కాదు సాహసం కూడాను. వెంకటశాస్త్రిగారిని విని ఎరుగని తెలుగువాళ్లను వేళ్లమీద లెక్కించవచ్చు. అక్షరాస్యులందరూ ఆయన రచనలను చదివి ఉంటారు; చదువురానివాళ్లు ఆయన నాటకాలనైనా చూచి ఉంటారు. ఇందులో సందేహం లేదు.

వెంకటశాస్త్రిగారి పాండిత్య ప్రకర్షను గురించి, కవితా ప్రాశస్త్యాన్ని గురించి, రచన రచనానైపుణ్యాన్ని గురించి భిన్న అభిప్రాయాలుండడం అసంభవం. నాటకాలద్వారా భారతాదిపురాణాలను సామాన్య జనుల అందుబాటులోకి తీసుకొని వచ్చిన ప్రథమప్రజాకవి ఆయనే. ఇటీవల సినిమా పాటలు వచ్చేవరకూ ప్రతివాడు కూని రాగాలు తీసిన పద్యాలు ఆయనవే. నల్లేరుమీదబండి నడచినట్లు అవధానాలు జరిపి ఆంధ్రదేశాన్నంతా విస్మయ పరచినది ఆయనే. ఆయనకున్న రసానుభూతి, నాటకదృష్టి అమోఘమైనవి. సంభాషణలలోను, సన్నివేశాలలోను, పాత్రపోషణలోను ఆయన ప్రదర్శించిన రచనా చమత్కృతి అద్వితీయం. ఆయన కవితాశక్తి ఉన్నత శిఖరాలనందుకున్నది. ఆయనది బంధవిముక్తమైన మనస్సు. ఒకప్పుడు గ్రాంథికవాది అయినప్పటికి వ్యావహారిక భాషావాదాన్ని సహేతుకంగా పరిశీలించి ఆమోదించగలిగాడు. ఇటీవల ఆయన వ్రాసిన వచనరచన లన్నీ సజీవమైన శిష్టజనవ్యావహారికంలోనే వెలువడినవి.

ఉత్తమ రచనలు చేసిన కవులెందరో ఉండవచ్చును. కాని ఆయనవలె యువకవులలో కవితా శక్తిని ఉద్దీపింప జేసి ప్రోత్సహించ గలిగినవారు చాల అరుదు. ప్రస్తుతం తెలుగు దేశంలో ఘనాపాటి లనిపించుకుంటున్న కవులలో చాలమంది ఆయనను గురువుగా పరిగణిస్తారు. మీకు నేనేమి గురువునరా అని ఆయన అంటున్నా మీరే గురువులని స్తుతిస్తున్నారు. ఏకలవ్యన్యాయంగా ఆయనను ఇట్లా భావించే వాళ్లు మరెందరో ఉన్నారు.

ఏవిధంగా పరిశీలించినా ప్రథమ మహాకవిగా వెలుగొంద గలిగినవాడు శ్రీ చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారి కంటె మరొకరు లేరు. ఆయన శిష్యగణంలో ఒకరైన విశ్వనాథ సత్యనారాయణగారు చెప్పినట్లు "చెళ్లపిళ్లకవితో తులదూగడివారు మా కెచట కానగరా రిట తెల్గునాడునన్" ఆయనను ఈ పదవిని స్వీకరించమని కోరి ఒప్పించగలిగినట్లయితే ప్రజలు ప్రభుత్వమూ తమ్ము తాము గౌరవించు కొన్నట్లే అవుతుంది.

పారిభాషికపదకోశము

శ్రీ పింగళి లక్ష్మీకాంతం

పాఠశాలలో, మాతృభాషలోనే విద్యాబోధనమంతయు జరగవలె ననెడి ప్రభుత్వ నిర్ణయమునకు అనువుగా, ఆయా శాస్త్రముల లోని పారిభాషికపదములకు సరియైన తెనుగు పదములను సేకరించి సంకలనము చేయుటకు కొంతకాలము క్రిందట మద్రాసు గవర్నమెంటు వారు ఒక కమిటీని ఏర్పాటు చేసిరి. ఆ కమిటీలో అనుభవముగల విద్యావంతులు పెక్కు రు



ఆంధ్రనాటక కళాపరిషత్తు సమావేశ సందర్భంలో హిందుస్థాన్ సంగీత మండలివారు ప్రఖ్యాత నర్తకి శ్రీమతి తారాచౌదరికి సన్మానము చేసినప్పటి దృశ్యం.

గలరని వినికి. వారి కృషిఫలితముగా ఆపద జాలమంతయు ఎనిమిది పట్టికలలో కోశరూపముగా ప్రభుత్వమువారిచే ప్రకటింపబడెను.

ఇంతవఱకు ఇంగ్లీషులోని పారిభాషికపదములకు, గ్రంథకర్తలు వారివారి చిత్తానుసారముగా, తెలుగుపదములను ఊహించి ఆయా పుస్తకములలో వాడుచుండిరి. ఇకముందు ప్రభుత్వము ప్రకటించిన ఈ పట్టికలలోని పదములనే విధిగా నెల్లరును వాడవలయు నని ఒక నియమము చేయబడుటచేత మంచి వ్యవస్థాన మేర్పడినది. ఇట్టి కట్టుబాటు మంచిదే. ఆవశ్యకమే.

కాని ఈ పదములన్నియు యథాతథముగా గ్రంథములకు నెక్కకపూర్వము, ఈపట్టికలను పేరుగల మఱికొంతమంది విద్యావంతులకు పంపి, ఈపదములలో నేవేని సవరింపదగినవి యున్నవేమో వారివలన తెలిసికొని, ఉన్నచో ఆ సవరణలను ముందుగానే చేసినచో గ్రంథకర్తలకు, విద్యార్థులకు, భాషకు చక్కని సౌకర్య మేర్పడును. అట్లుగాక, ఈ యున్న రూపముల గ్రంథములలో ప్రయుక్తములైనచో వెనువెంటనే ఆక్షేపణలు వచ్చు అవకాశమున్నది. సంస్కారయోగ్యములైన పదములు ఈపట్టికలలో చాలకలవు. కొన్ని యుదాహరణములు చూడుడు:—

(1) Thermometer—దీనికి ఒక పట్టికలో "ఉష్ణమాని" అనియు, ఇంకొకదానిలో "ఉష్ణమాపకము" అనియు, రెండు రూపము తీయబడినవి. ఈరెండింటిలో ఏదో యొకటి మాత్రమే యుండదగును. లేదా, ఆయింగ్లీషు మాటనే తెలుగులిపిలో వ్రాసి, దానిని తెలుగు పదముగానే యెంచుకొనుట సర్వోత్తమము.

(2) Latent-heat—దీనికి "సుప్తోష్ణము" అని యొక పట్టికలోను, "నిగూఢోష్ణము" అని ఇంకొకదానిలోను ఉన్నది. ఈరెండింటిలో ఒకటే ఉండదగును.

ఒకే పదార్థమునకు రెండు మూడు పర్యాయ పదములు, సునిష్కర్షను అపేక్షించు శాస్త్రములలో పనికిరావు. ఇంగ్లీషు భాషలో Thermometerకు పర్యాయపదము లేదుగదా!

మఱియు, పదములకు అర్థవత్తతోపాటు ఉచ్చారణ సౌలభ్యము కూడ నున్ననేకాని, రచనలో రాణించవు, విద్యార్థుల మనస్సునకు హత్తవు. ఉదా —

(3) Secondary-axis—దీనికి "అనుబ్యాక్షము" అని తెలుగు వ్రాసిరి. ఇంతకంటె "గౌణాక్షము" అనుట యెంతో మేలు. మన భాషలో అనుభ్యారమునకే గౌణశబ్ద మున్నది. దానిని అక్షశబ్దముతో కూర్చుటవలన ఇంపైన సమాస మేర్పడును.

ఇంకొక చిత్ర మేమనగా, ఈపదమునకే మఱియొక పట్టికలో "అప్రధానాక్షము" అని వ్రాయబడియున్నది.

(4) Bloodless revolution—దీనికి "రక్తపాత రహితవిప్లవము" అనియు "ప్లెడ్జెనువిప్లవము" అనియు రెండు పదములు కల్పింపబడినవి. ఇందులో రెండవది బొత్తుగా సహింపరానిది. మొదటిది అంగీకరించదగినదే కాని దానికంటె మనభాషలో మహాత్ముని దయవలన ఆబాలగోపాలము పలుకుచున్న "అహింసా విప్లవము" మంచిమాట.

(5) Commercial rivalry—దీనికి ఈయబడిన "వర్తక మాత్సర్యము" కంటె "వర్తకస్పర్ధ" సార్థకము. ఇట "మాత్సర్యము" అను పదమే పనికిరాదు.

(6) Concert—దీనిని "సంగీతము" అని తెనిగించిరి. ఆమాట కిది సరియైన తెనుగు మాట కాదు. మనము దీనిని "సంగీత మేళకము" అందుము. మన గ్రంథములలో అట్లే కలదు.

సంస్కరింపదగిన పదములు ఇటువంటివి, యాదృచ్ఛికముగా జూచిన నాకంటికి సుమారు ఏబది కానవచ్చినవి. మఱి కొంతమందికి మఱికొన్ని తోచియుండవచ్చును. కొందరు వానిని గుర్తించియే యుందురనియు ప్రీతిపూర్వకముగా అడిగినచో వారెల్లరు తమకు తోచిన మార్పులను సూచింతురనియు నమ్మెదను.

ఇది మన భాషకు, మన బాలుర విద్యకు సంబంధించిన సర్వజనోపయోగియైన కార్యముగనుక ఈ బాధ్యత మనయెల్లరయందును గలదు. నేను ఆ యుద్దేశముతోనే ఈ వ్యాసమును ప్రకటించుచున్నాను. ప్రజాప్రభుత్వము కోరునది లోకసహాకారమేకదా!

కథానిక.

"అమ్మ"

★

శ్రీ బలివాడ కాంతరావు

‘నీకు హృదయం వుందా?’

చల్లని చలిగాలికన్న యీ మాటలు నన్ను వణికించేసాయ్. శీతల సముద్రపు జలంలో ముంచివేసినట్టయింది. మాట్లాడలేకపోయాను. మరల ఆ మాటలే చెవిని పడ్డాయ్.

‘రజీవ్! నీ మాటలు అర్థం కావటంలేదు. అర్థం చేసుకోటానికి యీ మాటలు వినే శక్తి గూడా లేదు’ అన్నా.

‘నిన్న నేమన్నావ్?—నీ అమ్మను చూడటానికి యేడాదైపోలేదన్నావ్ కదూ’

‘అవును...’

‘నిన్ను నవమాసాలు మోసి, కని, పాలిచ్చి, పెంచి, పెద్దచేసిన కన్నతల్లిని యీ 20 యేండ్ల వయసులో ఒక యేడాదివరకు చూడకుండా యెలా వుండగలుగుతున్నావ్? నీకే హృదయం వుంటే..’

‘రజీవ్! క్షమించు అడిగినందుకు—నువ్వు మీ దేశమును, మీ తల్లి దండ్రులను వదలి రాలేదూ? యీ పదిహేను రోజుల్లో ఒక్కసారైనా నువ్వు విచారించినట్లు కనపడదు. యెప్పుడూ నవ్వుతూనే వుంటావ్—నీకే హృదయం వుంటే..’

‘రావ్! నా తల్లి యెల్లపుడూ నా వెనువెంటనే వుంటోంది.’

‘నీ మాటలు అర్థం కావటంలేదు’

‘యెలా అవుతయ్ అమ్మమీద అంత ప్రేమాభిమానాలు చూపిస్తున్నావ్!’

‘నా తల్లిని వుద్యోగరీత్యా విడువవలసి వచ్చినా, మాతృశ్రీని తలంచి నమస్కరించని రోజులేదు. యీ ప్రపంచంలో మనకు తల్లి కంటె ఆప్తులెవరున్నారు! ‘అమ్మా’ అన్న పలుకులో యెంత పవిత్రత, అభిమానం, తియ్యదనం, అనురాగం యిమిడివుందో?’

‘రావ్! నీవు నిజంగా తలచుకొంటున్నావా?..’

‘నా మాతృదేవత సాక్షిగా’

‘అయితే, నే మనసులో బాధించినవిషయం దాచిపెట్టకుండా అనేసిన మాటలు పట్టింపు చెయ్యవద్దు. నీవు నా ఆప్తమిత్రుడవు, క్షమిస్తావని అనుకుంటాను.’

‘రజీవ్! నీ ఆప్తమిత్రుని కోరిక చెల్లిస్తావా, లేదా?’

‘యేమిటో ఆ కోరిక?’

‘నీ తల్లి నీ వెనువెంటనే వుందన్నావ్. యెలా? నీ మోముపైని నీ సుగుణాలన్నీ మూర్తీభవించివుండటం, అదృష్టవశాత్తూ యిద్దరకు యింగ్లీషుభాష రావటం—మన విషయాలు చెప్పుకోటానికి, స్నేహంగా తిరగటానికి అవకాశం లభించింది.’

‘రావ్! నా స్వవిషయాలు చెప్పుకోతగ్గవి కావేమో? కాని నీలాంటి మిత్రుని మనసు కష్టపెట్టటం నా కిష్టంలేదు. చెప్తాను విను. దయచేసి నన్నేం ప్రశ్నలు అడగవద్దు!’

ఇద్దరం చీకటిలో చిందులు త్రొక్కే తరంగాలవైపు చూస్తున్నాం. శీతకాలం. చలిగాలి సముద్రతరంగాలపై స్వారీ చేసుకుంటూ వచ్చి మమ్మలను తాకుతోంది. సముద్రంలో కొంత దూరాన్న ఓడదీపాలు కనిపిస్తున్నయ్. ఒడ్డుననున్న దీపస్తంభం త్రోవ చూపిస్తోంది గమ్యస్థానమైన రేవును చేరటానికి—

‘రావ్! ఆ ఓడను చూస్తున్నావుకదూ. ఇంగ్లీషుభాషలో దానిని ఫెమినైన్ జెండర్‌గా పరిగణించారని నీకు తెలుసు. ఆడదాని బ్రతుకు ఆ ఓడలాంటిదే. లైట్‌హౌస్ లేకపోతే ఓడ రేవు చేరుకోలేదు. చేరుకోవాలని ప్రయత్నించినా దెబ్బతింటుంది. అలాగే భోగభాగ్యాలతోనిండిన యీ మానవజీవితాంధకారంలో స్త్రీ, పురుషుడు లేనిదే జీవిత గమ్యస్థానానికి సుఖంగా చేరలేదు.

నేను 19 యేండ్ల వయసులో ఓ రోజు అమ్మను అడిగాను—‘మా నాన్న యెవరు? మనం గుజరాతీవాళ్ళంకదా హైదరాబాదు యెందుకు వచ్చాం? మన స్వస్థలమేది? మనవారెవరూ లేరా?’—‘నాయనా, నీపనేమో చూచుకోరా’ అంది అమ్మ. అమ్మను మరల ఆవిషయం అడగలేదు. కాని అపుడపుడూ యేకాంతంగా కూర్చొని యీ విషయాలు ఆలోచించకుండా వుండలేకపోయేవాడ్ని. ఒక్కొక్కసారి వేగంగా గదిలోనికి అమ్మవచ్చి ‘యేం ఆలోచిస్తున్నావురా బాబూ?’ అనేది. అమ్మ వద్ద అబద్ధమాడటం చేతనయ్యేదికాదు. రాను రాను యేరాత్రపుడు తెలివివచ్చినా ప్రకృతి ప్రశాంతాన్ని పంచుకొని నా పెదవు యీ విషయాలతోనే చెలిమిచేసేది. నా స్వస్థలమేదో తెలుసుకోవాలని మరీ కుతూహలంగా వుండేది. అమ్మ నే తెలివితో వున్నానని కలగనేదేమో? ‘బాబూ! నిద్రపట్టలేదురా? యేం ఆలోచిస్తున్నావురా?’ అనేది. నేను నిజం చెప్పినందుకు సంతోషించేది.

ఓనాడు రాత్రి అమ్మా నేనూ రెండు మంచాలపై పడుకున్నాం. వాతావరణం ప్రశాంతాన్ని ప్రేమిస్తోంది. నామనోవీధిలో తియ్యని కోరికలు ప్రయాణంచేస్తున్నాయ్. గాలిమేడలు కట్టడానికి ‘నాయనా!’ అంది అమ్మ. నా ఒళ్ళు పులకరించింది. ‘అమ్మా’ అంటూ అమ్మ మంచం మీదకు పోయి అమ్మప్రక్కనే పడుకున్నా. ‘నాయనా’ అని తల నిమురుతూ ‘నీ మనసు కష్టపడటం నాకిష్టం లేదురా. కొడుకు కష్టాన్ని యే తల్లీ పంచుకోకుండా వుండలేదురా. కడుపులో పుట్టిన కొడుకుదగ్గర దాపరికమెందుకు? అన్ని విషయాలూ చెప్తావిను’. అమ్మపలుకులలోని మాటల్లోని అమృతం నన్ను చిన్నపిల్లాడిని చేసి అమ్మ ఒడిలో కూర్చొని ఆ మెమోములోనే అన్నిలోకాలూ కనపడ్డట్టయింది.

అమ్మ ఇలా చెప్పటం మొదలెట్టింది. ‘బాబూ, మనవూరు కథియవారులోని రాజకోట సంస్థానంలో రాణాపూర్ అనే గ్రామం. కాస్త పెద్దగ్రామమే. నాతండ్రి ఒక పెద్దరైతు. 30 యెకరాలపొలంవుండేది. చిన్న నేనే కుమార్తెనవటంవలన చాలా గారాబంగా పెంచారు. నాపదకొండవ యేటనుంచి పెండ్లిచూపులకని వేర్వేరు తరహాల మనుష్యులు వచ్చేవారు. కాని అందరు మూతి విరుచుకొని పోయేవారు. నల్గురు నాల్గువిధాల మాట్లాడుకుంటే నాతల్లిదండ్రులకు యెంతో కష్టమనిపించేది. చివరకు యేపేదవానికైనా కట్టిపెట్టాలని ప్రయత్నించారు. ఆ ప్రయత్నంకూడ విఫలమైంది. యెవరైనా పెండ్లిచూపులకు వచ్చారంటే వారి చెవుల్లో విషబీజాలు దూరుకుపోయేవి. మా నాన్న నూటిగా పోవటం చాలామందికి కష్టమనిపించి ఆయనపై కత్తిగట్టారు. దానికే నే బలిదానమయ్యాను.

నాకు 15 యేండ్ల వయసు వచ్చింది. కాస్త లోకపరిస్థితిని తెలుసుకున్నా. నా నడకల్లో శాస్త్రరీత్యా యేదో సుడివుందట! నాజాతకం చాలా గడ్డుజాతకమట! నాబొమలు కలిసివున్నాయట! అంచేత పెండ్లిచేసుకున్నవాడు వేగంగా చనిపోతాడట—ఇలా ఎన్నోవిధాల, పల్లెల్లోనే మూఢ మూచినా నావిషమూలే!

ఒకనాడు మాగ్రామానికి పట్నంనుంచి కొంగరు కాంగ్రెసు ప్రచారకులు వచ్చారు. మావూరు కేంద్రంగా పెట్టుకొని ఆ చుట్టుపట్ల గ్రామాలలో మూడునాలుగు నెలలవరకు ప్రచారం చేయాలని వచ్చారు. ఆగుంపుకు పెద్ద రామనారాయణ్. మానాన్న ఆయన మాటల తీరు జూచి సంతోషంతో మాయింటిప్రక్కనే వున్న యింకొకమాయింటినే వారికి బసగా యిచ్చాడు. ఆయన చాలా మంచివారు, అందమైనవారు. తీరుబడి వున్నంతకాలం నాన్న ఆయనతో యేవో మాట్లాడుకుండే వారు. మాకు ఘోషా పద్ధతి లేకపోబట్టి నేను వీధి అరుగు మీదకు రావటంజరుగుతుండేది. నన్ను జూచిన లగాయతు ఆయన బాధ పొందేవారు. అమాయకంగా నా విషయాలు అన్నీ ఆయనతో చెప్పాను. ఆయన నవ్వుతూ అన్నారు ‘ఇటువంటి పిచ్చి నమ్మకాలు పెట్టుకొని జీవితాలతో చెలగాటమాడుతోంది సంఘం. ఆ సంఘానికి ఆహుతైన నీలాంటి యావ్వనిని రక్షించాలని వుంది. యేమంటావ్!’ నాకేమీ అర్థంకాలేదు. నా అమాయకత్వానికి నవ్వుకున్నారు. రానురాను మాలో అభిమానం పెరిగిపోయింది.

ఆరోజు ఆదివారం. చాలా ప్రొద్దుపోయింది. ఇంకా రామనారాయణ పొరుగూరినుంచి రాలేదు. నే బెంగతో వీధి అరుగుమీద కూర్చున్నా. మానాన్న ప్రక్కయింటిలోని సామానులను పైనపారవేస్తున్నాడు. ‘యేం నాన్నా?’ అని గద్గద స్వరంతో అడిగాను ‘ఆ రామనారాయణ మాలవాడట. మన యిల్లంతా వాడివలన మలినమైపోయింది. శుద్ధిచేయటానికి మూడువందలు ఖర్చుపెట్టాలని బాపనయ్యగారు అంచనా వేసారు. మాలవాడికి దేముడేమిటి? పొరుగూరిదేవాలయంలో మాలగుంపుతో ప్రవేశించబోతే వారికీ మిగతావారికీ దెబ్బలాట వచ్చింది. రామనారాయణకు బలమైన గాయాలు తగిలాయ్. పట్నంతీసుకపోయారట. బతుకుతాడని ఆశలేదట!

నాన్న పలుకులు విన్నా. నానెత్తిన బండరాయి పడినట్టయింది. కన్నీటిబిందువులు నా చెక్కిళ్లపై ప్రవాలాయ్. నాన్న యెందుకలా యేడుస్తావని గద్దించాడు. యేమీ లేదంటూ లోనికిపోయాను. ఆ వారంలోనే యిద్దరం కలసి మారదేశం పోదామనుకున్నాం. నా నొసటి వ్రాత యిలావుంటే మాకోరికలు కొనసాగుతాయా బాబూ?

‘నారాయణ్ గాడు త్రోవలో చనిపోయాడట. శని విరగడయ్యింది’ అంటూ కరణం గారు మానాన్నతో చెప్పటం విన్నాను. నా దుఃఖాన్ని నే వర్ణించాలరా బాబూ?

నాయనా! నివ్వప్పటికి రెండు నెలలై నా రక్తాన్ని పంచుకొని పెరుగుతున్నావ్. నీతండ్రి న్యాయంకోసం, దేశంకోసం ప్రాణం విడిచారు. సంఘం ఆయన్ని మాల అని పిలచింది. కాని దేవుడు మాల అని పిలిచాడురా? భగవంతుడు తన బిడ్డలందరిని ప్రేమతోనే చూస్తాడు. మనం మన కన్నతండ్రిని అర్థం చేసుకోవటంలోనే వుంది మన ప్రజ్ఞ.

నాగుండె దిట్టం చేసుకున్నా. నా భర్త చనిపోయినా, నాకు త్రోవ చూపించి, ఆయనను తలచుకొని బ్రతుకమని నన్ను ప్రసాదించారు. నా కళ్ళయెదుట యెపుడూ ఆయన వుంటారు. కష్టకాలంలో ధైర్యం చెప్తారు, సలహాలిస్తారు, నాతో మాట్లాడుతారురా బాబూ!

నా ఒంటనున్న బంగారం యెవరికమ్మను? నాకో ఆలోచన తట్టింది. నడిరాత్రపుడు నాన్న ధాన్యం అమ్మి పెట్టెలో వుంచిన 300 రూ. తీసుకున్నా. నా ఒంటనున్న పదిహేనుతులాల బంగారం ఆ పెట్టెలో పెట్టి నిశీథాన్నే తోడుగా తీసుకొని బయలుదేరాను. మీ నాన్నగారు త్రోవ చూపించారు. యీ వూరు రావటం మాల్వీని కలుసుకోవటం జరిగింది. పొరుగింటి మాల్వీబాబు ఆదరించి యీ యిల్లు యిచ్చాడు. నా తండ్రిలాంటివాడు. మాల్వీతో నా విషయాలన్నీ చెప్పాను. నావద్ద మిగిలిన 250 రూ. మాల్వీ చేతిలో పెట్టాను. కన్నీరు కార్చాడు. నాకు కావలసిన వస్తువులన్నీ తెచ్చి పెట్టాడు. నాకు చదువు నేర్పాడు. లోకంలోని వ్యక్తులు, విషయాల గురించి చెప్తుండేవాడు. ధైర్యంగా మెలగమనేవాడు.


నీవు పుట్టావ్ నా ప్రార్థన ఫలితంగా. కన్నతండ్రి తన బిడ్డలకు అన్యాయం యెప్పుడూ చెయ్యడురా బాబూ! మనం న్యాయంగా, నమ్మకంగా మన పనులను నిర్వహిస్తే చాలు. దేవుని ప్రార్థించి పెద్దకోర్కెలు కోరి, స్వర్గము

(20 వ పేజీ చూడుడు)


వార్తా చిత్రాలు




అఖిలభారత దంతవైద్యుల తృతీయ సమావేశము గత గురువారంనాడు బొంబాయిలో జరిగి నప్పుడు, బొంబాయి ప్రధాని శ్రీ బి జి. ఖేర్‌గారు దంతవస్తు ప్రదర్శనశాలను ప్రారంభించినప్పటి దృశ్యం. చిత్రంలో కుడివైపున రాజకుమారి అమృతకౌర్, శ్రీ బి. జి. ఖేర్‌గారలు కనిపిస్తున్నారు.




[illegible] దంతవైద్యుల సమావేశమును ప్రారంభించుటకు విచ్చేస్తున్న [illegible] అమృతకౌర్‌కు గౌరవ విన్యాసం [illegible] దృశ్యం.



గుంటూరుజిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి సుబ్బయ్యగారు మరణించిరనే వార్త వినగానే దేశభక్త వెంకటప్పయ్య పంతులుగారు, ఇతర కాంగ్రెస్ ప్రముఖులు వచ్చి తమ సంతాపాన్ని తెలుపుతున్న దృశ్యం.



బనగానపల్లి సంస్థానంపై మద్రాసు ప్రభుత్వ అధికారస్వీకారం: మద్రాసు ప్రభుత్వ ప్రతినిధిగా వద్యాగారు, కర్నూలు జిల్లా కలెక్టరు జంగారాగారు సంస్థానాధిపతి ప్రతినిధి ఖ్వాజా నాజీర్ హుస్సేన్‌గారలు ఈ చిత్రంలో వున్నారు.



తిరువాడుతురై లోని మఠానికి తీసుకొనిపోయేనిమిత్తం మహాత్ముని చితాభస్మం కొంత తెచ్చి ఇటీవల చెన్నపురి హిందీప్రచారసభలో ప్రదర్శించారు. ఫిబ్రవరి 24-న సభావరణంలో బహిరంగసభ జరిగినప్పుడు, శ్రీమతి ముత్తులక్ష్మిరెడ్డిగారు భారతమహిళలు కస్తూరిబా ఆదర్శాలను అలవరుచుకోవలెనని ఉద్బోధించారు.






పో
ఛాలెం
మద్రా
పరిశో
యోజ
పం
నెహ్రూ
కరి
దృశ్యం


పశుప్రదర్శనంలో గెలుపొందినవారికి ప్రధాని నెహ్రూ బహుమతులను పంచి ఇస్తున్నారు. రకరకాల ఆవులను, గేదెలను ప్రదర్శనకు తెచ్చిన మహారాజా ప్రతాప్ సింగ్ గారు బహుమతులను అందుకొంటున్నారు.



స్వతంత్ర భారత తపాలా బిళ్ళల నామూనాలను 1750 నమూనాలనుండి ఈవారంలో ఏరు
రెండవది మఖన్‌లాల్ దత్తగారు (కలకత్తా) పంపినది. (దీనికి ప్రత్యేక బహుమాన మిచ్చా
నాలుగవది శ్రీ కె. వెంబూగారు (బందరు)




రాయలసీమ ఆయుర్వేదమహాసభ కడపలో జరిగి నప్పుడు తీసిన చిత్రం. అధ్యక్ష ఉపాధ్యక్షులు మధ్యలో ఆసీనులై వున్నారు.




గాంధీజీ ఆశయానికి స్థాపించబడిన ప్రథమ సంస్థను భారతమంత్రి శ్రీ గాడ్గిల్ గారు ఈమధ్యనే ఢిల్లీలో ప్రారంభోత్సవం జరిపారు. చిత్రంలో శ్రీ గాడ్గిల్ గారు, ఢిల్లీరాష్ట్ర విద్యాశాఖాధికారి సేఠీగారు, ఢిల్లీ మ్యునిసిపల్ కమీషనర్ భగవంత్ కిషోర్ గారు కనిపిస్తున్నారు


ఢిల్లీలో జరిగిన అఖిలభారత పశుప్రదర్శన దృశ్యాలు



...శ్రీ జర్
...జ్ కప్ను
...సు లోని
...థక సంస్థ
...న్నా నికి
...డి ట్
...లా బహు
...స్తు న్న




ఉత్తమ వృషభం; గోమాత; పాడిగేదె




రోజుకు 36 పౌనుల పాలు (23 చటాకుల నెయ్యి) ఇచ్చే గేదె; దీనికి ప్రథమ బహుమానం వచ్చింది.



బలిష్ఠమైన ఆంబోతు : హిసార్ పశుకేంద్రానికి చెందినది : దీనికి ప్రథమ బహుమానం.



...కున్నారు. వీనిలో మొదటిది కె. వెంకూగారు (బందరు) పంపినది (అదనపు బహుమానము).
...రు). మూడవది ఫెర్నాండెజ్ గారు (ఢిల్లీ) పంపినది (దీనికి మూడవ బహుమాన మిచ్చారు).
...పంపినది (దీనికి రెండవ బహుమాన మిచ్చారు).



హైదరాబాద్‌లో భారతప్రతినిధి శ్రీ మున్షీగారు ఈమధ్య బెజవాడ వచ్చినప్పుడు, పత్రికా విలేఖరులతో ముచ్చటిస్తున్న దృశ్యం.

పిల్లల నవల:



పెద్దబొమ్మ

శ్రీ సత్యనారాయణ శ్రీవాత్సవ

ఎప్పటికీ తలుపు తియ్యకపోవడం చూచి యీ సారధి కాలితో గట్టిగా తన్నాడు. తన్ని గదిలోకి వచ్చి పినాకరావునూ, కొవ్వొత్తినీ చూచి నవ్వుతూ అన్నాడు: "బాగుంది అబ్బాయి! మీ అరుపులు బాగా ఉన్నాయి. అవి వినకోనే మీ గొంతు కలు గుర్తుపట్టాను. అందుకే నే నిక్కడికి వచ్చాను"

ఈమాటలు వినగానే ఆ రెండు గాడిదలు నిర్ఘాంతపడిపోయి, తల కొన్నాయి. దానితో చెవులు వాలి వాల్చుపోయాయి. పీళ్ల తోకలు కాళ్ల మధ్య వేలాడుతున్నాయి. ముందు ఈ సారధి తల నిమిరి బుజ్జగించాడు. తరువాతగుఱ్ఱాలను తుడిచే బ్రష్షు దువ్వెన తీసుకొని బాగా శుభ్రం చేశాడు. తర్వాత వాటికి మాలీసు చేశాడు. చేసేటప్పటికి అవి అద్దాలలాగ మెరిసి పోతున్నాయి. మెడలకి పటకాలు వేసి, గాడిదల సంతలోకి తీసుకెళ్ళాడు. వాటిని అమ్మజూపితే సంతలో మంచి ధర వస్తుందని అతని ఉద్దేశం. సంతలో పెట్టేటప్పటికి ఎంతో మంది బేరగాళ్లు వచ్చారు. కొవ్వొత్తిని ఒకరైతు కొన్నాడు. అతని గాడిద క్రితంరోజునే చచ్చిపోయిందట. బరువులు మొయ్యడానికి ఉంటుందని కొన్నాడు. పినాకరావుని ఒక్క సర్కస్ కంపెనీవాడు కొన్నాడు. దీనికి గెంతడం, నృత్యం చేయడం నేర్పి సర్కస్‌లో ఉన్న ఇతరజంతువులతోపాటు యీగాడిదను కూడా చూపించాలని ఆ బేరగాడి ఉద్దేశం.

అయిందా? ఇప్పటికైనా తెలిసిందా మన చిన్న సారథి చేస్తూవున్న వ్యాపారం? ఈ దుర్మార్గుడు పైకి, తేనె పాలూ ఒలికిస్తూ ఉన్నట్టు కనిపించినా తన బండీ తీసుకొని వెళ్ళి అన్ని ఊళ్లూ చుట్టేటాడు. చుట్టి చదువంటే కిట్టక అల్లరిగా తిరిగే సోమరి పిల్లలందరికీ యిచ్చకమచ్చకాలు చెప్పి యీ బండి మీద ఎక్కించుకొని తీసుకొని వస్తాడు. బండంతా నిండినవెంటనే ఆనందరాజ్యమనే అజ్ఞానపు అడవిలోకి తెచ్చి విడుస్తాడు. అక్కడ వీళ్లు ఆటలతోనూ పాటలతోనూ ముందు బాగానే గోల చేస్తారు. కొంతకాలం చదువు సంధ్యలు లేకుండా అల్లరితో గాడిదలైపోయిన తర్వాత వాడికి ఎంతో సంతోషం. అపుడు వాళ్లని సంతకి తీసుకొనిపోయి అక్కడ మంచి ధరలకి అమ్మేటాడు. ఈ వ్యాపారంవల్ల వాడు కొద్ది సంవత్సరాలలో లక్షలకొద్దీ రూపాయలు సంపాదించాడు.

కొవ్వొత్తి ఏమయ్యాడో తెలియదు కాని, పినాకరావుమాత్రం అమ్ముడు అయిపోయిన తొలిరోజునించీకూడా పాపం,నానా బాధలూ పడ్డాడు. కొన్న వెంటనే సర్కస్‌మేనేజరు ఒకశాలలో పెట్టాడు. పెట్టి చిన్న తొట్టిలో గడ్డి వేసి తినమన్నాడు.పినాకరావు కొంచెం పచ్చగడ్డి కరచి వెంటనే అది వెలపరించుకొన్నాడు. అక్కడ గుఱ్ఱపు వాడు ఇదేమిటి అని అది తీసి వట్టిగడ్డి వేశాడు. అదీ యీగాడిదకు నచ్చలేదు. "ఓహో! వట్టిగడ్డికూడా నచ్చలేదా? అయితే ఉండు నీ తిక్క కనుక్కుంటాను" అని వాడు ఒక్క కొరడాతో వెనకకాళ్ళమీద చురక వేశాడు. పినాకరావు ఏడుస్తూ బాధతో ఓండ్రపెట్టాడు. ఆ అరుపులో జాలిగా ఇలా గన్నట్లయింది

"వోఁ ... వోఁ ... నాకు గడ్డి అరగదు"

"పోనీ పచ్చగడ్డి తిను"

"పచ్చగడ్డి తింటే నాకు కడుపు నొప్పి. వోఁ... వోఁయి..."

"అయితే యీ గాడిదగారికి పాయసం, పెరుగన్నం పెట్టాలా?" అని వాడు కోపంతో మరోసారి కొరడాతో వడ్డించాడు.

ఈ రెండోసారి దెబ్బ తీయగానే ఇంక లాభం లేదని పినాకయ్య నోరు మూసుకొని ఊరుకొన్నాడు. ఆ గుఱ్ఱపువాడు తలుపు మూసివేసి పోయాడు. పినాకరావు తిండి తిని చాలసేపయింది. ఆకలితో ఆవలింతలు వస్తున్నాయి. ఆవలింతతో నోరు తెరిస్తే బెల్లంపొయ్యి తెరచినట్టుంది. అటూ యిటూ వెదికాడు. ఆ వట్టిగడ్డితప్ప ఇంకేమీ లేదు. ఆ వట్టిగడ్డే నమలి, కళ్లు మూసుకొని మింగివేశాడు.

"ఈ గడ్డి అంత చెడ్డగా లేదు... అయ్యో! ఎలాంటి అవస్థ వచ్చింది. నా చదువు మానుకొని రాకపోతే యీ బాధలు లేకపోయేవిగా. ఈ గడ్డికి బదులు కమ్మని బిస్కత్తులు, వెన్న రొట్టె యివన్నీ తినేవాడినిగా! ఇపుడు ఏడ్చి ఏంలాభం! ఓర్చుకోవాలి."

తెల్లారి మళ్లా తన తొట్టిలో చూచుకొన్నాడు. గడ్డి అయిపోయింది. రాత్రంతా తనే తినేశాడు. ఇంకేం చేస్తాం అని ప్రక్కన ముక్కలుగా ఉన్న చొప్పగడ్డి తిన్నాడు. అది తింటూ ఉంటే అన్నం తిన్నట్టు ఆవకాయ పులుసు వేసుకొన్నట్టు లేదని తెలిసింది. "ఇపుడు విచారించి ఏం లాభం! ఓర్చుకోవాలిమరి! పోనీ నా గతి చూచి అయినా ఏ పిల్లవాళ్లూ ఇలాంటి అల్లరి పనులు చెయ్య రనుకొంటాను! ఓర్చుకోవాలి".

ఇంతలో వాడు వచ్చాడు. "ఓహో! ఓర్చుకో! నీకు తిండిపెట్టడం తప్ప పని లేదనుకొన్నావా? పని చెయ్యాలి. నాకు పనిచేసి డబ్బు సంపాదించడంకోసం నిన్ను కొన్నాను. లే. లేచి నాతో రా! సర్కస్‌లో నువ్వు గంతులువేసి, ఒంటికాలి నృత్యం చెయ్యాలి.మంటలుమండే రింగుల్లోంచి దూరాలి. వెనకకాళ్లమీద నడవాలి."

పాపం! పినాకయ్యకి ఇవన్నీ యిష్టం అయినా కాకపోయినా చచ్చినట్టు నేర్చుకోవాలిసివచ్చింది. అవి నేర్చడానికి మూడు నెలలు పట్టింది. ఈ మూడు మాసాలలోనూ తిన్న కొరడా దెబ్బలకి వీపు కరడుకట్టిపోయింది. చివరికి పినాకరావు సర్కస్‌లో ఆడ

పిల్లల కథలు •

పశ్చాత్తాపము

బుద్ధిరాజు స్వరాజ్యలక్ష్మి వయస్సు. 11 సం॥ అయిదో క్లాసు

అనగా అనగా వక గ్రామంలో వక రైతుకు వక కోడి వున్నది. దానికి అయిదుపిల్లలు వున్నవి. పెద్ద పిల్లకు రత్నకుమారి. రెండవదానికి రామకుమారి. మూడవదానికి పేరిపేరినతల్లి. నాలుగవదానికి పెద్దవ్వపాపి. అయిదవదానికి పద్మనాభం అని పేర్లుపెట్టి పిలుచుకుంటూవుండేది. ఆకాపువాని దొడ్లోనే వక కృష్ణతులసిచెట్టు వున్నది. ఆచెట్టుకు ఆయింట్లోవారందరూ ప్రార్థనలు చేసి రోజూ పిళ్లపోని ప్రదక్షిణాలు చేస్తూవుండేవారు. కోడికూడా ఆ తులసిచెట్టును ప్రార్థిస్తూ తాను మేతకుయితర చోటుకు వెళ్లి యున్న కాలములో తన పిల్లలకు ఎవరివల్లనూ హాని కలుగకుండా రక్షించమని ప్రార్థిస్తూవుండేది. ఆకోడి ప్రతిరోజూ మేతకు వెళ్లి తిరిగియింటికి వచ్చి తన పిల్లలలో ప్రతిదానినీ విడివిడిగ—

రత్నకుమారీ?—తలుపు తియ్యవే?
రామకుమారీ?—తలుపు తియ్యవే?
పేరిపేరినతల్లీ?—తలుపుతియ్యవే?
పెద్దవ్వపాపీ?—తలుపుతియ్యవే?
పద్మనాభం?—తలుపుతియ్యవే?

అని పిలవగానే అవి పరుగుతో వచ్చి తలుపుతీస్తూ వుండేవి. యీ హంశము వక కిరాతుడు కనిపెట్టిపిల్లలను ఎత్తుకొని పోవలెననే దురుద్దేశ్యముతో తల్లిలేని సమయములలో వచ్చి పిల్లలపేర్లుపెట్టి తల్లి పిలచిన విధముగా తలుపుతీయమని పిలువసాగెను. ఆ పిలుపు విని తల్లి వచ్చినదనుకొని పిల్లలు తలుపుతీయుటకు పోవుచుండగా తమ్మ కాపాడుచున్న తులసిచెట్టు—

రత్నకుమారీ—మీ అమ్మకాదు—తలుపుతియ్యకే?
రామకుమారీ—మీ అమ్మకాదు—తలుపుతియ్యకే?
పేరిపేరినతల్లీ—మీ అమ్మకాదు—తలుపుతియ్యకే?
పెద్దవ్వపాపీ—మీ అమ్మకాదు—తలుపుతియ్యకే?
పద్మనాభం—మీ అమ్మకాదు—తలుపుతియ్యకే?

అని చెప్పెను. పిల్లలు తలుపుతీయలేదు.

తులసిచెట్టు తనకు అభ్యంతరం చేసినదని ఆ కిరాతుడు అనుకొని దొడ్లోనికి దూకి ఆ చెట్టుతీసిపారవేసి పైపేర్లతో పిల్లలను పిలువసాగెను. తమ తల్లి అనుకొని ఆపిల్లలు తలుపుతీయబోవుచుండగా పీకివేయబడిన ఆమొక్క తమ తల్లికాదు తలుపుతీయవద్దని చెప్పుచుండెను. ఆతులసిమొక్క తీసివేయబడినప్పటికీ తనకు అభ్యంతరం కలిగినదని ఎంచి దానిని కాల్చి బూడిదచేసెను. తరువాత ఆపిల్లలను పేర్ల వారీగా పిలిచి తలుపుతీయమని కేకలు వేయుచుండెను. ఆ బూడిదకూడా మీ తల్లిరాలేదు. తలుపు తీయవద్దని పిల్లలకు చెప్పుచుండెను. పిల్లలు తలుపు తీయలేదు.

అంతట కిరాతునికి కోపము హెచ్చి ఆబూడిద తీసుకొని నీటిలో కలిపి ఆనీరు తాగెను. ఆవెంటనే ఆపిల్లలను పేర్ల వారీగా పిలిచి తలుపు తీయమని అరచుచుండెను.

తులసిబూడిదనీరు వాని కడుపులోవుండి "మీతల్లి రాలేదు తలుపుతీయవ"ద్దని వాని నోటితోనే చెప్పుచుండెను. పిల్లలు తలుపుతీయలేదు. పిల్లలు ఎట్టి ప్రమాదమూ లేకుండా యింటిలోనే వున్నవి ఆ కిరాతుడు తాను చేయుచున్నది జీవహింసాకార్యమని గ్రహించి పశ్చాత్తాపపడి అచ్చటనే మూర్ఛపోయెను. యింతలో పిల్లల తల్లి వచ్చి వాటి పేరులు పెట్టి పిలువగా "మీ తల్లి యిప్పుడు వచ్చినది. తలుపు తీయ"మని ఆమూర్ఛపడియున్న కిరాతుడే పలుకుచుండెను. పిల్లలు నిర్భయముగా తలుపు తీసెను. తల్లి, పిల్లలవద్దకు వెళ్లి జరిగిన విషాదగాథ తెలుసుకొని తులసి యొక్క అనుగ్రహము వల్ల తన పిల్లలకు హానికలుగకుండా రక్షణ కలిగినందుకు మిక్కిలి సంతోషము పొందెను.

చంపుటే ప్రధానవృత్తిగాగల మనకథలోని కిరాతునికైనా పశ్చాత్తాపము కలిగినది గాని, పూజనీయుడైన మహాత్మాగాంధిదేవుని తుపాకీతో కాల్చి చంపిన హంతకునికి పశ్చాత్తాపము కలుగలేదు. ఆపూజ్య బాపూజీ అస్థికలు దేశములోని అన్ని నదులలోను కలుపబడుచున్నందున ఆ పావనజలము త్రాగు ప్రతివారు సత్యము' అహింస. మతసామరస్యము అలవర్చుకొని ఆయన ఆత్మశాంతి కలిగించుట మన విధాయకకృత్యమై యున్నది — గాంధీజీ చావునకు విచారించే మన భారతీయులకు మన బాపూజీ ప్రాణములను బలిగొన్న వున్మాదుని ప్రస్తావన అవుసరం లేదు గాని, మనల నందరినీ వుద్ధరించిన గాంధీజీ ఆత్మకు శాంతి కలగడానికే మనం పాటుపడాలి.

బాలగేయాలు

శ్రీ చింతా దీక్షితులు

(సంపాదించినవి)

16

తరుణి తరుణి
తా పెళ్లికొడుకు
సుబ్బక్క పెండ్లి
సూదిలో దారం.

17

ఇసుకలో చెండు - దాసిమ్మపండు
పత్తిచేలో పగడం - మీకూ మాకూ జగడం.

18

కుతకుత గుజ్జన్న
వండీ వంకాయ
పారేసే బచ్చలి
తినీ కారం.

19

మొండిచెయ్యి పేరక్క
మొగు డెక్కడి కెళ్లేడు
కందులూ రేళ్ళాడు
కందులు తెచ్చాడు
పక్కలో పోశాడు
పరపరా నవిలేడు
కడుపునొ ప్పొచ్చింది.

వలసిన రోజువచ్చింది. ఆ వేళ రంగు రంగుల కాగితాలమీద వ్రాసి అన్ని గోడలమీదా పినాకరావును గురించి ప్రకటన చేసి అంటించారు.

నేటిరాత్రి! మంచితరుణం! మించిన దొరకదు!

గొప్ప సర్కస్ ప్రదర్శనం. అపూర్వమైన అడవిజంతువులు, గుఱ్ఱాలు, ఏనుగులు, లొట్టిపిట్టలు, సింహాలు, చిరుతపులులతోపాటు లోకప్రసిద్ధి వహించిన నాట్యరంగభూషణ,

రంగపుష్ప గార్దభశిరోమణి

పినాకరావుగారు నృత్యం చేస్తారు. మా దేదీప్యమానమైన దీపాల వెలుగులో యీ నృత్యం చూడండి.

ఆ వేళసాయంకాలం, అసలు ఆట ప్రారంభించడానికి ఒకగంట ముందుగానే సర్కస్ పెండాలు అంతా క్రిక్కిరిసిపోయింది. జనంఅంతా కిటకిటలాడిపోతున్నారు. కుర్చీలు, బాక్సులు, గ్యాలరీలు, నేల అన్నీనిండిపోయాయి. ఈ చిన్నగాడిద ఎలాగ నృత్యం చేస్తుందో చూద్దామని వచ్చిన పిల్లలు ఎపుడు ఆట ప్రారంభం అవుతుందా అని ఎదురు చూస్తున్నారు.

ఆటలో మొదటి వేడుకలు కాగానే, కంపెనీమేనేజరు నల్లటి కోటు, తెల్లటి పంట్లాం, మోకాళ్లవరకు వచ్చిన బూట్సు, చేతిలో కొరడా పుచ్చుకొని వచ్చి సభాసదులకి తలవంచి ముందుగా నమస్కారం పెట్టాడు. పెద్ద ఉపన్యాసం మొదలుపెట్టాడు.

“సోదరసోదరీమణులారా!

మన దేశంలో అనేకమహారాజులు, నవాబులు, జమీందారులు, వర్తకులు వీరందరియెదుట నృత్యంచేసిన యీ చిన్నగాడిదను మీ యెదుట, రసికులయిన మీయెదుట యిపుడు ప్రదర్శిస్తున్నాను. ఈ గార్దభశాబకము యీ మహారాజులయెదుట ఆడి, వారి మెప్పులను వెండికప్పులను పొంది, చెప్పరాని గొప్పతో ఒప్పినది. కనుక మీరు కూడా యీ గాడిదగారి గాననృత్యాలను చూచి సంతోషించ ప్రార్థన.” అని తప్పుకొన్నాడు.

ఇది విని జనంఅంతా పకాలున నవ్వి, ఒకనిమిషంసేపు తప్పట్లు కొట్టారు. ఇంతలో చిన్నగాడిద పినాకం వచ్చేటప్పటికి తప్పట్లు యీలలూ మరింత ఎక్కువయ్యాయి. గాడిదపినాకరావును ప్రత్యేకంగా అలంకరించి తీసుకొనివచ్చారు. మెళ్లో ముఖమ్మల్ పటకా, చెవులకి ముత్యాల హారాలు, ఇత్తడిబొత్తాలు పెట్టిన నల్లని తోలుపటకా ముఖానికి, వంటిమీద జూలు ఉంగరాలు దిద్ది వాటికి రంగు రంగుల రిబ్బనులతో జడలు వేశారు. వంటినిండా బంగారు వెండి జరీఅంచులుగల శాలువా కప్పారు. తోకకి పసుపు నీలిరంగుగల రిబ్బనులు కట్టారు. గాడిద అయితే అయిందికాని మొత్తంమీద చాలమందికి ముద్దేసుకొని వస్తున్నట్టుంది.

మేనేజరు వచ్చి మళ్లీ యీ గాడిదనుగురించి వర్ణించాడు.

“సభాసదులారా!...ఒకమాట. ఆఫ్రికాలోని మహారణ్యప్రాంతాలలో కొండలోయల్లో తిరుగుతూ వున్న యీ గాడిదగారిని ఎంతో కష్టంమీద సంపాదించాము. దీనిని తర్ఫీదుచేసి యిలాగ తయారుచేసేటప్పటికి మా తాతలు దిగివచ్చారు. చూడండి యీ గాడిదగారి కళ్లు. ఆయొక్క సోగకన్నులలోని పెంకితనం, తెలివితేటలు చూడండి. దీనిని మచ్చికచేయడానికి నయానా భయానా ఎన్ని ప్రయత్నాలో చేశాం. చివరికి దారుణమైన కొరడాకూడా ఉపయోగించవలసివచ్చినందుకు చాల విచారిస్తున్నాం. కాని తెలివితేటలు చూపి ఎంత మంచితనంగా ఉన్నా ప్రయోజనం లేకపోయింద. సామ, దాన, భేద, దండోపాయాల్లో నాలుగోదే ప్రయోగించి యీ జంతువును యీ దారిలోకి తీసుకొనివచ్చాం. దీనిని ఎందరో గొప్ప గొప్ప డాక్టర్ల చేత పరీక్ష చేయించాం. ప్యారిస్ నగరంలో ఒక పెద్ద డాక్టర్ దీనిని పరీక్షచేసి దీనితలలో మంచి తెలివితేట లున్నాయి. దీనికి నాట్యం చేసే సుడి ఉన్నదని చెప్పినారు. ఆ కారణంచేత ఓ మహాజనులారా! దీనికి భరతనాట్యమే నేర్పించినాను. అది రాలేదు. కాని, రింగులలో నృత్యంచేయడం కూచిపూడి, కథాకళి, రుమేనియా, మణిపురినాట్యాలు కూడా చేస్తుంది. అందుచేత మహాజనులారా! నే చెప్పేది ఏమిటంటే, యిటువంటి ప్రపంచ ప్రఖ్యాతి గడించిన గాడిదగారి అపూర్వ నాట్యప్రదర్శనం చూచే మహదవకాశం మీ యొక్క పుణ్యవిశేషంచేత మీకు దొరికింది. అందుచేత యిది జారవిడువక ప్రతిరోజూ వచ్చి చూచి మీరు మనసార ఆనందించి మమ్మల్ని సంతోషపెట్టవలసిందని ప్రార్థన. కారణాంతరాలచేత వర్షం వస్తే డబ్బువాపసు లేదు. మరి సెలవా?” అని మరోసారి తల వాల్చి, పినాకయ్యకేసి ఆ మేనేజరు తిరిగి “జాగ్రత్తసుమా, పినాకయ్యా! నువ్వు నాట్యం ప్రారంభించే ముందు, సభాసదులకి తలవంచి నమస్కారం చెయ్యిసుమా!” అన్నాడు. పినాకయ్య అలాగే అని తన మోకాళ్లు, తలా వంచాడు. మోకాళ్లు భూమిమీద ఆనేటట్టు ఎత్తి పట్టుకొన్నాడు.

‘ఒకటి, రెండు, మూడు - కాలు అడుగు పైకెత్తు’ అనగానే పైకెత్తి నడిచాడు పినాకం. ‘పరుగెత్తు’ అనగానే చుట్టూ పరుగెత్తుతూ ప్రదక్షిణం చేశాడు పినాకం.

“నడు, కదనుత్రొక్కుతూ” అలాగే చేశాడు.

“గేలప్” అనేటప్పటికి ఒకటే పరుగు. అతివేగంగా పరుగెత్తుతూ ఉంటే మేనేజరు డామ్మని పిస్తోలు పేల్చాడు. అది దెబ్బతగిలినట్టు, చచ్చినట్టు గాడిద నేలమీద పడిపోయింది. అదంతా వట్టిది. మళ్లీ లేచేటప్పటికి జనం అంతా నవ్వులు, తప్పట్లు—గోల.

పినాకయ్య తలయెత్తి చుట్టూ చూస్తూఉంటే, ఒక బాక్సులో అందమైన ఒక సుందరి కనిపించింది. ఆవిడ మెడలో బంగారపుగొలుసు మెరసిపోతోంది. ఆ గొలుసు చివర చిన్న బంగారపు బిళ్ల. ఆ బిళ్లమీద బొమ్మ ఎవరిదో తెలుసునా? పినాకరావు బొమ్మగా ఉన్నప్పటిది!

“అది నాబొమ్మే” అని పినాకరావు గుర్తుపట్టి “ఆవిడ నిజంగా దేవకన్యే” అనుకొన్నాడు. సంతోషం ఉండబట్టలేక “సుందరీ! దేవకన్య” అని కేకలేశాడు. ఆమాటలు వినిపించడానికి బదులు, గాడిద ఓండ్రపెట్టా ఉన్నట్టు వినిపించింది. అక్కడ జనమంతా ముఖ్యంగా పిల్లలందరూ నవ్వారు. మేనేజరుకి కోపం వచ్చింది. పదిమందిలో ఓండ్రపెట్టడం మర్యాద కాదని చెప్పడం కోసం, గాడిదముక్కుమీద తగిలేటట్టు కొరడా వెనక్కి త్రిప్పి పిడితో కొట్టాడు. ఆ చిన్న గాడిద నాలుక సాచి మూతి, ముక్కు అయిదునిమిషాలసేపు నాలుకతో నాకితేగాని ఆ బాధ పోలేదు. దేవకన్య మాయమైపోయింది!...మళ్లీ తలయెత్తి ఆసుందరి ఉన్నచోటచూస్తే, ఆమె లేదు.

ముందుకాళ్లతోనూ వచ్చింది. చచ్చిపోదా మనుకొన్నాడు. కళ్లు నీళ్లతో నిండిపోయాయి. ఏడవడం మొదలుపెట్టాడు. ఎవ్వరూ ఇది కనిపెట్టలేదు. ఆ మేనేజరు అసలే చూడలేదు. కొరడాచివర ఝుళిపించి, “ఏదీ పినాకం, నీ నాట్యం చూపించు” అన్నాడు. తర్వాత వెనకకాళ్లతోనూ, గాడిదకి, చాల దుఃఖం నాట్యం చేశాడు. తర్వాత పెద్ద రింగుపట్టుకొని దాంట్లోంచి దూకమన్నాడు. దానిలోపలినించి వెళ్ళేకంటె ప్రక్కనించి వెళ్ళడం సులువు అనిపించింది. చివరికి ధైర్యంచేసి పినాకరావు దూకాడు. కాని పాపం ఆరింగులో వెనుకకాలు చిక్కుపడి క్రింద పడిపోయాడు. ఆ పడడం అటుప్రక్కకి గంతువేసి వాళ్లమీద పడ్డాడు. అల్లరి అయింది. లేచేటప్పటికి కాలు కుంటు అయింది. ఎంతో కష్టంమీద తనశాల చేరుకొన్నాడు. ఇంతలో పిల్లలందరూ చేరి “ఏది పినాకయ్యను చూడాలి; బయటికి తీసుకురాండి” అని అడిగారు. సర్కసులో జరిగిన ప్రమాదానికి వాళ్లందరికీ జాలివేసింది. కాని ఆవేళ సాయంకాలం యింక సర్కసులోకి పినాకయ్యను తేలేదు, ఒకపశువుల డాక్టరుకి యీ గాడిదను చూపించారు. ఆయన పరీక్ష చేసి యీ గాడిద జీవితమంతా యిలాగ కుంటిగానే ఉండక తప్పదని చెప్పాడు. అప్పుడు మేనేజరు గుఱ్ఱపువాడిని చూచి “యీ కుంటిగాడిద మన కెందుకు? తీసుకొనిపోయి సంతలో అమ్మేసిరా” అన్నాడు.

సంతలో అమ్మజూపేటప్పటికి ఒకడు వచ్చి అడిగాడు. “ఎంతధర?” అనేటప్పటికి “20 రూపాయ”లని చెప్పాడు గుఱ్ఱపువాడు. ఇరవైరూపాయలుకాదు, ఇరవై అణాలు ఇస్తాను. ఈ గాడిద నాకు పనికోసం కాదు. దీనిని చంపి యీ చర్మంతో ఒక పెద్ద రండోలు చెయ్యాలి” అన్నాడు. అమ్మకం జరిగింది ఆ ఇరవైఅణాలకే. తాను ఒక రండోలు అవుతాను అనేటప్పటికి ఆ గాడిద పినాకయ్య ఎంత ఎలాగ అనుకొందో వేరే చెప్పాలా?

ఇరవై అణాలు ఇచ్చి కొన్నవాడు యీ గాడిదను సముద్రపు ఒడ్డుకు తీసుకొని వెళ్ళాడు. దాని మెడలో పెద్ద బండరాయి కట్టి యింకో త్రాడు కట్టి అది చేతిలో ఉంచి, గాడిదను సముద్రంలోకి త్రోసివేశాడు. పినాకయ్య, యీ బండరాయి బరువువల్ల సముద్రం అడుగుకి పోయాడు. త్రాడు చేతిలో పెట్టుకొని ఆ యజమాని సముద్రపు ఒడ్డున చూస్తున్నాడు. ఈ గాడిదచస్తే దాని చర్మంతో రండోలు చేసుకోవచ్చుగదా అని.

కర్నూలు జిల్లాలో బంగానపల్లి సంస్థాన సమైక్యము

భారతదేశంలో మొత్తం 500 కు పైగా సంస్థానాలున్నా ఆంధ్రదేశంలో సంస్థానాలు రెండే వున్నవి. వానిలో పెద్దది, ముఖ్యమైనది హైదరాబాద్ సంస్థానం. ఈ సంస్థాన ప్రజలలో మహారాష్ట్రులు, కన్నడులు కూడ చాల మందివున్నా, సంస్థాన ప్రజలలో అత్యధిక సంఖ్యాకులు తెలుగువారవటంవలననూ, సంస్థాన భూభాగంలో అత్యధికభాగంలో తెలుగువారే నివసిస్తుంటటంవలనను ఇది తెలుగు దేశంలోని సంస్థానమనియే వ్రాశాను. ఈ సంస్థానం స్వతంత్రంగా వుండాలని నవాబు నిర్ణయించిన సంగతి, అటుకర్నాక వున్న పైన ఆశేష సమస్యలు మనకు తెలియును. ఆంధ్రదేశంలోని రెండవ సంస్థానము బంగానపల్లి సంస్థానము. ఈ సంస్థానపాలకుడుకూడా మహమ్మదీయుడే. కాని నిజాంవలె ఈయన సర్వస్వతంత్రమని గాని, తన సంస్థానము భారత యూనియన్‌లో జేరినా ప్రత్యేకత రక్షింపబడవలసిందేనని పట్టుబట్టక ప్రజాభీష్టము ననుసరించి తన సంస్థానము మద్రాసు రాష్ట్రంలో జేరిపోవుటకు అంగీకరించాడు.

బంగానపల్లి సంస్థానము కర్నూలుజిల్లాలో నున్నది. ఈ సంస్థానమంతా కర్నూలుజిల్లా వలెనే సముద్రమట్టమునకు దాదాపు 800 అడుగుల ఎత్తున వున్న పీఠభూమియే. ఉత్తరమున డామల్లకోట, నంద్యాల తాలూకాలు, పడమర పత్తికొండ, కోయిలకుంట్ల తాలూకాలు, తూర్పు, దక్షిణముల నంద్యాల, కోయిలకుంట్ల తాలూకాలు గల ఈ సంస్థానము విస్తీర్ణము 255 చ. మైళ్ళు. సంస్థానానికి ముఖ్యపట్టణమగు బంగానపల్లి పట్టణం పాణ్యం రైలుస్టేషన్‌కు 17 మైళ్ళ దూరంలో వుంటుంది. ఈ పట్టణం జనసంఖ్య ఐదు వేలకు మించదు. కుందేరు, జుర్రేరు అను రెండు చిన్ననదులు ఈ సంస్థానంలో ప్రవహిస్తున్నాయి.

పుట్టుక - చరిత్ర

ఈ సంస్థానం అనాదినుండి ఒక కీలక స్థానముగా వుండేది. కర్నూలు జిల్లా ప్రాంతమును పాలిస్తున్న రాజులు, ఇచ్చటి కోటకు ఒక కిల్లాదారును నియమించి, ఈ ప్రాంతమును రక్షించుకొను చుండెడివారు. అదేవిధముగా 1761 వ సం. లో హైదరాబాద్ రాజు కోటకు కిల్లాదారుగా హుస్సేన్ అలీఖాన్‌ను నియమించినట్లు చారిత్రకాధారము లున్నవి. తరువాత కొన్ని సంవత్సరములకు ఈ కిల్లా ప్రాంతము మైసూరు రాజునకు వశపడిపోయినది. ఆ సమయంలో టిప్పు సుల్తానుచే జారీచేయబడిన ఒక ఫర్మానా ప్రకారం ఈ జాగీరు 1783 వ సం. లో హుస్సేన్ అలీఖాన్ కొడుకైన గులాం అలీ ఖాన్‌కు మంజూరు చేయబడినది. కాని టిప్పు అతనిని త్వరలోనే పదభ్రష్టుని చేసెను. అటుపైన ఈ గులాం అలీ ఖాన్, అతని పినతండ్రి అసాద్ అలీఖాన్‌లు నిజాంతో జేరి, జాగీరును టిప్పుతరపున పాలిస్తున్న యూసఫ్ అనువానిని ఓడించి, తిరిగి హైదరాబాద్‌కు జేర్చినారు. 1790 వ సం. లో నిజాం జారీచేసిన ఒక ఫర్మానా ప్రకారం ఈ జాగీరు గులాం అలీఖాన్‌కు, అతని పినతండ్రి అసాద్ అలీఖాన్‌కు సంయుక్తముగా నివ్వబడినది. కొంత కాలమునకు అసాద్ మరణించగా, జాగీరంతయు గులాంకు చెందిపోయి, అప్పటినుండి అతని వారసుల పరిపాలనలో నున్నది. 1800 వ సం. లో హైదరాబాద్ నవాబు దత్తమండలాలను భారతప్రభుత్వానికి దప్పజెప్పినప్పుడు, కర్నూలు జిల్లాతోపాటు ఈజాగీరు కూడా బ్రిటిష్‌వారికి వశపడిపోయి, ఒక ప్రత్యేక సంస్థానంగా పరిగణించబడుచున్నది. హైదరాబాద్ నవాబు ఈ జాగీరును బ్రిటిష్‌వారికి వప్పజెప్పేటప్పుడు ఏర్పరచిన ప్రత్యేకషరతులవలన ఈ జాగీరును సంస్థానముగా గుర్తించి, దాని పారంపర్యమును రక్షించుటకు బ్రిటిష్‌వారు ఒప్పుకొనిరి. ఈవిధముగా ఈ జాగీర్‌దారు నిజాంనుండి స్వతంత్రము పొందినను తనను నిజాంసేవకునిగానే పరిగణించుకొనచు, ఎక్కువకాలము హైదరాబాదులో నివశించుచు, పరిపాలనయందు అశ్రద్ధ వహించియుండుటవలన సంస్థానములో అలజడి, కల్లోలము జరిగి 1832 వ వి సం, లో బ్రిటిష్‌వారు సంస్థానమును వశపరచుకొనిరి. 1835 వ సం. నుండి 1848 వ సం. వరకు సంస్థానము మద్రాసుప్రభుత్వముచేతనే పరిపాలింపబడెను.



బంగానపల్లి సంస్థానంపై కర్నూల్ జిల్లా కలెక్టర్ అధికారస్వీకారం దర్బారు మద్రాసు ప్రభుత్వ ప్రతినిధి కుద్వాగారు ప్రసంగిస్తున్నారు. కలెక్టరు బంగారాగారు ఆసీనులై వున్నారు.

ఇదివరకు బ్రిటిష్‌వారు నిజాంకు చేసియున్న వాగ్దానముల సంగతి భారత ప్రభుత్వమునకు జ్ఞప్తికి తేగా, 1848 వ సం.లో సంస్థానమును తిరిగి సంస్థానాధీశ్వరునకు వప్పజెప్పిరి. మొదటి గులాం అలీఖాన్ మనుమడగు గులాం అలీఖాన్ ఈ పర్యాయము నవాబయ్యెను. 1862 వ సం. ఇతనికి యివ్వబడిన మరొక 'సనద్' ప్రకారం నవాబు వంశపారంపర్యమును రక్షించుటకు బ్రిటిష్‌వారు అంగీకరించిరి. ఈ గులాం అలీఖాన్ 1868 వ సం.లో మరణించగా అతని కుమారుడు ఫతే అలీఖాన్ నవాబయ్యెను. ఇతని పరిపాలన ప్రజలకసంతృప్తికరమగుటచే, 1905 వ సం.లో అతనిని తొలగించి, సంస్థాన పరిపాలన బ్రిటిష్ ప్రతినిధికి వప్పగించబడెను. కాని కొన్ని నెలలతరువాతనే ఫతేఖాన్ మరణించుటచే, అతని పుత్రుడు సయ్యద్ గులాం అలీఖాన్ నవాబయ్యెను. ప్రస్తుతము నవాబుగానున్న ఫజల్-ఎ-అలీఖాన్ 1922 వ సం.లో నవాబయినాడు. ఈయన తరువాత నవాబు కావలసినవాడు, ఈయన కుమారుడు మీర్ గులాం అలీఖాన్.

ఈ సంస్థానము భారత ప్రభుత్వమునకు కప్పము చెల్లించవలసిన అవుసరములేదు. సంస్థానమునకు సైన్యము వుంచుకొనుటకు హక్కు కూడ లేదు. సంస్థాన జనసంఖ్య 45 వేలకు మించదు. వీరందరు తెలుగువారు. వీరి ఆచార వ్యవహారములు, భోజనము కర్నూలుజిల్లా ప్రజల పద్ధతులనే పోలియుండును. సంస్థానము ఆదాయము సం.నకు రూ. 4 లక్షలు వుండవచ్చును.

భారతదేశము స్వాతంత్రముపొందిన తరువాత తమ సంస్థానములన్నిటిని ప్రక్కనున్న రాష్ట్రములలోగాని, సంస్థానకూటమిలో గాని జేర్చివేయవలసిన అవుసరమును సంస్థానాధీశ్వరులందరు గుర్తించినట్లే బంగానపల్లి నవాబు మీర్ ఫజల్-ఎ-అలీఖాన్ కూడ గుర్తించి, సంస్థానమును మద్రాసురాష్ట్రముతో జేర్చివేయుటకు అంగీకరించినాడు. ఈ నిర్ణయమునకు సంస్థాన ప్రజలు తమ ఆనందాతిరేకమును తెలిపిరి. సంస్థాన పరిపాలనను కర్నూలు జిల్లా కలెక్టరు ఈ మధ్యనే వప్పగించుకున్నాడు. ఇట్టి నిర్ణయము చేసి, ప్రజాభిప్రాయమును మన్నించినందుకు నవాబు అభినందనీయుడు.

మనదేశములో వీరపురుషారాధనము

శ్రీ కోన వెంకటరాయ శర్మ

"క్రదనమె బొమ్మరిల్లు, చెలి
కత్తెలె వీరజయాంగనామణు,
ల్మదకరిమస్త కుంభములు
మాటికి దొంతులు సంగరస్థలి,
న్నదికొని వడ్డి రాహుతుల
క్రొవులు గుజ్జన కూళ్లు"

—గా మహాసంగ్రామ రంగంబులలో దమ యనుపమాన శౌర్య ధైర్య గాంభీర్య ప్రతాపములగపఱచి శత్రు సంహార శత్రువిజయము లొక వినోదలీలమాకని దిక్తటంబుల జాటగల్గిన వీర విక్రమాదిత్యుల యారాధనము ప్రాచీనము నుండియు మనదేశములో గలదు.

అజేయములని యనుకొన్న జల, గిరి, వన, స్థల దుర్గముల నెన్నిటినో సాధించి, యాజైత్రయాత్రలలో నగపఱచిన ప్రజ్ఞాపాటవముల దెలుపు వీరగాథలు, సాహసపు గథలు—పూర్వము మన పితామహ ప్రపితామహాదులు సంక్రాంతి దినములలో భోగిమంటల ముందు గూరుచుండి తమ పుత్రపౌత్రులకు జెప్పుచుండెడివారు. వసంతోత్సవములలో విజేతలైన శూరాధులు తమ బంధుమిత్రాదుల్ప్రుతల రకా జైత్రయాత్రలయందు దుర్గముల సాధించుటలో నరరాజ్యముల నిర్మూలించుటలో, శత్రువిదళన మొనర్చుటలో నగపఱచిన శక్తిసామర్థ్యముల, బ్రజ్ఞావిశేషముల జూపి వినోదముల దిక్ప్రదర్శన మొనర్చి యుచ్చుకు గొల్పుచుండెడివారు. శరద్రాత్రుల పుచ్చపూవెన్నెలలో దమ చిన్నబిడ్డలకు ముదుసలులు వీరవనితల సాహసవిక్రమోపేత కృత్యముల దెలుపు కథలు వినిపించి, జోకొట్టి నిద్దుర వుచ్చుచుండెడివారు. అ వీరాంగనలు సైంధవ శిక్షణము, సాముగరిడీలు నేర్చి, యౌదార్యమునకు, శౌర్యప్రతాపములకు, దయా-ధర్మపరత్వమునకు,—నెలవయి యుండుటవలన వారి జీవిత గాథలు చరిత్రాంశములై, కథలై విరియ బ్రాకినవి; ప్రచంచించినవి.

ఇవ్విధముగ వీరపురుషారాధనము అనూచానముగ మన దేశమున నుండుచుండెడిది. రణరంగములలో విక్రమించి, తనువులబాసి, జానపదులచే దమ వీరోచితకృత్యముల బ్రశంసింపబడుచు, నారాధింపబడుచు, నుండుటయేగాక అ వీర పురుషారాధనమునకయి విగ్రహముల బ్రతిష్ఠించుటయు, దేవాలయముల నిర్మించుటయు జరుగుచుండెడిది. వల్లభామాత్యుని 'క్రీడాభిరామము'నందలి—

"ద్రుతతాళంబున వీరగుంభిత కథం
దుంధుం కిటాత్కార సం
గతి వాయింపుచు నాంతరాలిక యతి
గ్రామాభిరామంబుగా
యతిగూడం ద్విపద ప్రబంధమున వీ
రానీకముం బాడె నొ
క్కత ప్రత్యేకముగాఁ గుమారకులు ఫీ
ట్కారంబునం దూలఁగన్."

"గర్జించి యరసి జంఘాకాండ యుగళంబు
వీరసంఘట కోలవ్రేయు నొకఁడు
ఆలీఢ పాదవిన్యాస మొప్పఁగ వ్రాలి
కుంతాభినయముఁ గైకొను నొకండు
బిగువుఁ గన్నుల నుబ్బ బెదరుచూపులతోడ
ఫీట్కార మొనరించుఁ బెలుచ నొకఁడు
బటు భుజావష్టంభ పరిపాటి ఘటియిల్ల
ధరణి యాస్ఫోటించి దాఁటు నొకఁడు
ఉద్ది ప్రకటింప నొక్కరుఁ డోలవాఁడు
బయల గుఱ్ఱంబు భంజళిఁ బఱపు నొకఁడు
కుడుము దాఁటించుచును బెద్ద కొలువులోన
బడఁతి పల్నాఁటి వీరులఁ బాడువపుడు."

అను పద్యములు వీరపురుషుల వీరోచిత కృత్యములఁ బ్రకటించు నభినయాది కృత్యముల నభివర్ణించుచున్నవి. అంతతో దనివోక అ వీర పురుషు లలంకరించుకొన్న యలంకారములను

"పచ్చని పిండి గందమును
పాలము నేసయు నెఱ్ఱపూవులం
గ్రుచ్చిన కంఠమాల్యములు
గుప్పఁగ నల్లిన వేణిబంధముల్
కుచ్చుల వీరసంబెటయుఁ
గ్రొత్తమణుంగకు కాసెపుట్టము
న్నచ్చులు చెక్కినట్టి రవ
ణంబులు వీరకుమార కోటికిన్."

—అని వల్లభామాత్యుని 'క్రీడాభిరామ' పద్యము వలన దెలుపుచున్నాడు.

ఆకాలమున భైరవార్చనము విశేష విశ్వాసముతో జరుగుచుండెడి దనియు, విశ్వాసులు భక్తి ప్రపత్తులతో బ్రాణముల నర్పించి ముక్తి నభిలషించుట దటస్థించుచుండె ననియు—

అమితోత్సాహము తోడ నీవు పటుబా
హా ఢక్క యొక్కొక్క మా
టు మనఃకంపము నొందఁ జేయఁ దొలుకా
డు న్వార్ధి వేలాలుత
త్కమగంబై వలమాన వయి యు
దృన్నక్రమై యుత్తర
త్రిమిరాయె యుల్ల లదంబుమగ్న ధూలిర్వై
ధీరా మహాభైరవా!"

అను 'క్రీడాభిరామ' మందలి పద్య మభగత మొనర్చుచున్నది. ఆనాడు భైరవుని శివునియవతారముగా దలంచుచుండెడివారు. అతని యాకృతి వీరభయానకరసముల నుద్దీపించుచుండెను. "ఈశాన స్సర్వవిద్యానా మీశ్వర స్సర్వభూతానామ్, బ్రహ్మాధిపతి ర్బ్రహ్మణోఽధిపతి ర్బ్రహ్మా శివో మే అస్తు సదాశివోం"— అను నీశానమంత్రము శివుడే పరబ్రహ్మ మని

(21-వ పేజీ చూడుడు)

మద్రాసురాష్ట్ర నూతనబడ్జెట్ వివరాలు

అభివృద్ధి కార్యక్రమ ఆచరణలో మందగింపు:
మూడు క్రొత్త ప్రాజెక్టుల ప్రారంభానికి సంకల్పం

ఈ సంవత్సరపు ఆదాయవ్యయములను వివరిస్తూ రానున్న సంవత్సరమునకు ఆదాయ వ్యయములను అంచనా వేస్తూ, ఖజానాశాఖ మంత్రి గా. శ్రీ గోపాలరెడ్డిగారు మన శాసనసభలలో బడ్జెట్ ప్రవేశపెట్టినారు. ఈ సంవత్సరం అనగా 1948 వ సం. మార్చినెల 31 వ తేదీతో అంతమయ్యే సంవత్సరం, వ్యయం అంచనా వేసిన మొత్తముకన్న చాల తగ్గుటచే, రివెన్యూ రిజర్వులనుంచి వాడవలసిన మొత్తము పూర్తిగా తొలగించి, ఆ రిజర్వుకు కొంత మొత్తము జమ కట్టుటకు కూడ వీలుపడినది; అయితే, ఈ సంవత్సరం దేశ ఆర్థికాభివృద్ధికి చేయవలెనను కొన్నంత మొత్తము ఖర్చు జరిగియుండలేదు. స్వతంత్ర భారతదేశములో రాష్ట్రీ, కేంద్ర ప్రభుత్వములు ఆర్థికాభ్యున్నతికి ఇతోధికముగా పాటుబడునని ఆశించినవారికి ఇది చాల ఆశాభంగమని చెప్పక తప్పదు. ఇది ఇట్లుండగా, రానున్న సంవత్సరం, అనగా 1948 వ సం. ఏప్రిల్ 1 వ తేదీతో మొదలిడి 1949 వ సం. మార్చినెల 31 వ తేదీతో అంతమయ్యే సంవత్సరంలో ఖర్చు ఆదాయముకన్న 5 కోట్ల రూ.లకన్న ఎక్కువ వుండునని అంచనా వేయబడినది. రానున్న సంవత్సరపు వ్యయములో ఆర్థికాభ్యున్నతికి చేయవలెనని నిర్ణయించిన ఖర్చు మొత్తముకూడ తక్కువే. మామూలు ఆదాయముకన్న మామూలు వ్యయము పెరిగిపోవుట, ఆ లోటును భర్తీచేయుటకు ప్రయత్నము జరుగకపోవుట ఆశ్చర్యకరముగా నున్నది. ఈ బడ్జెట్‌లో మెచ్చుకొనదగిన అంశము, రాష్ట్రమందంతటను మద్యనిషేధము అములు జరిపినను, మద్యపాననిషేధ వ్యతిరేకులు చెప్పినట్లు, రాష్ట్ర ఆర్థిక స్థితి చెడిపోదని రుజువు చేయుటయే. కాని మద్యనిషేధమువలన ఏర్పడిన కొరతను రివెన్యూ రిజర్వునుండి గాక ఇతర పన్నులద్వారా భర్తీచేసిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇంతకన్న చక్కగ యుండెడిది. 1947-48, 1948-49 సం॥లకు సంబంధించిన మన రాష్ట్ర ఆదాయవ్యయముల వివరముల నీ క్రింది పట్టికలో చూడుడు.

	1947-48 వ సం. అంచనా రూ. లక్షలు	1947-48 వ సం. ఇప్పటి అంచనా రూ. లక్షలు	1948-49 వ సం. అంచనా రూ. లక్షలు
ఆదాయము:—			
మామూలు ఆదాయము	48,24.38	55,19.17	50,32.31
రివెన్యూ రిజర్వునుండి జమ	1,49.00	—	5,62 00
మొత్తం	49,73.38	55,19.17	55,94 31
వ్యయము:—			
మామూలు వ్యయం	36,58.84	47,19.20	47,05.92
యుద్ధానంతర పునర్నిర్మాణమునకు ఖర్చు	7,06.90	4,26.25	4,83.26
ప్రభుత్వవ్యాపారములో పెటుబడి	6,07.07	1,18.81	4,04.42
రివెన్యూ రిజర్వుకు జమ	—	2,55.00	—
మొత్తం	49,72.81	55,18 76	55,93.-60
మిగులు	.57	.41	.71

ఈ పట్టిక ప్రకారము 194748 వ సం. మామూలు ఆదాయము, వ్యయము అంచనాకన్న బాగానే పెరిగినవి. కాని అతి ముఖ్యమైనది యుద్ధానంతర పునర్నిర్మాణ ప్రణాళికల ఆచరణ అడుగున పడిపోయినది. భవిష్యత్కాలములో పరిశ్రమలను, వర్తకమును ప్రభుత్వ పరముగా నడుపవలెనని అనుకొనుచున్న సమయములో ప్రభుత్వవ్యాపారము చాలవరకు తగ్గించుకొనుటవలన, అనుభవము సంపాదించుకొనుటకైనను అవకాశము లేకుండపోయినది. 1948-49 వ సం.లో మామూలు వ్యయము ఈ సంవత్సరములో వలెనే వుండి, మామూలు ఆదాయము రూ. 5 కోట్లు తగ్గిపోవునని అంచనా వేయబడినది. ఈ రూ. 5 కోట్ల తగ్గుదలలో దాదాపు రూ. 4 కోట్లు మద్యనిషేధమువల్ల జరిగిన దని చెప్పవచ్చునుగాని అమ్మకపు పన్ను హెచ్చు చేయుటవలన ఆ మొత్తము దాదాపు పూడినట్లే యగుచున్నది. కాబట్టి 1948 49వ సం॥ లోటు రూ. 5 కోట్లు రివెన్యూ రిజర్వునుండిగాక ఇతరత్ర సంపాదించుటకు ప్రయత్నించవలసినది. గతసంవత్సరములలో ఆదాయము వ్యయముకన్న ఎక్కువగానున్నప్పుడు పోగుచేసివుంచిన రిజర్వు దేశార్థికాభ్యున్నతికి ఉపయోగించిన తగిన ఫలితము చేకూరునుగాని, మామూలు వ్యయము పెంచుటకు ఉపయోగింపబడినచో అది ఆశించినంత లాభసాటిగా ఉపయోగింపబడినట్లు పరిగణింపబడరాదు. యుద్ధానంతర ఆర్థికాభ్యున్నతి కార్యక్రమమునకు ఈ సంవత్సరము రూ. 7 కోట్లు ప్రత్యేకించి రూ. 4 కోట్లు మాత్రమే వినియోగింపగల్గిరి. రానున్న సంవత్సరము రూ. కోట్లు 86 లక్షలు ప్రత్యేకించి, ఎంత మొత్తము వినియోగింపగలరో దురూహ్యము. ఆర్థికాభ్యున్నతి కార్యక్రమమిట్లు సాగిన ప్రజాక్షేమాభివృద్ధి జరుగుట అసంభవము.

వ్యవసాయాభివృద్ధి ప్రణాళికలు

భూమిపన్ను మన రాష్ట్రములో ఎప్పుడును దాదాపు రూ. 8 కోట్లు వసూలగును. ఈ సంగతటుంచి, వ్యవసాయాభివృద్ధిజరుపుటకు ఏర్పాటు చేయబడిన ప్రణాళికలు, వాని ఆచరణ ఎంత చురుకుగా జరుగుచున్నదో పరిశీలింతము.

'అధికాహారోత్పత్తి' ఉద్యమము ప్రకారం మన రాష్ట్రములో 1951-52 సం. వచ్చు సరికి ఇప్పటికన్న 6½ లక్షల టన్నుల బియ్యము అధికోత్పత్తి చేయవలెనని నిర్ణయింప బడినది. ఈ ప్రణాళిక ప్రకారం రైతులకు విత్తనములు, ఎరువు, ఇతర పరికరములు సరఫరా చేయుట, తెగుళ్ళకు మందులు పంచిపెట్టుట, వ్యవసాయ కళాశాలలో చదువు విద్యార్థుల సంఖ్య నభివృద్ధి చేసి, వ్యవసాయశాఖ ఉద్యోగుల సంఖ్యను వృద్ధి చేయుట మొదలగు పనులు జరుగును. విద్యుచ్ఛక్తితో నీరు తోడుకొనుట, మోట తోలుట, బావులు త్రవ్వుట మొదలగు విషయములలో రైతులకు సాయము చేయుటకు వ్యవసాయ శాఖవారు పూనుకొనిరి. రైతులకు అద్దెకు యిచ్చుటకు ట్రాక్టర్లు, పంపు సెట్లు వ్యవసాయ శాఖ కొనును. వీటన్నింటికి ఖర్చు సుమారు రూ.6 కోట్లగుచున్నది. పెట్టుబడి రూ. 3 కోట్లయినది. ఇంత పెద్ద మొత్తమును పైన వివరించిన కార్యములకు వినియోగించుట దుర్వినియోగమే వని చెప్పవలెను. వీనిలో ఏ ఒకటి కూడా సామాన్య రైతునకు అందుబాటులో లేదు. వీనివలన అహారోత్పత్తికి ఒక్క అదనపు ఎకరము భూమికూడ వినియోగింప బడుటలేదు. ఇంత పెద్ద మొత్తమును ఈ విధముగా వృథాచేయక మైనర్ ఇర్రిగేషనుకు, ఇతర చిన్న చిన్న ప్రాజెక్టులకు వినియోగించుచుండిన ఈ పాటికి మన రాష్ట్రములో కొన్ని వేల ఎకరములు సాగుబడిలోనికి వచ్చి, అధికాహారోత్పత్తి జరుగుచుండెడిది.

బావులు త్రవ్వించు ప్రణాళిక ప్రకారం, క్రొత్తగా త్రవ్వు బావులకు ప్రభుత్వము ఉచిత సహాయము చేయును. అందుకొరకు రూ. 160 లక్షలు ప్రత్యేకింపబడివున్నవి. ఈ మొత్తము ఎన్నిబావులు త్రవ్వుటకు గ్రాంటుగా యివ్వబడినదో తెలియదు. ఒక్కొక్క బావికి ప్రభుత్వము రూ. 500 లు గ్రాంటు యిచ్చినను, ఈ మొత్తముతో 32 వేలకుపైగా క్రొత్త బావులు త్రవ్వబడియుండవలెను. కాని అట్టిది జరుగలేదు. ఈ వ్యయముకూడా చాలవరకు ఫలప్రదముగా జరుగ లేదని చెప్పవలెను.

యుద్ధానంతర ఆర్థికాభివృద్ధికి 1947-48 సం.లో రూ. 12 కోట్ల 81 లక్షలు ప్రత్యేకింపబడినవి. కాని అవుసరమైన యంత్రసామగ్రి వగైరా దొరకకపోవుటవలన మొత్తము రూ. 8 కోట్ల 61 లక్షలు మాత్రమే ఖర్చు చేయబడినది. 1948-49 వ సం.లో ఇందుకొరకు రూ. 4 కోట్ల 83 లక్షలు మాత్రమే ప్రత్యేకింపబడినది.

1947-48 సం.లో మద్యనిషేధమువలన ఆదాయము రూ. 414 లక్షలు తగ్గిపోయినది. కాని అమ్మకపుపన్ను, వినోదాలపన్ను, గుర్రపుపందెములపన్ను 1948 వ సం. జనవరి 1 వ తేదీనుండి వృద్ధిచేయుటచే ఈ లోటు చాలవరకు భర్తీ అయినది. 1948-49 వ సం.లో మద్యనిషేధము పూర్తిగా అములుజరుపబడుటవలన తగ్గిపోవు రూ. 17 కోట్ల ఆదాయము, ఈ మూడుపన్నుల వలన చాలవరకు భర్తీ అగును.

గ్రామాభ్యున్నతికి, ఖాదీ అభివృద్ధికి, కుటీర పరిశ్రమాభివృద్ధికి శ్రీ ప్రకాశంగారు ప్రత్యేక శ్రద్ధ వహించి ఎక్కువ మొత్తములను వినియోగింపదలచిన సంగతి మనకు తెలియును. కాని ఈ విషయములలో అప్పు డాశించినంత చురుకుగా పని జరుగుటలేదు. హరిజనాభ్యుదయమునకు ప్రత్యేక గ్రామములను నిర్మించు ఏర్పాట్లు ఇంకను జరుగనే లేదు. ఈవిధముగా గ్రామాభ్యున్నతి కార్యక్రమము చాలవరకు అడుగునపడిపోయి, అందు కొరకై ప్రత్యేకించిన సొమ్ము కొంతవరకు మిగిలిపోయినది. రానున్న సంవత్సరములోనైన వీనిని గురించి ప్రత్యేక శ్రద్ధ వహించి కార్యక్రమము చురుకుగా నడిపింతురను ఆశకుకూడ అవకాశము కనిపించుటలేదు.

1948-49 వ సం॥లో జరుపవలెనని అంచనా వేస్తున్న ఇతర అభివృద్ధి కార్యక్రమమును గురించి విచారింతము. మైనర్ ఇర్రిగేషనుకు 1947-48 వ సంలో రూ. 17 లక్షలు మాత్రమే ప్రత్యేకింపబడెను. కాని 1948-49 సం॥లో రూ. 37 లక్షలు ఇందుకు వినియోగింపవలెనని నిశ్చయింపబడినది. వాస్తవమునకు, ఎక్కువ భూములు వెంటనే సాగుబడిలోనికి రావలెనన్న కాలువలు బాగుచేయుట, క్రొత్తకాలువలు త్రవ్వించుట, చెరువులు బాగుచేయించుట, బావులు త్రవ్వించుట మొదలగునవి విరివిగా జరుగవలెను. ఇందుకొరకు రూ. 37 లక్షలు వినియోగించిన ఏమాత్రము పని సాధించగలము? ప్రచారమునకు, విత్తనములకు వినియోగింపదలచుకున్న ధనము ఇటివంటి నిర్మాణాత్మక కార్యక్రమములకు వినియోగించిన ఫలప్రదములగును. చెరువుల మరమ్మతుకు ఖర్చు ప్రభుత్వమే భరించవలెనను సూత్రము ఆమోదించి, నామమాత్రపు గ్రాంటు ప్రత్యేకింపబడినది. ఆచరణలో ఈ కార్యమైనను చురుకుగా జరుగునని ఆశించెదము.

పల్లెలకు పట్టణములకు మంచినీరు తగినంతగా సరఫరా చేయుటకు కొంత మొత్తము ప్రత్యేకింపబడినది. 10 వేల జనాభాగల మ్యునిసిపాలిటీలన్నిటికి, 5 వేల జనాభాగల గ్రామములన్నిటికి మంచినీరు కొరకు సౌకర్యము, మురుగునీరు పోవు సౌకర్యములు 5 ఏండ్లలోగా కల్పించవలెనని ప్రభుత్వము చాల ఏండ్ల క్రితమే నిర్ణయించినది. అందుకొరకు 1947-48 సం. బడ్జెట్‌లో 1 కోటి ప్రత్యేకింపబడినది. ప్రతి సంవత్సరము రూ. 15 లక్షలు ఇందుకు ప్రత్యేకించి వుంచి, వినియోగించవలెనని నిర్ణయింపబడినది. ఈ కార్యక్రమము త్వరలోనే ప్రారంభము యచేగలరని ఆశించుచున్నాము.

1948-49 వ సం. లో జరుపవలెనని అంచనా వేస్తున్న ఖర్చులలో వ్యవసాయాభ్యున్నతికి ముఖ్యమైన తుంగభద్ర, రామపాదసాగర, కృష్ణా-పెన్నారు ప్రాజెక్టులు. తుంగభద్రా ప్రాజెక్టు కొరకు రానున్న సంవత్సరములో రూ. 290 లక్షలు ఖర్చు చేయవలెనని అంచనావేశారు. రామపాదసాగరమును గూర్చి పరిశోధనలు జరుపుటకు రూ. 2 లక్షలు, పని ప్రారంభించుటకు అవకాశమిచ్చుటకు వంద రూపాయల నామమాత్రపు గ్రాంటు, కృష్ణా-పెన్నార్ ప్రాజెక్టు పరిశోధనకు మరొక గ్రాంటు మంజూరుచేయవలసిన దని కోరబడినవి. ఇవిగాక దిగువభవానీ ప్రాజెక్టుకు రూ. 30 లక్షలు, రొంపేరు మురుగుస్కీముకు రూ. 20 లక్షలు, పెదలంక మురుగుస్కీముకు రూ. 4 లక్షలు, కావేరిడెల్టా అభివృద్ధికి రూ. 7 లక్షలు ప్రత్యేకింపబడినవి. 'అధికాహారోత్పత్తి' ఉద్యమము ప్రకారం రూ. 70 లక్షలు ఇతర సాగుబడి స్కీములకు ఖర్చు చేయబడును. ఇప్పుడు అంచనా వేసిన ఈ పనులన్నియు, ఏదోఒకమిషపై ఆగిపోకుండా, రానున్న సంవత్సరములో పనిప్రారంభమగుచో, ఈ సంవత్సరము జరిగిన ఆలస్యమును చాలవరకు పూడ్చుకొనవచ్చును.

పరిశ్రమాభివృద్ధికి దోహదము చేయుటకు పారిశ్రామిక ధన సహాయసంస్థ నొకదానిని స్థాపించుచు ఈమధ్యనే కేంద్రప్రభుత్వము ఒక శాసనము చేసినది. అట్టి సంస్థయే ఒకటి ఈ రాష్ట్రములో కూడ స్థాపించవలెనని గత సంవత్సరము శ్రీ ప్రకాశంపంతులు తలపెట్టి, రూ. 51 లక్షలు అందుకు ప్రత్యేకించినాడు. కాని పని అప్పుడేమియు జరగలేదు. రానున్న సంవత్సరము ఈ సంస్థ ప్రారంభింపబడునని మంత్రిగారన్నారు.

విద్య, వైద్యము

బేసిక విద్యావిధానమును ప్రోత్సహించుట, నిర్బంధముగా ప్రాథమికవిద్య గరపుట, ఉన్నత పాఠశాలల ప్రతితాలూకాకు ఒకటి చొప్పున నైన స్థాపించుట, ప్రతిజిల్లా కొక కళాశాలయైన యుండునట్లు ఏర్పాటుచేయుట మొదలగునవి ప్రభుత్వ మనుసరించుచున్న విధానము యొక్క ముఖ్యసూత్రములు. బేసిక విద్యావిధానమును ప్రోత్సహించుటకు రూ. 11½ లక్షలు, నిర్బంధ ప్రాథమిక విద్యావ్యాప్తికి గ్రాంట్లకు రూ. 59 లక్షలు, తెలుగు, తమిళభాషలలో విజ్ఞాన సర్వస్వములను వ్రాయించుటకు మూగ, గ్రుడ్డి పిల్లలకు చదువు చెప్పించుటకు మొదలగు కార్యములకు ముందు సంవత్సరము ఖర్చుచేయుటకు బడ్జెట్‌లో అవకాశ మేర్పరచబడినది.

1947-48 సం.లో కొన్ని క్రొత్త వైద్యశాలలు కట్టవలెనని ఆలోచింపబడినదిగాని సామాను కరువుగానుండుటచే ఆ ప్రయత్నములు సాగలేదు. ఇందుకొరకు మొత్తం రూ. 35 లక్షలు రానున్న సంవత్సరం ఖర్చు చేయవలెనని నిర్ణయింపబడినది.

నూతన సంవత్సరములో రోడ్ల అభివృద్ధికి రూ. 522 లక్షలు వినియోగించవలెనని అంచనా వేశారు. ఇందులో రూ. 111 లక్షలు కేంద్ర ప్రభుత్వమునద్దనుండి రాబట్టుకొందురు. స్థానిక సంస్థలు క్రొత్తరోడ్ల నిర్మాణమునకు పూనుకొనుటకు రూ. 31½ లక్షలు వానికి సహాయము చేయవలెననికూడ నిర్ణయింపబడినది.

రేషనింగ్, కంట్రోలు తొలగించుటతో ప్రభుత్వ వ్యాపారముకూడ తగ్గినది. 1948-49 సం లో ఆహారసబ్సిడీలతో సహా, అందుకొరకు రూ. 404 లక్షలుమాత్రము వినియోగింపదలచుచున్నారు. కంట్రోల్ తొలగించుటవలన సివిల్ సప్లయిస్ ఆఫీసులు మూసివేయుటవలన రూ. 1 కోటి ఆదా అగును. ప్రభుత్వకార్యస్థానములలో సిబ్బంది తగ్గించుటవలన ఒక కోటి రూపాయలు ఆదా అగునని అంచనా వేయబడుచున్నది. కాని ప్రభుత్వోద్యోగులకు జీతములు పెంచుటచే ఖర్చు చాల ఎక్కువ పెరుగును.

1948-49 వ సం. బడ్జెట్ మొత్తముమీద రాష్ట్ర ఆర్థికపరిస్థితి చక్కగానే యున్నదని స్పష్టపరుచుచున్నది. కాని గ్రామాభ్యున్నతికిగాని, పరిశ్రమాభివృద్ధికిగాని ఈ సంవత్సరములో జరుపదలచుకొన్నంత పని జరుపలేకపోవుట, రానున్న సంవత్సరము జరుపవలెనని అంచనా వేసిన కార్యక్రమము బహుస్వల్పమగుట, అభివృద్ధికాముకులకు నిరుత్సాహమును కలిగించకమానదు.

గాజు పరిశ్రమ 3:

గాజు తయారీ

శ్రీ వి. కృష్ణమూర్తి

నేటి యంత్రయుగపు వాతావరణంలో ఎన్నో రకాల గాజూ, గాజు పరికరాలూ తయారౌతున్నాయి. గాజు తయారీని గురించి కొన్ని విషయాలు క్రింద పొందుపఱచాను. నేటి శాస్త్రజ్ఞులతో "ఈ స్వాభావికాలు గల గాజు నాకు కావాలి" అని ఏ ఎంజినీరు అయినా అంటే, అలాంటి గాజును తయారు చేసి యివ్వగలరు. కోరిన సాంద్రత (density) కోరిన ప్రతిఫలన కారణాంకము (reflection factor), కోరిన వక్రీభవనగుణకము (refractive index), కోరిన యుత్సారశక్తి (dispersive power), కోరిన యుష్ణతావ్యాకోచము (thermal expansion), కోరినంతయుష్ణ ప్రసరణము (thermal-conductivity), కోరుకున్న తలజిగి (surface tension), రాసాయనికఅశ్వరత (Chemical-durability) గల గాజు తయారుచేయగలరు.

గాజు తయారీని గురించి ఒక కట్టుకథ వుంది. ప్రస్తుతం సిరియాదేశంలో భాగంగా పూర్వకాలంలో ఫోనిస్ (Phoenice) అని ఒక దేశం ఉండేది. విశాల సముద్రాల మీద వ్యాపారాలు జరుపుతూ వుండే వారు ఆ ఫోనీషియనులు. వారు మామూలుగా ప్రయాణం చేస్తూ ఒకసారి వారి పడవను తీరానికి లాగి వంట ప్రయత్నం ప్రారంభించుట కుద్యుక్తులైనారు. అది ఇసుక ప్రదేశం కావటంవల్ల పొయ్యిచెయ్యడానికి మూడు గట్టిరాళ్ళు గూడా దొరకలేదు. వారి వ్యాపారవస్తుసమూహంలో ఉప్పురాళ్ళు (నేలలోత్రవ్వితీసినవి) సాల్టుపీటర్ రాళ్ళు (సూరేకారం) ఉండినాయి. వాటిలో కొంచెం స్థూలమైనవాటిని పైటకు తెచ్చి, యిసకలో పెట్టుకుని వంట ప్రారంభించారు. వారి పాత్రలన్నీ మృణ్మయ పాత్రలే. పొయ్యిమీద పెట్టేటందు కొంచెం సున్నం కుండలకు అడుగున దళసరిగా పట్టించేవారు. వంట అయి భోజనాలు చేసుకుని వాళ్ళ రాళ్ళు మళ్ళీ వాళ్ళు తీసుకెళ్ళదామని పొయిలో చూచేటప్పటికి ఇసక అంతా గడ్డకట్టి వుంది. ఆ గడ్డను కడిగి చూచటప్పటికి, అది చాలా కొత్త వస్తువని వీరికి తోచింది. పుట్టుకనుంచి జాణతనం ఉగ్గుపాలతో నేర్చుకున్నవారు, వ్యాపారంలో తరతరాలగా అనుభవంగలవారూ కాబట్టే యేదో గొప్పవస్తువును కనుక్కున్నామని వారు నిశ్చయించుకున్నారు. అప్పుడు తయారైనది ఒకగాజు గడ్డ. ఇసక, సోడా, సున్నం, వేడి కలిసేటప్పటికి గాజు తయారైంది. ఇది నిజమో కాదో గాని నమ్మదగిన పరిస్థితులు కాబట్టి నమ్మవచ్చునేమో.

ఒక ఆటంబాంబు పరీక్షకై మెక్సికోలో ఎడారిలో దాన్ని వేస్తే ఆ యిసకలో ఆరంగుళాల దళసరి గాజు తయారైంది.

గాజు తయారుచేయడానికి నాలుగు రకాల వస్తువులు కలిపి సుమారు వేయి డిగ్రీలకు (సెంటిగ్రేడు) హెచ్చయిన ఉష్ణతలో కరిగించుతారు. ఈ కరగడానికి కొన్నిచోట్ల అందుకుగాను ప్రత్యేకంగా తయారైన కుండలు వాడుతారు. కొన్నిచోట్ల పెద్ద తొట్లలో కరిగిస్తారు. మనదేశంలో సాధారణంగా ఎనిమిది వందల పౌనుల గాజును కరిగే కుండలు వాడుతారు. ఒక పెద్దపొయ్యిలో—ఫర్నేసులో—ఆరు మొదలు పన్నెండు కుండలు ఒకేసారి ఉపయోగిస్తారు. తొట్లప్రమాణం ఉపయోగాన్నిబట్టి వుంటుంది. 'నిరంతర తొట్టి' (Continuous tank) లో కరిగిన గాజు తొట్టిలోంచి ఒక పక్కనుంచి తీసేస్తుంటే, ఇంకోపక్కన గాజు ఆ తొట్టిలోనే కరగబడుతూ ఉంటుంది. "పగలు తొట్టి" (Day tank)లో రాత్రి గాజు కరుగుతారు; పగలు ఆ గాజు ఖర్చు అవుతుంది. ఈ విధానాలన్నీ మున్ముందు చర్చించుదాము.

గాజు తయారీకి కావలసిన నాలుగు రకాల సరుకుల్లో మొదటిది: సిలికా; రెండవరకం: క్షారిత భస్మాలు (Basic oxides); మూడవ రకం: ఆమ్లభస్మాలు (Acidic oxides); నాల్గవ రకం: తక్కిన యితర సామానులు. గాజు తయారీలో చేరే ముడిపదార్థము లన్నిటిని వాటి భస్మముల (Oxides) విలువయే గుర్తింపబడును.

సిలికా

ఇది రసాయన రీత్యా సిలికాన్ డై ఆక్సైడ్. గాజు అనుపేరుతో పిలువబడే అన్ని రకాల వస్తువులలో కొద్దో గొప్పో యిది ఉంటుంది. సాధారణంగా ఇసుక వాడుతారు సిలికాకు ముడిపదార్థంగా. ఇసుకను జల్లించడం శుభ్రపఱచడం ముందు ముందు వివరంగా చర్చించుదాము. చెకుముకి రాళ్ళు వాడితే పరిశుభ్రమైన సిలికా వాడినట్లు.

క్షార భస్మాలు

సోడియం భస్మానికిగాను సోడియం సల్ఫేటు (గంధకిదం)సాల్టుకేక్ అంటారు వ్యాపారంలో, సోడియం కార్బనేటు (కర్బనకిదం) సోడా ఆష్ అంటారు వ్యాపారంలో—వాడుతారు. పోటాసియం భస్మానికి ఆధారం సురేకరం నైటర్ వాడతారు. లేదా ఫెల్ స్పారులు (భూస్ఫటికాలు)వాడుతారు. సోడియం,యిచ్చే ఫెల్ స్పారులను ఆల్‌బైటు అంటారు, పొటాసియం యిచ్చే ఫెల్‌స్పారులను ఆర్థోక్లేస్ అంటారు. కాల్సియం భస్మానికి వాడే ముడిదినుసులు సున్నం, సున్నపురాళ్ళు. ఫెల్స్పారులు నల్యూమినం భస్మం గూడా యిస్తారు. బేరియం, సీసం గెడోలినియం, మగ్నీసియం సాధారణంగా వాడబడే క్షారభస్మాలు.

ఆమ్ల భస్మాలు

బోరాన్, (టంకం) భస్మం కోసం, బోరాక్స్, (వెలిగారం) వాడుతారు. తగరం ఫాస్ఫరం, ఆర్సెనికు, తెంగణికు, గంధకిద భస్మం సాధారణంగా వాడుతూవుంటారు. ఈ ఆమ్ల భస్మాలు గాజుతయారీకి కావలసిన ఆమ్లత్వవాతావరణము నిచ్చుటకు వాడుదురు.

గాజు తయారీలో వాడబడే మిగతా వస్తువులను నాలుగు రకాలుగా విభజించ వచ్చును:—(i) ప్రాణవాయువు నిచ్చేవి, (ii) సునిశిత పఱచేవి. (iii) రంగుల నిచ్చేవి, (iv) తక్కిన మార్పుల నిచ్చేవి.

(i) ప్రాణవాయువు నిచ్చే వస్తువులలో మంగనీసు డై ఆక్సైడ్, పొటాసియం డైక్రోమేట్, పొటాసియం క్రోమేట్, పొటాసియం నైట్రేట్ ఇత్యాదులు.

(ii) సునిశిత పరచడం అనేది శాస్త్ర పరిభాషలో ముక్క. గాజుతయారీలో ముడి దినుసులను కరగించే వుష్ణతలో ముడిదినుసులు కరిగిన సమయంలో బుడగలు లోపలినుంచి పైకి వస్తాయి. అంటే ఏవో కొన్ని వాయువులు వెలికి వస్తున్నాయి అన్నమాట. ఆ వాయువులతో గాలి గూడ వుంది. ఇవి పూర్తిగా బైటకు రాకపోతే తయారైన గాజులో బుడగలు కనబడుతూ వుంటాయి. అవి చూస్తూవుంటే అసహ్యంగా వుంటాయి. ఆ ప్రదేశాల్లో గాజు బలహీనంగా వుంటుంది. తయారైన గాజు స్వభావాలలోనే తేడా వుంటుంది. ఆ బుడగలు పోగొట్టేందుకు వేసే వస్తువులను సునిశితపఱచే సామగ్రి (Fining Agent) అంటారు. సాధారణంగా ఆర్సెనిక్ భస్మం వాడుతారు. ఇంగ్లండులో "ఉర్లగడ్డ గమ్మత్తు" చేస్తారు. ఒక యినప కడ్డీ చివర బంగాళదుంపను గ్రుచ్చి కరుగుతూ వున్న గాజులోకి బలంగా పొడుస్తారు. చాలా చప్పుడుతో బంగాళాదుంప పేలి చాలా వాయువులు పుట్టి లోపలివాయువులను, గాలిని బైటకు నెట్టేస్తాయి.

(iii) రంగునిచ్చేవి: మనం చాల రకాల రంగులుగల గాజులను చూస్తున్నాము. ఆ రంగులు పొరబాటున వచ్చినవి కావు. బహు శ్రద్ధతో అతిజాగ్రతతో అనుభవంగల నిపుణులు తయారుచేయాల్సిన సున్నితమైన విద్య ఈ రంగులు పొదగడం. సాధారణంగా వాడే రసాయన లవణాలు క్రింద పొందుపఱచబడినాయి.

కాడ్మియమ్ సల్ఫైడ్	...	బంగారంరంగు
సెలనియమ్‌తో ...	...	ఎరుపు
తామ్రభస్మం, తామ్రగంధకిదం	...	నీలం-(సముద్రం) ఆక్వామరైన్ బ్లూ
కోబాల్టు భస్మం ...	...	నీలం-ఆకాశంరంగు
పొటాసియం డైక్రోమేట్	...	నిమ్మరంగు-లెమన్ గ్రీన్
మ్యాంగనీస్ భస్మం ...	...	లేమావి చిగురురంగు
గంధకం ...	...	కాషాయం, పసుపు మిశ్రమం
బొగ్గు ...	...	కాషాయం
సీరియం నైట్రేట్ ...	...	లేతకాషాయం, ఊదామిశ్రమం
క్రోమిక్ ఆక్సైడ్ ...	...	ఆకుపచ్చ
(ఫెర్రిక్) ఇనపభస్మం ...	...	పసుపు
(ఫెర్రస్) ఇనపభస్మం ...	...	ముదురు ఆకుపచ్చ
తుప్పు, బొగ్గు ...	...	లేతనీలం
నికెల్ సల్ఫేట్ ...	...	కాఫీరంగు
కోబాల్టు, నికెల్ ...	...	బూడిదరంగు న్యూట్రల్ గ్రే
ప్రెసోడిమియమ్ ...	...	పాచిరంగు-ఆకుపచ్చ పసుపుమిశ్రం
నియోడిమియమ్ ...	...	బచ్చలిపండురంగు, లిలాక్ (lilac)
యురేనియం ...	...	మెరిసే పసుపు
టిటానియం ...	...	అందమైన ఊదా

సాధారణంగా కోరే రంగు లివి. వీనిలో వెయ్యింట ఒకభాగంమార్చి రంగులలో తేడా చూపించగలరు నిపుణులు. ముడిసరకుల మొత్తం తూకంలో వేయింట మూడు, నాల్గుభాగములు మాత్రమే రంగునిచ్చే రసాయనాలు. అందులో కోరిన రంగులను తెప్పించగలరు నిపుణులు.

రంగులేకుండా గాజులకు తళతళ వచ్చేటట్లు చేస్తారు. మెరుస్తాయి గాజులు. ఈగాజులు చాలా వేడిగావుండగానే, వాటిమీద ఫెర్రిక్ క్లోరైడ్‌ను చిలకరిస్తారు. ఈప్రకాశం రావడానికి సిల్వర్ నైట్రేట్ చిలకరిస్తారు.

(iv) తక్కిన మార్పుల నిచ్చేవి చాలా రకా లున్నాయి.

(౧) ఓపాల్ గ్లాస్ చేయుట:—గ్లాసుకు ఒక విధమైన పాలరంగు పూతవస్తుంది. కొన్ని ఎలెక్ట్రిక్ బల్బులు ఓపాల్ గ్లాస్‌తో వుంటాయి. కొందరు పిల్లలకు పూసలు, లోలాకులు ఓపాల్ గ్లాసుతో చేస్తారు. కొన్ని ఆటవస్తువులు ఓపాల్ గ్లాసుతో తయారౌతూ వుంటాయి. సాధారణంగా ఓపాల్ చెయ్యడానికి ఫ్లోరిన్ వాయువును వాడుతారు. ఈవాయువు గాజులో చేర్చడానికై సాపరాయిని అంటే ఫ్లోర్‌స్పార్‌ను (కేల్సియమ్ ఫ్లోరైడు) గాని క్రయొలైట్‌ను (సోడియం, అల్యూమినమ్, ఫ్లోరైడు) గాని సోడియమ్ ఫ్లోరైడునుగాని గాజును తయారు చేసేటప్పుడే ముడిసరుకులతోపాటు కలిపి కరిగిస్తారు. ఇది ఒకరకం. ఇంకోరకం తయారీలో గాజును చేసే ముడి సరుకులతోపాటు కాల్సియమ్ ఫాస్ఫేటు (కాల్చిన ఎముకలపొడి)ను కలిపి కరిగిస్తారు. ఫ్లోరైడ్ ఓపాల్ ఎక్కువ వుష్ణత అక్కరలేకుండా తయారౌతుంది. కాని భాస్వరపు ఓపాల్ చాలా పటుత్వమైనది. ఆర్సెనిక్ భస్మం, తగర భస్మంకూడా వాడుట కద్దు. ఓపాల్ గాజు ఆభరణాల్లో వాడుక ఎక్కువ.

(iv-౨) కల్చర్ వజ్రాలు, కెమికల్ డైమండ్సు, ముత్యం రాళ్లు, ఆర్టిఫిషియల్ జెమ్స్ అని వ్యవహరింపబడే తళుకు రాళ్లు.

ఇవన్నీ గాజుతో తయారైన వస్తువులు. గాజు తయారీలో రాగి, వెండి, బంగారు, సెలీనియమ్‌లతో కలసి సాధారణంగా తయారు చేస్తారు.

అన్నిటిలోను రాగితో చేసే రూబీలు చాకచక్యంగా చేయాలి. ఈటి తయారీ కష్టం. చాల శ్రద్ధగా చేయాలి. లేకపోతే అనుకున్న రంగులు రావు. రాళ్ళుగూడా చూడడానికి డాబుగాను ప్రకాశవంతంగాను ఉండవు—తయారుచేసే వాతావరణంలో ప్రాణవాయువు ఉండగూడదు. అంటే రెడ్యూసింగ్ పరిస్థితు లుండాలి. ఏ మాత్రం ఆమ్ల జనీకరణ వాయువులు వున్నా బురద బురదగా ఉండే ఆకుపచ్చరంగు పాచిరంగు ఏర్పడటంకద్దు. గాజు చాలా వేడిగా సునిశితంగా ఉన్నప్పుడు రాగిని తామ్ర భస్మంగా వాడుతారు. వేడి గాజును ఉన్నట్లుండి చల్లార్చుతారు. అప్పుడు ఆగాజుకు రంగు ఉండదు. కాని దానిని ఒక ఊదుడు గొట్టాంతో (బ్లోపైపు)తో పునః కరిగించి ఊదితే అసలు రంగులు బైటపడతాయి. బాగా తయారైనప్పుడు రాగిరూబీలు చాలా మెరుస్తూవుంటాయి. కొందరు యీ తామ్రరూబీని పల్చని పేలికగా తీసి రంగులేని గాజుమీద తొడుగుతారు. అప్పుడు చాలా అహ్లాదకరంగా వుంటాయి రంగులు. మంచి రాగి రూబీ చేతకై వాడాల్సిన తామ్రభస్మం యెంత వాడాలో అన్న విషయం అనుభవంమీద తేల్చుకోవాల్సినది. ఏమాత్రం తేడాయున్నా రూబీలో తేడా వస్తుంది.

బంగారానికి సాధారణంగా దాని హరిదాన్ని వాడుతారు (గోల్డు క్లోరైడ్) దీని తయారీ అంత కష్టంకాదు. బంగారు రూబీ ఏవాతావరణంలోనైనా తయారౌతుంది. బంగారు రాళ్ళు రాగిరాళ్ళు చేసేటప్పుడు ఆగాజులో కొంత తగర భస్మం ఉంటే తయారీలో అంత కష్టం వుండదు. బంగారం రూబీరాళ్ళుగా కోసి అరగదీసి పాలిష్ పెట్టెయ్యవచ్చు. నీలంరంగుకు బచ్చలిపండు రంగుకుమధ్య ఏ రంగుతైన రాగి రూబీకు యివ్వవచ్చు. సెలీనియం రూబీలు చేయడానికి సెలీనియం ధాతువే వాడుతారు. భస్మం వాడి లాభంలేదు. అతి సున్నితమైన బొగ్గునుసితో తయారైనప్పుడు రూబీకు పసుపుకు కాషాయ రంగుకు మధ్య రంగులు తెప్పించవచ్చును. తళుకురాళ్ళనే పేరే వాడినా సాధారణంగా రంగులగాజులనే కోసి అరగదీసి పాలిష్ పెట్టితే ఆ గాజుముక్కలుగూడా మెరుగువల్ల చాల ధరలకు అమ్ముడుపోతున్నాయి. రూబీలకు మెరుగు నిలుస్తుంది. గాజుపలకకు సులభంగా పోతుంది.

(౩) గాజు మీద అక్షరాలుగాని బొమ్మలుగాని చెక్కడం-ఎచ్చింగ్. కావాలిసిన ఆకారాన్ని పెనసలుతో గాజుపలకమీద ముందు వ్రాసి ప్యారఫిన్ వ్యాక్సును కరిగించి గాజుమీద పోస్తారు. పెనసలుగీతమీద కంతాణీతో గోకి ఆ వ్యాక్సును (మైనాన్ని) తీసేస్తారు తర్వాత యీ గాజుపలకను ఒక పెద్ద పళ్ళెంలో వేస్తారు. ఆ పళ్లెం లోతట్టున ఆ మైనాన్నే పూసి దాంట్లో హైడ్రోఫ్లోరిక్ ఆసిడ్ (ఉదజ ప్లవకామ్లము) వేసియుంచుతారు. ఆ ప్లవకం శక్తి గాజును తినడం. కాబట్టి గాజును ఎంతసేపు ఆ ఆమ్లంలో వుంచితే అంతగాజు పోతుంది. ఆ తర్వాత గాజు కడిగి కొంచెం వెచ్చజేస్తే మైనం కరిగిపోతుంది. దాన్ని శుభ్రపఱచి వాడుతారు.

(౪) కొన్ని గాజుపలకలను అరగదీసి ఇటునుంచి అటు కనబడకుండా జేస్తారు. కొన్నిటికి కొన్నిప్రదేశాల్లో మాత్రమే అరగదీసి తద్వారా బొమ్మలు చూపిస్తారు. ఈ అరగదీయడం ఇసకతోగాని, ఎమరీపొడితోగాని కర్బొరండంపొడితోగాని చెయ్యవచ్చు.

కొన్నిటిని అరగ దీయక్కరలేకుండా స్ప్రేయింగ్ గన్నుతో బాగా ఒత్తిడితో ధారగా ఇసకను చిమ్ముతారు గాజు పలకలమీదికి. దాంతో అరగదీసిన ట్లయిపోతుంది. చాలా మంది సీసాలకు పేరు అల్లాగే చేసి అమ్ముతారు.

గాజు చేసేటప్పుడు విశాలమైన యినప తీగె జల్లెడను గాజు పలకల మధ్యలోకి దూర్చుతారు. దాంతో గాజుపలకలకు మంచి బలం వస్తుంది. దీన్ని రీ-ఇన్‌ఫోర్సుడు గాజు అంటారు.

గాజు తయారు చేసేటప్పుడు, గాజు వస్తువులు తయారయ్యేప్పుడు, కరిగి పోతపోయబడ్డ గాజును చల్లార్చడం చాలాశ్రద్ధగా చెయ్యాల్సిన

(20వ పేజీ చూడుడు)

"భగవద్గీతా చిత్రం-గాంధీ దివ్యచరిత్రం"

శ్రీ వేలాల సుబ్బారావు

మహాకవి కాళిదాసు కుమారసంభవంలో పార్వతీదేవి కంఠాన్నీ, అందలి ముత్యాల హారాన్నీ వర్ణిస్తూ దేవి కంఠానికి హారం భూషణమా, లేక హారానికి కంఠం భూషణమా అని తర్కిస్తూ, రెండూ శోభాజనకాలుగా ఉండి ఒకదానికొకటి భూషణముగా ఉన్నదంటాడు. అట్లే గాంధీమహాత్ముని జీవితచరిత్రం, భగవద్గీతా పఠిస్తూ ఉంటే పరస్పరం లక్ష్యలక్షణ భావాలను స్ఫురింపచేస్తాయి పఠితమనస్సులో— గీతలక్షణం ఆయన జీవితం లక్ష్యమా, లేక తద్వ్యతిరేకమా యని. కాని గీత పూర్వకాలీనమవడంచేత అదే లక్షణం, ఆయన జీవితం లక్ష్యమని స్థిరపరచుకోవాలి.

18 దవ అధ్యాయంలో సత్వరజస్తమోగుణాలనూ, వాటి లక్షణాలనూ వివరించి చెబుతూ—

"ముక్తసంగోఽనహంవాదీ
ధృత్యుత్సాహసమన్వితః,
సిద్ధ్యసిద్ధ్యోర్నిర్వికారః
కర్తాసాత్విక ఉచ్యతే."

సంఘంమధ్య నుండి నిరంతరం కార్యాసక్తుడై ఉన్నప్పటికీ నిజానికి గాంధీజీ ముక్తసంగుడే. ఈ విషయం ఇప్పుడే విశదపరుస్తాను. అహంకారరహితుడనడానికి వీరిజీవితంలో అనేకనిదర్శనాలున్నై. ఆహారవిషయంలో ఆయన అవలంబించిన కఠిననియమాలవలననైతేనేమి, పెక్కుసారులు చేసిన ఉపవాసాలవల్లనైతేనేమి శరీరం శుష్కించి చర్మశల్యావశిష్టుడైనప్పటికీ దుస్సాధ్యములైన కార్యములను నెత్తిన వేసికొని చివరిక్షణంవరకు సాగిపోతూవుండటం ధృతి, ఉత్సాహాలవల్ల కాకపోతే మరి ఏ కారణంవల్ల? ఇక కార్యం ఫలించినా, ఫలింపకపోయినా నిర్వికారుడై సమచిత్తత్వం గలిగివుండటంలో ముందు వీరినిచెప్పి తరువాతనే ఇంకొకరిని చెప్పవలసివచ్చుననుట లోకవిదితమే! సాత్వికలక్షణ సంపన్నుని వర్ణించడానికి చెప్పిన ఈ శ్లోకార్థానికి గాంధీజీ ఎంత బాగా అతికిపోతాడో చూడండి.

అర్జునుడొక సందర్భంలో జ్ఞానమనగా నెట్టిది? అజ్ఞానమనగా నేమి? అని అడిగినప్పుడు శ్రీకృష్ణుడు—

"అమానిత్వం, అదంభిత్వం,
అహింసా, క్షాంతి, రార్జవం,
ఆచార్యోపాసనం, శౌచం, స్థైర్య
మాత్మవినిగ్రహః.
"ఇంద్రియార్థేషు వైరాగ్యం,
అనహంకారఏవచ,
జన్మ మృత్యు జరా వ్యాధి
దుఃఖదోషానుదర్శనం.
"అసక్తి, రనభిష్వంగః
పుత్రదార గృహాదిషు
నిత్యంచ సమచిత్తత్వం
ఇష్టానిష్టోపపత్తిషు,
ఏతద్ జ్ఞాన మితి ప్రోక్తం,
అజ్ఞానం యదతోఽన్యథా."

ప్రపంచమంతా ఆయనను సన్మానించవచ్చు కాని, ద్వేషించేవాళ్లుకూడా—ఏ కారణాలమూలంగా నైననేమి—ఉన్నారని, మొన్న వా పవిత్రశరీరం ఎడల గలిగిన అత్యాచారం వల్ల విదితమైందిగదా! అయినప్పటికి అన్నింటా ఆయనది సమచిత్తత్వమే యనుటకు ఈ దురంతానికి ముందు బాంబు విసరిన వానిని శిక్షింపకుండా వదలమనడమే సాక్షి. దంభదర్పాలు ఏనాడో వదలిపోయాయనుటకు వారి జీవిత వేషభాషణాదులే అనేక ప్రకారాలుగా జాటుతున్నాయి. మూర్తీభవించిన అహింస గాంధీ—మనస్సులో ఒకటుంచుకొని పైకి ఇంకోమాదిరిగా వర్తించని ఆర్జవసంపన్నుడు. ఇట్లే పై శ్లోకాలందుగల లక్షణాలకు ఆయన దేనికి లక్ష్యం కావడం లేదు?

ఎటువంటి వ్యక్తి తనకు నిజమైన భక్తుడో యని చెప్పడంలో కృష్ణుడు భక్తియోగానికి సంబంధించిన 12 వ అధ్యాయంలో—

సమస్త భూతాలలో నేటినీ ద్వేషించనివాడు, మైత్రీకరుణాంతరంగుడు, మమత్వరహితుడు, సుఖదుఃఖాదులను సమంగా అనుభవించేవాడు, ఇతరుల తప్పు తెలిసివుండి కూడా క్షమించువాడు, సంతుష్టుడు, నిరంతర యోగ-ధ్యానపరుడు, ఆత్మనిగ్రహం కలవాడు, ధృఢనిశ్చయుడు, మనోబుద్ధులను నా కర్పించినవాడు నా నిజమైన భక్తుడంటాడు. వీటిలో గాంధీ దేనికి గురికాడో యోచించండి. 12 వ అధ్యాయంలోని "అద్వేష్టా సర్వభూతానాం...సంతుష్టః సతతం యోగీ...ఇత్యాది శ్లోకాలను చూడండి.

"విద్యావినయ సంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని,
శునిచైవ శ్వపాకేచ పండితాః సమదర్శినః"

అనే శ్లోకానికి ఈయన లక్ష్యమవుతాడనడానికి హరిజనోద్ధరణ, దీనజనాదరణసందర్భాలలో అనేక నిదర్శనాలు దొరుకుతవి.

గాంధీ యౌవనావస్థలో ఉన్నప్పుడు కొందరు స్నేహితులీయనను మాంసభక్షణమూ, వేశ్యాగమనమూ లోనగు దుర్వర్తనలలో దింపాలని ప్రయత్నించినప్పుడు ఈయన మెల్లగా తప్పించుకోవడమూ, ఇంగ్లండులోని యువతీకన్యకలతో నిస్పృహుడై మెలగడమూ చూస్తే—యౌవనావస్థలో ఉన్న తరుణమందే—

"శక్నోతీహైవ యస్సోఢుం
ప్రాక్ శరీర విమోక్షణాత్,
కామక్రోధోద్భవంవేగం
సంయుక్తః స సుఖీ నరః"

కామక్రోధాదులవల్ల గలిగే ఉద్వేగాన్ని శరీరం వదలడానికి ముందే ఈ లోకంలోనే ఎవడు త్యజింపగలడో అతడే యోగి, సుఖీయని చెప్పిన శ్లోకార్థానికి సరిగా సరిపోవడంలేదా?

గాంధీ ఏదో సందర్భంలో ఉపవాసం బూనవలెనని సంకల్పించడమూ, అప్పుడు సి. ఆర్ గారు వద్దని వాదించడమూ, అందుపై గాంధికి కోపం రావడమూ, తరువాత ఆ కోపము నడచుకొని సి. ఆర్. గారిని క్షమించమని వేడుకోవటం గూడా పై శ్లోకార్థానికి లక్ష్యమే అవుతుంది.

గాంధీజీ ఎక్కడికి వెళ్ళినా హరిజనోద్ధరణానికో, మరి యే సర్వజనోపయోగకార్యానికో ద్రవ్యము అడుగుతూ ఉండేవారు. ఆయా సమయాలలో ఎక్కువ తక్కువలుగూడా లభిస్తూ వుండేవి. తన అనుయాయులయెడల ఆయనకు గల వాత్సల్యాన్ని బట్టీ, గౌరవమును బట్టీ ధనదాతలను మందలిస్తూ వచ్చినప్పటికీ నవ్వుతూ, నిజానికి గాంధీమనస్సులో సంతృప్తే వుండేది; ద్వంద్వాలకు అనగా సుఖదుఃఖాలకు అతీతమై వుండేవారని ఆయన గావిస్తూ వచ్చిన నియమోపవాసవ్రతాదికాయకష్టాలకు సహనం గలిగి వుండడమే తార్కాణం. స్వజాతీయులయెడలనే గాక అన్యజాతీయుల విషయంలో గూడా ప్రేమానురాగాలను గలిగివుండడం వీరి విమత్సరత్వానికిని దర్శనం, కార్యం సిద్ధించినా సరే సిద్ధింపకపోయినా సరే? ఏకభావంతో వర్తించడమూ ఇత్యాదులు—

"యదృచ్ఛాలాభ సంతుష్టో
ద్వంద్వాతీతో విమత్సరః,
సమః సిద్ధా వసిద్ధౌ చ
కృత్వాపి న నిబధ్యతే"

అనే శ్లోకార్థంతో సరాసరి తులతూగడం లేదా? ఈ హేతువుచేతనే ఈయన నిరంతర కార్యసంగుడై వున్నప్పటికీ అనిబద్ధుడే-అనగా ముక్తసంగుడే.

ఒకప్పుడు అన్యమతస్థులు కొందరు గాంధీజీని వారి మతము నవలంబించవలసినదని బలవంతపరిచారట. కాని అట్టివారి మాటలకు లోనుగాక స్వమతమందే సుస్థిరుడైవుండి బలవంతంమీద మతాలు మార్చుకోరాదని నేటివరకూ ఉపదేశిస్తూ వుండటమూ అన్యమతాల సిద్ధాంతాలను గౌరవిస్తూవుండడమూ చూస్తే—

శ్రేయాన్ స్వధర్మోవిగుణః
పరధర్మాత్ స్వనుష్ఠితాత్,
స్వభావనియతం కర్మ
కుర్వన్నాప్నోతి కిల్బిషం.
"సహజం కర్మకౌంతేయ
సదోష మపి న త్యజేత్........

శ్రేష్ఠమైన పద్ధతులమీద అవలంబింపబడే పరధర్మానికంటే దోషయుతమైనాసరే స్వధర్మావలంబనమే మంచిది. అగ్నితో ధూమంచేరి వుండేలాగు సమస్తకార్యాల్లోనూ ఏదో ఒక దోషము ఉండనే వుంటుంది, అనే శ్లోకార్థాలతో ఎంత చక్కగా సరిపోల్చుకోవచ్చునో?

ఏ సాబరమతీ ఆశ్రమంవంటి చోటనో కూర్చుంటే నిర్విచారంగా దినాలు గడచిపోయేవి. కాని అంతిమక్షణంవరకూ కార్యాసక్తుడై ప్రవర్తించి సత్యంప్రేమా అహింసల నిమిత్తం ప్రాణాలు వదలడం చూడగా—

"నమే పార్థాస్తి కర్తవ్యం
త్రిషులోకేషు కించన,
నానవాప్త మవాప్తవ్యం
వర్తఏవచ కర్మణి."
"యది హ్యహంన వర్తేయం
జాతు కర్మణ్యతంద్రితః,
మమ వర్త్మానువర్తంతె
మనుష్యాః పార్థ, సర్వశః"

మూడు లోకాల్లోగూడా నాకు కావలసిందేమీ లేదు. తత్సంపాదనం నిమిత్తం నేనేమీ చేయవలసినదీ లేదు. కాని నేనేమీ చేయకుండా కూర్చుంటినేని లోకంగూడా నన్ననుసరించి కర్తవ్యాలనుగూడా వదలి నాశనమై పోతుంది, అనే శ్రీకృష్ణుని బోధనాంశాలతో ఎంత సరిగా సరితూగుతుందో చూడండి.

స్థితప్రజ్ఞు డెట్లాంటివాడు? వాని యొక్క ఆచారవ్యవహారా లెటువంటివి? వాని సల్లాపాలెట్టివి? అని పార్థుడడుగగా కృష్ణుడు—

"దుఃఖే ష్వనుద్విగ్నమనాః
సుఖేషు విగతస్పృహః,
వీతరాగభయక్రోధః
స్థితధీ ర్మని రుచ్యతే."
"యః సర్వత్రా నభిస్నేహః
తత్తత్ ప్రాప్య శుభాశుభం,
నాభినందతి న ద్వేష్టి
తస్యప్రజ్ఞా ప్రతిష్ఠితా"

దుఃఖాలు మీదబడ్డా చలింపనివాడు, సుఖాలను నిర్లక్ష్యంచేసేవాడు, రాగ, భయ, క్రోధాలు లేనివాడు, దేనిమీదగాని మమత్వం లేనివాడు, శుభాలను అభినందించనివాడు, అశుభాలను ద్వేషించనివాడూ స్థితప్రజ్ఞుడని వచించిన అంశాలతో, పర్యాప్తమైన ఆదాయంగల జీవనవృత్తికి తిలోదకాలిచ్చి దక్షిణాఫ్రికాలోనూ, స్వదేశంలోనూ దేశస్వాతంత్ర్యంపొందే నిమిత్తం సత్యాగ్రహసమర మారంభించి ఏండ్లకు ఏండ్లు నానాయాతనను లభవించడమూ, నౌఖాలీ, కలకత్తా, ఢిల్లీ లోనగు ప్రదేశాలలో చెలరేగిన అగ్నిగుండాలలో దూకి నిర్భయంగా శాంతి సహనాలను ఉపదేశిస్తూ తుదకా ప్రయత్నంలోనే అమరత్వము నొందడం ఎంత చక్కగా అతిలిపోతుందో!

అటువంటి దేవాంశసంభూతుడు, అకస్మాత్తుగా అమరుడుగావటం చూస్తే దుఃఖసముద్రంలో మునిగిన మనకు—

"జాతస్యహి ధ్రువో మృత్యుః
ధ్రువం జన్మ మృతస్య చ
తస్మా దపరిహార్యార్థే
నత్వం శోచితు మర్హసి"

పుట్టినవాడు గిట్టడం, గిట్టినవాడు పుట్టడమూ ధ్రువం. ఈతప్పించుకోలేని విషయాలనుగురించి విచారించడం నీకు ఉచితం గాదని శ్రీకృష్ణుడు అర్జునునికి ఉపదేశించినట్లు మనమూమన మనస్సులను సమాధానపరుచుకొని గాంధీ జూపిన సత్యప్రేమాఽహింసామార్గాలను హృదయపూర్వకంగా అవలంబించి కృతకృత్యులం కావడం శ్రేయస్కరం.

ఓం శాంతిః శాంతిః శాంతిః

అమ్మ

(11-వ పేజీ తరువాయి)

కావాలని దానధర్మాలు చేసేబదులు, నీ విధ్యుక్త ధర్మాన్ని యీ ప్రపంచంలో నెరవేర్చు. నీలో సంతృప్తివుంటుంది. సంతోషి యెప్పుడూ స్వర్గంలోనే ఉంటాడు.

నువ్వు నాలుగేండ్లవాడవయ్యేటప్పటికి మాల్వీ బాబు నన్నొక బడిపంతులమ్మను చేసి తనుపనిచేస్తున్న బడిలోనే వేయించాడు. విజ్ఞానాభివృద్ధికి యెన్నో పుస్తకాలు చదివించాడు. మాల్వీ బాబు వుండబట్టి, నన్ను తన కుమార్తెలా చూచుకోబట్టి నా అందానికి యెవరూ ఆశించలేదు. నా యెదురుగుండా పిచ్చిమాటలు యెవరూ ఆడలేదు. నిన్ను జూస్తూ మురిసిపోతూ పెంచుకు వచ్చాను. నా అదృష్టంకొద్దీ నీలో అన్నీ సుగుణాలు మూర్తీభవించియున్నాయ్.

నీకు చిత్రకళయందున్న అభిరుచిని చూచి మాల్వీ హైస్కూలునుంచి మాన్పించి చిత్రకళ నేర్పించాడు. నలుగురిలో గౌరవంగా బ్రతుకుతూ నీ తల్లిని పోషిస్తున్నావ్. మాల్వీ బాబు క్రిందటి సంవత్సరం చనిపోయినట్లు నీకు తెలుసు. ఆయన శాఖాహారిగా వుండేవాడు. ఇంట్లోవారిని అలాగే తయారుచేశాడు. బాబు చనిపోగానే యింట్లోవారంతా మారిపోయారు. గొడ్డు మాంసం తింటున్నారు. మాల్వీసాహెబ్ కొడుకు త్రాగుడుకూడా నేర్చాడు. మాల్వీబాబా ద్వారా వారు నాకు బంధువులే. వారితో మాట్లాడకుండా వుండలేను."

అమ్మమాటలు సాంతంగా విన్నాను. కాని అపుడప్పుడూ నా నేత్రాలు కన్నీటిలో మునిగిపోయేవి. అమ్మను వుద్దేశించి, ఆమె పవిత్ర జీవితాన్ని దాచకుండా చెప్పినందుకు, అమ్మను కౌగిలించుకొని యేవో మాటలన్నా. అమ్మ నవ్వింది. ఆ రాత్రి అమ్మ జోలపాట పాడితే నిద్రపోయాను అమ్మప్రక్కనే.

తెల్లవారు ఝామునలేచి అమ్మ రాత్రిచెప్పినదంతా వ్రాసుకున్నాను. అమ్మ నే వ్రాస్తుండగా చూచి నవ్వింది ఆశ్చర్యంగా. నేను, అన్నా—'అమ్మా! దేవతల జీవితాలను, మహాత్ముల జీవితాలను చిత్రించిన గ్రంథాలను మనం పవిత్రంగా చూచుకొని, పారాయణం చేస్తూ పూజించలేదూ? నీ జీవితం అంత పవిత్రమైనదేనే అమ్మా. రోజూ చదువుకుంటాను! అమ్మసంతోషం నే వర్ణించలేను రావ్. నేను అమ్మజీవితాన్ని ఆమె మాటలలో యిలా నీతో చెప్పగలిగానంటే—దానికి కారణం, నే వ్రాసుకున్నది పవిత్రమైన నా తల్లి జీవితం రోజూ నే చదవబట్టే.

రోజులు గడుస్తున్నాయ్. నాలో భావ గాంభీర్యం మెల్లెక్కుతోంది. నేనలుగురిలో గౌరవించబడేవాణ్ని. ప్రకృతిని అర్థంచేసుకొంటూ నా కళాజీవితాన్ని కాస్త మెరుగు పెట్టుకుందామని ప్రయత్నించేవాడిని.

ఒకరోజు నే పనిచేస్తున్న స్టుడియోనుంచి వడివడిగా నడుస్తూ యింటికి బయలు దేరాను. వీథుల్లో మనుష్యసంచారంలేదు. అచటచటా మత కలహాలు రేగుతున్నవని విన్నాను. చీకటి పడకుండా యింటికి చేరుకుందామని ప్రయత్నించానుగాని లాభం లేకపోయింది. గోరీలగుండా మెల్లగా యింటికి చేరుకున్నా. వీథి తలుపు తెరచిఉంది. లోన చీకటిగా వుంది. మూలుగు వినపడుతోంది.

'అమ్మా' అంటూ కేకవేసాను.

'నాయనా...' అంటూ మెల్లగా పిలిచింది.

దీపం వెలిగించిచూసాను. అమ్మజుత్తు చెదరివుంది. కట్టుకున్న చీర చినిగివుంది. తగిలిన గాయాలలోనుంచి రక్తం కారుతోంది.

'అమ్మా! యెవరిలా...?' అమ్మపైవ్రాలిపోయి అమ్మకన్నీటి ప్రవాహంలో నాకన్నీటి ప్రవాహాన్ని కలుపుదామనుకున్నా. ముట్టుకోవద్దని సైగచేసింది. కాస్తసేపు ఆగాను. కారుతున్న రక్తాన్ని చూచి అమ్మను ముట్టకోకుండా వుండలేక పోయాను. 'అమ్మా! యెవరిలా...?' ప్రాధేయపడుతూ, గాయాలకు కట్టు కడుతూ అడిగాను. కొన్నేపు వూరుకొని 'వారి పేరు చెప్పకుండా వుండలేను. ప్రతీకారం చేయనని నాకు హామీ యీయరా?' అంది. అలాగే అన్నట్లు ఆతృతతో నా తల వూగింది.

'మాల్వీబాబుకొడుకు...నే అన్నయ్య అనుకొనేవాడు...'

నాలోని యౌవ్వనరక్తం పొంగినా నరాల్లోనుంచి పైకి రావటానికి ప్రయత్నిస్తోంది. నా గొంతుకేకవేసింది—'అమ్మా! నువ్వు చనిపోయేటట్లున్నావు. నీవు లేకపోతే నే నెవరికోసం బ్రతకాలి? ఆ పిశాచాన్ని చంపి దేశానికి మేలుచేసి మరి నీలో కలవనీయ్!' అమ్మ అంది— 'బాబూ! నీ అమ్మమాట దాటుతావా? మాల్వీకి ఒక్కడేకొడుకు. మాల్వీబాబునుంచే నే బ్రతకటం, నువ్వింతవాడివి కావటం జరిగింది. అపకారాన్ని మరచిపోయి కృతఘ్నుడవు కావద్దు.' ఆ అమ్మశాంతి వచనాలు నన్ను అహింసాపథంలో నడిపించినాయ్. అమ్మను చెరచిన చెండాలుడిని క్షమింపజేసాయ్.

అమ్మ దిగులు పడ్తోందని గ్రహించాను. అమ్మకు పరిచర్యలు చేస్తున్నా. దానివలన కాస్తశక్తివచ్చింది. నన్ను పడుకోమంది. అమ్మప్రక్కనే మంచంపై వ్రాలిపోయాను. నాకు నిద్ర పట్టలేదు. అమ్మ మెల్లగా జోకొట్టింది. అమ్మజోలపాట స్వర్గలోకంలో విహరించమని నా కంటిరెప్పలను మూసివేసింది.

ఇంట్లో గడియారం నాలుగు గంటలు కొట్టోంది. నాకు తెలివివచ్చింది. అమ్మ ప్రక్కన లేదు. టేబిల్పై అమ్మ తెల్లని చీర కనుపించింది. దీపంవత్తిమీదకు యెత్తాను. నాఫొటోకు చీర చుట్టివుంది. ఆ చీరపై రెండుతెల్లని కాగితాలు మడిచివున్నాయ్. మా అమ్మ నన్ను కౌగలించింది. మా అమ్మను నేను కౌగలించుకోవాలి. వడిగా పోయి ఆ చీరను కౌగలించుకున్నా 'అమ్మ' అంటూ.

ఒకవుత్తరం విప్పాను. అమ్మ నాకువ్రాసింది. నా జేబులోనే ప్రస్తుతం వుంది. టార్చిలైట్ వేయ్ చదువుతాను." టార్చిలైటు వేసాను. రజీవ్ వుర్దూభాషలో వున్న జాబును చదువుతూ అర్థం చెప్పాడు. 'నాయనా' నివ్వొకసారి ఇలా అన్నావ్ జ్ఞాపకముందా—'అమ్మా! జన్మజన్మాలకు నివ్వే నాతల్లివి. యీ ప్రపంచం యీ చావుపుట్టుక లున్నంతకాలం, సూర్యుడు ప్రకాశించినంతకాలం, గాలి వీచినంతకాలం నివ్వు నా అమ్మవే. నివ్వెక్కడవున్నా, నావెంటే వున్నట్లు, నాబాగోగులు కోరి నన్నే ఆపద రాకుండా రక్షిస్తున్నట్లు అనుకుంటానే అమ్మా!'

బాబూ, నేనూ నీవలెఅనుకుంటున్నానురా, నీవు జన్మజన్మాలకు నాకొడుకువని. మాతృహృదయం అమృతభాండమని, మాతృప్రేమ గౌరీపౌర్ణమినాటి వెన్నెలని, మాతృస్వరూపం దేవతాస్వరూపమని గ్రహించిన కొడుకువురా నీవు!

మలినపడ్డ యీ మాంసపుకండల్ని, యీ అస్థిపంజరాన్ని యీ రూపంలోవుంచి నీలాంటి కొడుకుచేత 'అమ్మా' అని పిలిపించుకోలేనురా! పవిత్రమైన సూర్యకిరణాలను మలినం చేయదలచుకోలేదు. అంచేత తెల్లవారకమునుపే యీబొందెలో ప్రాణం వుండకూడదని నిర్ణయించుకున్నా.

యీ సంస్థానంలో యీ నిరంకుశ రాజ్యాంగం వున్నంతకాలం యీ సంస్థానం వైపు కన్నెత్తి చూడవద్దు. తెలుగువారు మాదొడ్డవారు' ఒకరు కష్టపడుతుంటే చూడలేరు. తెల్లవారి యైదున్నర గంటలకు తెలుగునాడు పోయే రైలు బండి వుంది. అది యెక్కి తిన్నగా విశాఖపట్నం చేరుకో. నీ చేతిలో కళవుంది. నే త్రోవచూపిస్తాను. ఇది నిన్ను 20 యేండ్లవాడిని చేసిన నీ కన్నతల్లి ఆజ్ఞ. మన్నిస్తావని ప్రాణాలు విడుస్తున్నా.

నేను యెపుడూ నీ వెనువెంటనే వుంటాను. కాబట్టి నువ్వెల్లప్పుడూ యిప్పటిలా నవ్వుతూనే జీవితాన్ని గడపాలి. రెండవ వుత్తరం పొరుగు మాల్వీ కొడుకు యింట్లో కిటికీగుండా పడవేసి మరీ బయలుదేరు. యీ వుత్తరంలో వుంచిన 50 రూ. ఖర్చుపెట్టుకో నాయనా! నీవు గడించిన డబ్బు తప్ప యింకేమి యీయగలను? చిట్టి తండ్రీ! ధైర్యంతో......

నీ అమ్మ'

నా కళ్ళవెంబడి కన్నీరు తిరిగింది. కాని రజీవ్ నవ్వుతున్నాడు.

'రావ్! మాల్వీకొడుకికి వ్రాసిన వుత్తరం చదవకుండా వుండలేక పోయాను. అమ్మ నాకు చదువవద్దని చెప్పలేదు. చదివితే తప్పులేదని సంతృప్తి పడ్డాను. 'అన్నయ్యా!' అంటూ సంబోధిస్తూ వ్రాసింది అమ్మ. ఆ వుత్తరంలో వ్రాసిన భాష నా నోరు వుచ్చరించటానికి తాహతు లేదు. అమ్మ ఆజ్ఞను శిరసా వహించాలి. అమ్మను సంతోషపెట్టాలి. బెడ్డింగు వడిగా చుట్టవేసి నెత్తిన పెట్టుకొని వుత్తరం కిటికీగుండా పడవేసి స్టేషనుకు బయలుదేరాను.

త్రోవలో తురకల సమాధులు కనిపించాయ్. అమ్మ ఆ వుత్తరంలో వ్రాసింది—ఇందులోనే మాల్వీసాహెబ్ గోరీ వుంటుంది. యీ గోరీ పైనే అమ్మ లోకదృష్టిలో శాశ్వత నిద్ర పొందుతుంది. అదిగో! అమ్మ కనిపిస్తోంది... మాల్వీతాతతో కొడుకు గుణాలు చెప్తున్నావా అమ్మా? నివ్వు చెప్పవే. ఆ మూర్ఖుని క్షమించావ్ కదూ. అమ్మా! నివ్వు నా కళ్ళ యెదురుగానే వున్నావ్. కాని జోలపాట పాడిన నోరు మూసుకపోయింది....ఇలా....చేతులెత్తి ఓ నమస్కారం చేసి నడిచాను.

స్టేషనుకు జేరుకొని రైలెక్కాను. అప్పటికి కలహాలు ప్రారంభదశలో వున్నాయి. మా అమ్మ మీ ఫోటో స్టూడియో యజమానిని చూపించింది. ధనవంతులలో కూడ దయార్ద్ర హృదయులున్నారని యిపుడే తెలుసుకున్నా. 50 రూ. నెల జీతం మీద చేరటం, నిన్ను కలుసుకోవటం జరిగింది. ఇదీ నా అస్పృష్టజీవితం"

నే మాట్లాడలేక పోయాను కాస్సేపు. 'రజీవ్' అంటూ స్నేహితుని ఓదారుస్తూ కన్నుమూసాను. నాల్గు కన్నీటి బిందువులు యిసుకపై వ్రాలి యింకిపోయాయ్. నవ్వుతూ ఆయన కండ్లు మూసాడు. యెవరో యువకుడు 'యేమండీ! అగ్గిపెట్టె వుందండీ' అనేసరికి కండ్లు తెరిచాం. యిద్దరిముఖాల వైపు చూస్తూ నడచిపోయాడు. మే మిద్దరం యింటిదారి పట్టాం.

గాజు పరిశ్రమ

(10 వ పేజీ తరువాయి)

పని. లేకపోతే గాజులో అలసట లుంటాయి. కొన్ని పరిస్థితుల్లో అది అరిష్టమే. కాని కొన్ని గిన్నెలకు లోటాలకు ఈ అలసట జాగ్రత్తగా కలిగిస్తారు. లోతట్టు ఉన్నట్టుండి చల్లార్చి పైతట్టు మెల్లిగా చల్లారుస్తారు. దాంతో లోతట్టు అలసట వుంటుంది. దానివల్ల కలిగే మేలు ఏమిటంటే ఎంత వేడివస్తువు పోసినా ఆ లోటా పగలదు. అట్లాగే గిన్నెలకు పైఉపున అలసట కలిగిస్తే ఎంత వేడి అయినా భరించే శక్తి ఆ గిన్నెలకు వుంటుంది. అంటే అవి పొయ్యి మీద పెట్టవచ్చును. ఇవి పొరబాటున క్రింద పడ్డా, బైటవేపు అలసట వుండడం మూలాన పగలవు. వీటినే అన్‌బ్రేకబుల్ గాజు లోటా లంటారు. పొయ్యిమీద పెట్టేందుకు చేసే గిన్నెలకోసం చేసే గాజును పైరెక్స్ గాజు అంటారు. ఆ గాజుతయారీలో బోరాక్స్— వెలిగారం వాడుతారు. ఆ టంకభస్మంలో వేడిని నిగ్రహింపజేయగల శక్తివుంది.

శాస్త్రీయకృషికి రసాయన ప్రయోగశాలల్లో వాడు సామాన్యను తయారుచేసే గాజుకు వేడిని నిగ్రహింపగలశక్తిమాత్రమే చాలదు. చాలా రకాల బలహీనమైన గాజులకు ఎక్కువ నీరు తగిలినా, ఆర్ద్రతగల వాయువు సోకినా ఆమ్లాలు, క్షారాలు, బలమైన లవణాలు సోకినా దెబ్బతగిలి మెల్లిగా కరిగిపోతాయి. అందుకు గాను గ్లాసు తయారీ ముడివస్తువులలో నే సోడా, కాల్సియం తగ్గించి సీసం, అల్యూమినం, ఎక్కువచేస్తారు. సాధారణంగా తుత్తునాగం, తగరంకూడా చేరుస్తారు. అది రసాయనికగాజు అంటారు.

ఆభరణాలు తయారుచేయడానికి వాడే గాజులకు వక్రీభవన గుణకం (refractive index) ఎక్కువగా వుండాలి. అంటే సోడా బదులు పొటాసియం, లిథియం వాడడం, కాల్సియంబదులు, సీసం వాడడం జరుగుతూ వుంటుంది. ఆ గుణకం ఎక్కువగావుండే గాజులను కోసి అరగదీసి మెరుగుపెట్టితే చాలా ఆకర్షణీయంగా తయారౌతాయి. ఈ మెరుగు ఆభరణాలకేగాక అలంకారార్థము బల్లల మీదనూ విలాసార్థము వాడబడే వస్తువులకూ, పానీయపాత్రలకూ ఎక్కువగా పెడుతూ వుంటారు. దీపకరండికలకు—chandeliers బహుళైపుణ్యంతో మెరుగు లివ్వబడుతాయి.

యుద్ధకాలంలో చాలారకాల గాజు తయారవడం సంగతి మనం వింటున్నాం. వేడినీరు తగలగానే మెత్తపడేగాజు, బాంబులు తగిలినా పగలనిగాజు—యిందులో ముఖ్యమైనవి. గాజు తయారీలో వాడబడే ప్రతిభస్మం ఏ నిష్పత్తిలో వాడబడుతుందో, ఆ భస్మం గాజుస్వాభావికాలను ఎల్లా మారుస్తుందో జాగ్రత్తగా పరిశీలించి ఏండ్లగాకృషిచేసి కనుక్కున్న విషయాలు అన్నీ క్రోడీకరించి తత్ఫలితంగా ప్రోగుచేసిన సంగతులన్నీ సునిశితశాస్త్రపరీక్షజరగడంవల్ల మనకు నేడు కోరిన స్వాభావికాలుగల గాజును చేయగలరు. క్రిందటి శతాబ్దం ఫేరడే, ఆబే, కాక ఈమధ్యలో వింకెల్‌మాన్, షాట్, ఇంగ్లీషు టర్నరు, మోరే, షిమ్మర్, జిగ్మాండే, షెల్టర్, శాస్మన్, మెక్వీన్, స్టాట్‌వాన్‌బర్గ్, పోస్టనర్, టేలర్, స్మిత్ ప్రభృతులు ఎందరో చేసిన కృషి ఫలితం యిది. వారు ఒక దేశస్థులు కారు. వారంతా వేరువేరు పరిస్థితుల్లో ఇచ్చిన ఫలితాలు ఇవ్వి.



గ్రంథ స్వీకారము

గోర్కీ-కథలు

ఒకటవభాగం. అనువాదం—మహీధర జగన్మోహన్ వెల 1-8-0.

పై నాలుగు పుస్తకముల ప్రచురణ: విశ్వసాహిత్యమాల, రాజమండ్రి.

* * *

త్రిపురసుందరి

నాటకము. వెలగపూడి భుజంగరావు గ్రంథకర్త. ప్రచురణకర్త: పి. వి. కె. ఇ. బోర్డు హైస్కూలు, నిడుబ్రోలు వెల 1-0-0.

* * *

పేరుఫలములు 1948

12 రాశులకు, 12 విడివిడి జన్మరాశి ఫలముల పుస్తకములు కొటాబత్తుని నాగభూషణ సిద్ధాంతి. ఒక్కొక్క రాశి పుస్తకము వెల 0-4-0. సుందరరాం అండ్ సన్సు తెనాలి.

రాయలహిందీ తెలుగు ప్రైమర్

విద్వాన్ ఎ. సి. కామాక్షిరావు. ప్రచురణ: రాయలు అండుకో, పబ్లిషర్స్, కడప. వెల 0-6-0.

* * *

శ్రీత్యాగరాజచరిత్ర

రచయిత: యోగి శ్రీ శుద్ధానంద భారతి. సాధనగ్రంథమండలి, తెనాలి. వెల నాలుగు అణాలు.

* * *

భాగ్యోదయ

సరళ హిందీ పక్షపత్రిక. సంపాదకుడు శ్రీ టి. కృష్ణస్వామి, హిందీప్రచారక్. విలాసము, 367, గోసేబజార్, జబల్‌పూర్, సి. పి.

హిందీ మన దేశమునకు రాజభాష కానున్నది. అట్టితరి, హిందీమాతృభాష గా లేని రాష్ట్రీయులలో హిందీ వ్యాప్తికి దోహదము చేయుట 'భాగ్యోదయ' పత్రికపత్రిక ఆశయము. 16 పేజీలు. వెల 4 అణాలు.

* * *

కోకిల

కమనీయమైన కథల మాసపత్రిక. సంపాదకుడు రాము మోహన్; విలాసము; మెయిన్ రోడ్, కాకినాడ. కమనీయమైన కథ సేగాక, వెండితెర, గృహబలం, రమణీమణులు, కావ్యపుష్పం, గ్రంథపరిశీలన, క్రాస్‌వర్డ్ మొదలైన శీర్షికలతో వెలువడింది. 46 పేజీలు. ప్రతి వెల 0-4-0

* * *

దక్షిణీ హింద్

సంవత్సరాది సంచిక. మద్రాసు ప్రభుత్వముచే ప్రచురింపబడు హిందీ మాసపత్రిక. సంపాదకుడు: శ్రీ రామానందశర్మ విలాసము: హిందీ ప్రచార్ సభ, మద్రాస్ 17.

తమిళ సంస్కృతి, ఐతిహాసిక కర్నాటక్, శబ్దోం కాలుప్త, ఇతిహాస్, సాహిత్యజీర్ కలామే సార్వభౌమ భావనా మొదలైన విజ్ఞాన పూరిత వ్యాసాలతోను, కథలతోను, నాటికలతోను, సంపాదకీయవ్యాఖ్యలతోను వెలువడిన ఈ సంవత్సరాది సంచికతో 'దక్షిణీ హింద్' పత్రిక రెండవ సంపుటం ప్రారంభమైనది. సరళ హిందీలో, చక్కని ముద్రణతో వెలువడిన ఈ పత్రిక దక్షిణాదిని గురించి ఉత్తర హిందూస్తాన్ వాసులకు సర్వ విషయములను బోధించ గలుగుటకు చక్కగా ఉపకరిస్తుంది. సంవత్సర చందా నాలుగు రూపాయలు.

హృదయదానం

కథల సంపుటి. రచయిత శ్రీ కాజ వెంకటేశ్వరరావు. ప్రతులకు: కాజవెంకటేశ్వర రావు, c/o పుష్పవతి, బాలికాపాఠశాల, కంపిపాడు. పోస్టు, కృష్ణాజిల్లా. వెల 0-12-0

* * *

బాష్పాంజలి

లలిత కళాసమితి, విశాఖపట్టణం, వారి కరపత్రము 1. గాంధీజీ నిర్యాణమునకు సంతాపము సూచిస్తూ పలువురు రచించిన పద్యాలు ఆర్టు పేపరుపై ముద్రింపబడినవి. 20 పేజీలు. ప్రతులకు: శోధక్, గృహపరిశ్రమల సంఘము, చిన్నవారిం వీధి, విశాఖపట్నము.

* * *

మహాత్మాగాంధీ నిర్యాణము

16 పేజీల పద్యకావ్యము. కవి మద్దూరి వెంకట సత్య సూర్య నారాయణ మూర్తి. వెల 1-0-0

చిన్న సైజులో 23 పేజీలపద్యకావ్యము. కర్త: పండిత చిలుకూరి శ్రీరాములు. ప్రచురణ: సుమతీ బ్రదర్సు, తెనాలి. మూల్యము 0-4-0

* * *

బాపూజీ (హత్య)
తల్లి లేని పిల్ల

కథల సంపుటి. కథకుడు: శ్రీ కొడవటిగంటి కుటుంబరావు. ప్రచురణ: ప్రజాసాహిత్య పరిషత్తు, తెనాలి. 86 పేజీలు. వెల రూపాయి.

* * *

సంతానము

యూజనీ శాస్త్రానికీ (Eugenies), కామశాస్త్రానికి (sexual science) కీ సంబంధించిన కొన్ని విషయాలు చర్చింపబడిన 52 పేజీల పుస్తకం. రచయిత శ్రీ పిల్లలమర్రి బాలకృష్ణ శాస్త్రి. ప్రచురణ: ప్రజాసాహిత్య పరిషత్, తెనాలి. వెల. 0-8-0.

* * *

కన్యకా పురాణము

శ్రీ కన్యకాపరమేశ్వరి చరిత్రము. వచనము. రచయితలు: 'కవిచంద్ర' విద్వాన్ కోట సుబ్రహ్మణ్య శాస్త్రి; 'రచనాప్రవీణ' కోట సత్యరంగయ్య శాస్త్రి గారలు. ప్రకాశదాత: శ్రీ కర్లపాటి సత్యనారాయణ శ్రేష్ఠిగారు. 114 పేజీలు వెల రెండు రూపాయలు. ప్రతులకు: కోట సోదరకవులు, అష్టావధానులు, కనిగిరి, నెల్లూరు జిల్లా.

* * *

గాంధీ తాత

చిన్న సైజులో, ముచ్చటైన ముద్రణతో 51 పేజీల పద్యకావ్యము. కర్త. రావెల వెంకటశివ సీతారామారావు. ప్రచురణ: సుందరరాం అండ్ సన్స్, తెనాలి. వెల 0-6-0.

* * *

భారతీ సమితి

పామర్రు (కృష్ణా జిల్లా) వార్షికోత్సవ సంచిక.

* * *

శ్రమజీవులు

కర్షకులు, కార్మికులు, ఆటవికులు, విప్లవము, జాతీయోద్యమము, భారతవీరులు, స్వతంత్ర భానూదయము, స్వర్గస్థవీరులు, మన పూర్వస్థితి, మన జాతీయపతాకము, ముస్లిముల దౌర్జన్యము, మన కర్తవ్యము, తెలుగువారి వెలుగు మొదలగు విషయములపై 17 పేజీల పద్యకావ్యము. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సంఘంవారిచే సన్మానమందిన కనుమెట్ల జగన్నాథాచార్యులుగారిచే రచింపబడి ప్రచురింపబడినది. వెల ఎనిమిదణాలు. ప్రతులకు: కనుమెట్ల జగన్నాథాచార్యులు, తొగరాం (గండ్రేడు) దూసి ఆర్. ఎస్. పోస్టు B. N. Ry.

* * *

ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘము, పడమట, కృష్ణాజిల్లావారి ప్రచురణలు

గ్రంథాలయ శాస్త్రప్రథమ పాఠములు

రచయిత: శ్రీ పాతూరి నాగభూషణం. ప్రచురణ: దేశికవితామండలి, ఘంటసాల. పేజీలు 210; వెల. రెండు రూపాయలన్నర.

గ్రంథాలయములు: రిజిస్ట్రేషన్

రచన: శ్రీ పాతూరి నాగభూషణం. ప్రచురణ: దేశికవితామండలి, ఘంటసాల. పేజీలు 26. వెల. ఆరణాలు.

వయోజన విద్యాబోధన క్రమము

రచన: శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావు ఎం. ఏ. ప్రచురణ: దేశికవితామండలి, ఘంటసాల. పేజీలు 115, వెల. రూపాయిన్నర.

సభలు - సమావేశములు

రచన: శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావు ఎం. ఏ. ప్రచురణ: దేశికవితామండలి, ఘంటసాల. పేజీలు 87, వెల. రూపాయపావలా.

ఇరువదియైదవ ఆంధ్రదేశగ్రంథాలయ మహాసభ-సింగరేణి కాలరీస్

1944 వ సం. ఆగస్టునెలలో సింగరేణిలో జరిపిన ఆంధ్రదేశ గ్రంథాలయ మహాసభ నివేదిక. అధ్యక్షులు శ్రీ బూర్గుల రామకృష్ణరావు గారు. ప్రారంభకులు శ్రీ సూరవరం ప్రతాపరెడ్డిగారు. ఆంధ్ర పితామహ శ్రీ మాడపాటి హనుమంతరావుగారు మొదలగువారి చిత్రపటములతోను, స్వాగత పద్యములు, స్వాగతోపన్యాసము, ప్రారంభోపన్యాసము, అధ్యక్షోపన్యాసము, నివేదిక, తీర్మానములు మొదలగు మహాసభ కార్యక్రమ వివరములతోను, ప్రచారక శాఖ, నిర్వహణశాఖ, వయోజన విద్యాశాఖ మొదలగు శాఖల ప్రత్యేక సమావేశాలలో చదువబడిన 12 వ్యాసములతోను, రెండు అనుబంధములతోను, 114 పేజీలలో ముద్రింపబడి ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘముచే (పటమట లంక) ప్రచురింపబడినది.

గ్రంథాలయోద్యమాభిమానులు తప్పక చదువవలసిన పుస్తకము. వెల రూపాయిన్నర.

* * *

ఇరువదియారవ ఆంధ్రదేశ గ్రంథాలయ మహాసభ-క్యాతూరు

1946 వ సం. మార్చినెలలో తెలంగాణాలోని క్యాతూర్యరులో జరిగిన మహాసభ నివేదిక.

మహాసభ ఊరేగింపు, దృశ్యాలు, శ్రీ సూరవరం ప్రతాపరెడ్డి, శ్రీ సూరవరం రంగారెడ్డి, శ్రీ మాడపాటి హనుమంతరావుగారు, శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు మొదలగు నిర్వాహకుల ఛాయాచిత్రములతోను, స్వాగతోపన్యాసము, ప్రారంభోపన్యాసము, అధ్యక్షోపన్యాసము, మహాసభ విశేషాలు, నివేదిక, తీర్మానములు మొదలగు వివరములతోను, ప్రచారకశాఖ, నిర్వహణశాఖ, వయోజనవిద్యాశాఖల ప్రత్యేక సమావేశములలో చదువబడిన 5 వ్యాసములతోను, 6 అనుబంధములతోను 80 పేజీలలో ముద్రింపించి ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమువారిచే ప్రకటింపబడినది. వెల రూపాయి.

ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘ 32, 33 సంవత్సరముల నివేదిక

ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘము 32, 33 సంవత్సరముల నివేదికతోపాటు, సభ్యత్వము, సమావేశాలు, గ్రంథాలయశిక్షణ, ప్రచారము, ప్రభుత్వ సహాయము, సంఘప్రచురణలు, గ్రంథాలయ పుస్తకాల, గ్రంథాలయములకు సహాయము, సలహాలు మొదలగు వివరములు 75 పేజీలలో ముద్రించి, ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘము (పటమట కృష్ణాజిల్లా)చే ప్రకటింపబడినది. ప్రతి గ్రంథాలయములోను వుండదగిన పుస్తకము.

మన దేశములోని వీరపురుషారాధనము

[16వ పేజీ తరువాయి]

ఘోషించుచున్నది. కాళిదాసమహాకవి "యస్మిన్నీశ్వర ఇత్యనన్యవిషయ శ్శబ్దో యథార్థాక్షరః"—అని యీశ్వర శబ్దము శివునియందు రూఢమని తెలిపినాడు. అట్టి యుద్దేశముతో భైరవార్చనము సాగుచుండెడిది.

తక్కువజాతులలో భైరవార్చనముతో బాటు మైలారదేవునారాధనము సైతము జరుగుచుండెడిది. ఇతని యుత్సవము లత్యంత వైభవోపేతముగ నోరుగల్లునందు జాగుచుండెడి వని 'క్రీడాభిరామ' మందలి—

"శనివారసిద్ధి సజ్జన పారిజాతంబు
వరదాత యాదిత్య పరభోగి
మాధవీర మణుండు మాయావినోదుండు
సూళవీప్రియభర్త మహితయశుడు
పల్లెంబ నాయకుండెల్ల వేల్పులరాజు
కనపవేటల వేట్కకాండ్ర భర్త
కత్రశాలా స్వామి కరుణాపయోరాశి
పుణ్యకీర్తనుడైన ప్రోలియయ్య
మంచు కుంచాలఁ గొలువంగ మాయతేళ్ళఁ
బట్టి కట్టంగ నేర్చిన బాసగల్లి
భైరవుని తోడిజోడు మైలారదేవుఁ
డోరుగంటి నివాసి మే లొసఁగుఁగాత!"

—అను పద్య మవగత మొనర్చుచున్నది. ఇంతియకాక రేణుకాదేవి యను నేకవీరా మహాదేవి యాదిశక్త్యపరావతార మని తలచి, యా దేవ్యుత్సవముల నత్యంత వైభవోపేతముగ నొనర్చుచుండిరి. ఆ సమయమున బవినీలు పరశురాముని కథలు వినుపించుచుందురు.

క్రీ. శ. పదునేడవ శతాబ్దమున పెదసోమభూపాలుడు బాహుబలదర్పమున ననేక సీమల గెలిచి, యొక స్వతంత్ర రాజ్యము నేర్పఱచి, గద్వాల దుర్గమును గట్టించి, ప్రఖ్యాత వీరపురుషుడని ప్రసిద్ధివడసెను. ఆతని సాహసోపేత కృత్యముల, నద్భుతకార్యముల, శౌర్యధైర్య గాంభీర్యాదుల, వివరించు గాథలు నేటికిని జనశ్రుతిలో నినదించుచు దాండవించుచున్నవి. తందాన తాన పదముల బాడువారి వీర్యక్రమాదిత్యుని చరిత్రమును 'శోభనాద్రికథ' యను పేరితో బాడుచు, నా ప్రాంత ప్రజల కుత్సాహ ప్రక్రియను బురికొల్పుచు, నుత్సవముల నేటేట జాగించుచు, నానందించుచున్నారు.

అట్లే పలనాటి యుద్ధవీరుల యుత్సవములు 'కార్యమపూడి'లో గాత్రికమున మహోన్నతముగ జరగుచుండుట గలదు. అయ్యుత్సవములు జరగుచుండిన దినములలో బలనాటి యుద్ధమున బాల్గొన్న వారి శౌర్య, ధైర్యగాంభీర్య, పరాక్రమాదుల గన్నులకు గట్టినట్టు కథలుగా జాపెట్టి జానపదుల నలరింపజేయుచుందురు.

కాకతీయుని తిరునాళ్ళలోను, కుమారగిరి రెడ్డి జరపు వసంతోత్సవములలోను, ఉదయగిరి సీమలో జరగు కాటమరాజోత్సవములందును,—నిర్విఘ్నముగనే వీరపురుషారాధనము సాగుచుండెడి దని తెలియుచున్నది. పవిత్రోద్దేశములతో వీరపురుషుల యారాధనము సేయుట జాతియొక్క పురోభివృద్ధికి మార్గము కావున నట్టులొనర్చి, యు వీరపురుషుల ననుకరింప వేడుచున్నాడను.

నారాయణ భట్టు

(6 వ పేజీ తరువాయి)

దం బొనరం గొనియాడి వేడుకన్."
దీనితో సభయంతయు వికసించెను.

"పాయక పాకశాసనికి భా
రత ఘోరరణంబునందు నా
రాయణునట్లు దానును ధ
రామరవంశ విభూషణుండు నా
రాయణభట్టు వాఙ్మయ ధు
రంధరుడున్ దన కిష్టుడున్ సహా
ధ్యాయుడునై నవా డనుమ
తింపగ దోడయి నిర్వహింపగన్."

ఈ పద్యమునకు రాజరాజు ఆదరముతో నారాయణభట్టు వంక దిలకింప సభలో జయ జయ ధ్వానములు చెలరేగెను. అంత నారాయణభట్టు ఇట్లనెను:

"సారమతిం గవీంద్రులు ప్ర
సన్నకథాకలితార్థయుక్తిలో
నారసి మేలు నా నితరు
లక్షరరమ్యత నాదరింప నా
నా రుచిరార్థసూక్తినిధి
నన్నయభట్టు తెనుంగునన్ మహా
భారత సంహితా రచన
బంధురుడయ్యె జగద్ధితంబుగన్."

ఆ మిత్రుల యన్యోన్య ప్రేమకు సభ్యులు సంతసించిరి.

అంతట రాజరాజనరేంద్రుడు సింహాసనము నుండి లేచెను. సభ్యులందరు లేచిరి. అంతట, విలాసినులందించు చందనతాంబూలాది సత్కారముల రాజరాజు నన్నయ భట్టారకుని బూజించెను.

ఇంతలో వజ్జియ కుమారుడు అసంపూర్ణమగు నొక కోశము తెచ్చి నన్నయభట్టారకుని చేతి కిచ్చెను. అది నన్నయ కన్నుల కద్దుకొని విప్పుచుండెను.

"ఇదేమి నన్నయా?" అని రాజరా జడిగెను.

"నేను కొంతవరకు వ్రాసిన శ్రీమదాంధ్ర మహాభారతము!"

వజ్జియ చిరునవ్వుతో నం దు కొ నె ను: "రహస్య పరిశోధనలలో నిమగ్నుడైన నన్నయ నారాయణుల సహాధ్యాయుడు ఈ విషయము నాకుకూడ చెప్పక రహస్యముగా నుంచినాడు!" అనుచు తన కుమారుని నిర్దేశించెను. అతడు ముసిముసినవ్వులు నవ్వుచుండెను.

రాజరాజు: అప్పుడే యెప్పు డారంభించితివి నన్నయా?"

నన్నయ: "దేవా, మీ సెలవైననాడే నారాయణభట్టు లగ్నము పెట్టినాడు."

సభకు నారాయణభట్టు ప్రతిభ నుగ్గడింపవలెనో నన్నయ అనసూయా స్వభావమును మెచ్చుకొనవలెనో తెలియలేదు.

రాజరాజు ప్రశ్నించెను:" ఎంతవరకైనది?"

నన్నయ: "మూడవ యాశ్వాసముతో నాగిపోయినది"

రాజరాజు: "మూడవదానిలోనా? కొన్ని భాగములు ఈసభలో వినిపింతువా, భట్టారకా!"

నన్నయ: "చిత్తము!"

సభ యొక్కసారి వ్యగ్రమై నిశ్శబ్దమయ్యెను. నన్నయ విశద స్వరమున మంద్రస్థాయిలో ప్రారంభించెను.

"తత్కథాప్రారంభం బెట్టిదనిన.........

ఆ కథకుండు వెండియు నమ్మునిసంఘంబునకు నమస్కారంబుచేసి యనేకపురాణపుణ్యకథా కథన దక్షుండ వ్యాసశిష్యుండైన రోమహర్షణునకు బుత్త్రుండ నావలన నెక్కథ విన వలతు రనిన నమ్మునులతని కిట్లనిరి:

వీయది హృద్య మపూర్వం
బేయది యెద్దాని వినిన నెరుక సమగ్రం
బై యుండు నఘనిబర్హణ
మేయది యక్కథయ వినగ నిష్టము మాకున్.

*　*　*

శ్రీకృష్ణుని మాహాత్మ్యంబును బాండవాది భారతవీరుల మహాగుణంబులును వనవిమల విజ్ఞానమయంబైన వాగ్దర్పణంబునం దేర్పడ వెలుంగుచుండ—

ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని
యధ్యాత్మవిదులు వేదాంతమనియు
నీతివిచక్షణుల్ నీతిశాస్త్రంబని
కవివృషభులు మహాకావ్యమనియు
లాక్షణికులు సర్వలక్ష్యసంగ్రహమని
యైతిహాసికు లితిహాసమనియు
బరమపౌరాణికుల్ బహుపురాణసముచ్చ
యంబని మహిగొనియాడుచుండ

వివిధవేదతత్త్వవేది వేదవ్యాసు
డాదిముని పరాశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై
పరగుచుండజేసె భారతంబు

ఆయురర్థులకు దీర్ఘాయురవాప్తియు
నర్థార్థులకు విపులార్థములున
ధర్మార్థులకు నిత్యధర్మసంప్రాప్తియు
వినయార్థులకు మహావినయమతియు
బుత్త్రార్థులకు బహుపుత్త్రసమృద్ధియు
సంపదర్థుల కిష్టసంపదలును
గావించు నెప్పుడు భావించి వినుచుండు
వారల కిమ్మహాభారతంబు
భక్తియుక్తులైన భాగవతులకు శ్రీ
వల్లభుండు భక్తవత్సలుండు
భవభయంబు లెల్ల బాపి యిష్టార్థ
సిద్ధి గరుణతోడ జేయునట్లు.

*　*　*

అమితాఖ్యానకశాఖలం బొలిచి వే
దార్థామలచ్ఛాయమై
సుమహావర్గ చతుష్క పుష్పవితతిన్
శోభిల్లి కృష్ణార్జునో
త్తమ నానాగుణ కీర్తనార్థఫలమై
ద్వైపాయనోద్యాన జా
త మహాభారత పారిజాత మమరున్
ధాత్రీసురప్రార్థ్యమై.

*　*　*

సాత్యవతేయ విష్ణుపద
సంభవమై విబుధేశ్వరాద్రి సం
గత్యుపశోభితంబయి జ
గద్విదితంబగు భారతీయ భా
రత్యమరాపగౌఘము ని
రంతర సంతత పుణ్యసంప దు
న్నత్యభివృద్ధి సేయు విని
నం గొనియాడిన నెల్ల వారికిన్.

*　*　*

త్రేతాద్వాపర సంధి నుద్ధతముదాం
ధీభూత విద్వేషి జీ
మూతోగ్రశ్వసనుండు రాము డలుకన్
ముయ్యేడు మారుల్ రణ
ప్రీతిన్ వైరిధరాతలేశ్వరుల జం
పెం బల్వురన్ దీర్ఘ ని
ర్ఘాత క్రూరకుఠారలూన నిఖిల
క్షత్త్రోరుకాంతారుడై.

*　*　*

తగు దిది తగదని యెదలో
వగవక సాధులకు బేదవారల కెగ్గుల్
మొగిజేయు దుర్వినీతుల
కగు ననిమిత్తాగమంబులయిన భయంబుల్.

*　*　*

ఉదంకుండును వానితోడన తగిలి యవ్వివరంబున నురగలోకంబున కరిగి నాగపతుల నెల్ల నిట్లని స్తుతియించె:

బహువన పాదపాదికుల
పర్వత పూర్ణసరస్సరస్వతీ
సహిత మహామహీభర మ
జస్రసహస్రఫణాళి దాల్చి యు
స్సహతరమూర్తికిన్ జలధి
శాయికి బాయక శయ్యయైన యా
య్యహిపతి దుష్కరవ్రతాంతకు
డనంతుడు మాకు బ్రసన్నుడయ్యెడున్.

*　*　*

పాతాళైకనికేతనాంతరమునం
బర్వెం దదశ్వాఖిల
స్రోతోమార్గ వినిర్గతోగ్ర దహనా
ర్చుల్ పన్నగ వ్రాతముల్

భీతిల్లెన్ భుజగాధినాథు మనముం
భేదిల్లె గల్పాంత సం
జాత ప్రోద్ధత బాడబానలశిఖా
శంకాధికాతంకమై.

*　*　*

నరచాప ప్రవిముక్తదారుణ బృహ
న్నారాచ నారల్ భయం
కరదైతేయ నికాయ కాయములపై
గప్పెన్ దిశల్ నిండ బం
ధుర ధాత్రీధర తుంగశృంగతట సం
దోహంబుపై గప్పు దు
ర్ధర ధారాధర ముక్తసంతతపయో
ధారావళిం బోలుచున్.

పత దుర్వీధరధాతు నిర్ఝరజలా
భంబై మహాదేహ ని
ర్గత సాంద్రారుణపూర మొక్కపెలుగన్
లక్ష్మింద్రెస్సె నారాయణో
న్నతదోర్దండ విముక్త చక్రనిహతిన్
నాకద్విష న్మస్తక
ప్రతతుల్ ఘోరరణంబునం బడియె భూ
భూగంబు కంపింపగన్.

ఆ పద్యములు చదువగానే రాజరాజు సంతోషించి "నరనారాయణు లీ సభలోనే మాకు ప్రత్యక్షమగుచున్నా" రనెను. అంతః పురము నుండి అమ్మంగమహాదేవి పంపిన బహుమానములు విలాసినులు తెచ్చి నన్నయకు నారాయణునకు సర్పించిరి. మరల నన్నయ ప్రారంభించెను:

వాలుపయినడచున ట్ల
బ్బాలిక నడునడ నశంగి భయమున నియమా
భీలుడగు పతికి బవళుల్
శేలును నేమరక పరిచరించుచు నుండెన్.

*　*　*

ఆయుష్యం బితిహాసవస్తుసముదా
యం బైహికాముష్మిక
శ్రేయఃప్రాప్తినిమిత్త ముత్తమసభా
సేవ్యంబు లోకాగమ
న్యాయైకాంత గృహంబునా బరగి నా
నా వేదవేదాంతవి
ద్యాయుక్తంబగుదాని జెప్పదొడగెం
దద్భారతాఖ్యానమున్.

ఆ నారాయణపాండవేయగుణమా
హాత్మ్యమ్ములజ్యోత్స్నజి
త్త్రానందం బొనరించుచున్ జనుల క
ర్ణాంశుప్రకాశంబుతో
మాన్తై సాత్యవతేయ ధీవనధి జ
న్మ శ్రీమహాభారతా
ఖ్యానాఖ్యామృతసూతి యొప్పు నిఖిలా
ఘధ్వాంతవిధ్వంసియై.

*　*　*

తెలుగుభాష యింత యొప్పునాయని చీదమార్యుడును, పంపనభట్టును క్షేమేంద్రుడును చిత్తపయు నాశ్చర్యపడుచు ముక్కులపై వ్రేళ్లుంచుకొని నన్నయరచనను పొగడిరి. నన్నయరచనను విద్వాంసులు పొగడినప్పుడెల్ల నారాయణభట్టు పొంగిపోసాగెను.

నన్నయభట్టుకోశము కొంచెము వెనుకకు పోనిచ్చి ఇట్లు చదివి చాలించెను.

రాజమహేంద్ర కవీంద్ర ను
రక్షాజ రాజమార్తాండ ధరి
త్రీజననుత చారిత్ర వి
రాజిత గుణరత్న రాజరాజనరేంద్రా!
వీరావతార సుకవిస్తుత నిత్యధర్మ
ప్రారంభ శిష్టపరిపాలన సక్తరాజా
నారాయణాఖ్య కరుణారసపూర్ణ వీర
శ్రీరమ్య రాజకులశేఖర విష్ణుమూర్తీ!

జయ జయ నినాదములతో సభముగిసెను.

*3

పురశ్చరణము

గోదావరీతీరమున నందమపూడి నివాసము నారాయణభట్టు సోమయాగముతో ప్రారంభించెను. ఒక్కసంవత్సరములో పున సోమిదేవి కోరిక ప్రకారము యజ్ఞేశ్వరుడు వారికి కంచెన సోమయాజి రూపమున పుత్రుడై యావిర్భవించెను. కుపమ భీమేశ్వరునికి మ్రొక్కిన లోహపుదివియ మ్రొక్కుతీర్చుకొని శాసనము వ్రాయించెను. ఆ పిమ్మట శీఘ్రకాలముననే ఆమెను నన్నయకుమారుని కిచ్చి వివాహము చేసిరి.

శ్రీమదాంధ్ర మహాభారతములో నన్నయ యరణ్యపర్వములో శరదృతువు వర్ణన వ్రాయుచుండగా నారాయణభట్టు లోకాంతరగతుడయ్యెను. నన్నయకు సంసారముపై విరక్తి కలిగి సన్యసించి బ్రహ్మీభూతుడయ్యెను. భారత రచన మాగిపోయినది.

ఆంధ్రమహాభారతము పూర్తికాలేదను బాధ నారాయణభట్టుకు పోలేదు. మరల తిక్కన రూపమున జన్మించి సోమయాజియై విరాట పర్వాదిగా భారత రచన పూర్తిచేసెను. ఆ జన్మలో నతని కరణ్యపర్వశేషము పూరింప నిచ్ఛ కలుగలేదు. మోక్షకాంక్షియైనను అతనికా జన్మలో నది సిద్ధింపలేదు.

మరల నతడు ఎర్రయగా జన్మించి అరణ్యపర్వశేషమును నన్నయపేర పూర్తిచేసి భారతశేషమగు హరివంశమునుగూడ సమాప్తముచేసి కృతార్థుడై శంకరసంయమీంద్రుని శిష్యుడై సన్యసించి బ్రహ్మత్వ మనుగమించెను.

కలియుగములో తెలుగుగడ్డపై నరనారాయణు లవతరించిన కథ శ్రద్ధతో పఠించినవారికి విన్నవారికి ఆయురారోగ్యైశ్వర్యములు ఆ పురాణమునులే ప్రసాదింతురు!

కృతజ్ఞతా వందనాదికము

ఈ నవల రచనకు మూలాధారమైన శ్రీమదాంధ్రమహాభారతమున కాది కవియు నందంపూడి శాసన కావ్యకర్తయు నగు శ్రీ నన్నయభట్టారకులకు నా నమోవాకములు!

ఈ కథాకాల మగు శాలివాహనశక 1ㄹ౭ㄴ విజయ సంవత్సరములోని చైత్రవైశాఖ మాసములకు పంచాంగము గుణించి యిచ్చిన మామిత్రులు దైవజ్ఞసార్వభౌమ, వేదార్థప్రవీణ, బ్రహ్మశ్రీ చివుకుల వెంకటరమణశాస్త్రిగారికి నా నమస్కారములు! శ్రీరాజరాజనరేంద్ర పట్టాభిషేక సంచికయు ఆంధ్రేతిహాసక పత్రికయు ప్రకటించిన ఆంధ్రేతిహాసకమండలి వారికిని, అందలి వ్యాసలచయితలకును, ముఖ్యముగా సంపాదకులగు శ్రీ భావరాజు వేంకట కృష్ణారావుగారికిని నేనెంతయు కృతజ్ఞుడను.

ఆంగ్లమున చోళచరిత్ర రచించిన ప్రొఫెసరు నీలకంఠశాస్త్రిగారికిని, ఆంధ్రుల చరిత్ర వ్రాసిన శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారికిని, రాజరాజ నరేంద్రుని కలిదిండిశాసనము భారతిలో ప్రకటించిన డాక్టరు నేలటూరి వెంకటరమణయ్య గారికిని నా నమస్సులు! రాజరాజ నరేంద్రుని నాటి చారిత్రక విషయములలో నాకు కలిగిన సందేహములను గూర్చి ప్రశంసింపగా ఆదరముతో అమూల్యమగు సూచనలందిచ్చిన శ్రీ డాక్టరు మారేమండ రామారావుగారికిని శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారికిని నా వందనములు!

దీని వ్రాత ప్రతి శ్రద్ధతో చదివి సూచనలు చేసిన మిత్రుడు చిరంజీవి శ్రీ వావిలాల సోమయాజులుకు నా ఆశీర్వచనములు!

ఇది వ్రాయుచుండగా వ్రాసినభాగము లప్పుడప్పుడు విని నాకు పూర్తిచేయుట కుత్సాహము కలిగించిన నామిత్రులు శ్రీ పోతుకూచి శ్రీరామమూర్తి, శ్రీ నేతి వెంకటరమణ, శ్రీ గోగినేని రామనాథము చౌదరి, శ్రీ బోడెపూడి వెంకటరావుచౌదరిగార్లకు నేనెంతయు కృతజ్ఞుడను.

ఇంతవరకును ఇది శ్రద్ధగా చదివిన పాఠక సహస్రములలో పూజ్యులకు నా నమోవాకములు, చిరంజీవులకు నా ఆశీస్సులు!

నోరి నరసింహశాస్త్రి.
సాహితీసమితి, రేపల్లె.


వార్తాచిత్రాలు





బొంబాయిలో కావాస్జీ జహంగీర్ హాలులో మంగళవారంనాడు జరిగిన బొంబాయి రాష్ట్ర మహిళా సమావేశమును రాణీ మహారాజ సింగ్ గారు ప్రారంభిస్తున్న దృశ్యం.




గవర్నరు శ్రీ ప్రకాశ గారు, పోలీస్ కమీషనర్ ఎ. వి. పాత్రో గారికి మెడల్ బహూకరిస్తున్న దృశ్యం.



బొంబాయి ప్రభుత్వమంత్రి శ్రీ గుల్జారీలాల్ నందా గారు హోంగార్డ్సుగా శిక్షణ పొందుచున్న వారి శిబిరమునకు విచ్చేసి, వారి శిక్షణను పరిశీలిస్తున్న దృశ్యం.




అమెరికాలోని బాల్డ్విన్ లోకమోటివ్ కంపెనీవారు భారతదేశమునకు సరఫరా చేయనున్న క్రొత్తరకపు రైలుఇంజను.



బాల్డ్విన్ కంపెనీవారు సరఫరా చేసిన మొదటి రైల్వే ఇంజనుకు అమెరికాలోని భారత రాయబారి శ్రీ అసఫ్ అలీగారు (ఇంజను ముందు నుంచుని, పైన చేయి వేసివున్నవారు) "నవ భారత చైతన్యమూర్తి" అని నామకరణము చేసినప్పటి దృశ్యం.



శ్రీమతి కోటా యశోదాదేవి యం. ఏ., డి. లిట్. ఆంధ్రచరిత్రను గురించి పరిశోధన చేసి, మద్రాసు విశ్వవిద్యాలయంవారి డి. లిట్ బిరుదమును పొందిన ప్రథమ ఆంధ్రమహిళ.




ఆంధ్రనాటకకళా పరిషత్ 14 వ సమావేశానికి హాజరైన కొందరు పెద్దలు.



పరిషత్ సమావేశసందర్భంలో నృత్యం చేసిన చిరంజీవులు కరుంధర, గిరిజలను శ్రీ నరసింహారావు గారు పూలమాలాలంకృతులను చేస్తున్న దృశ్యం.


Regd. No. M 4479

శ్రీ

శ్యామలా ఫిలిమ్స్ వారి

(తెలుగు సాంఘిక చిత్రము)

గీతాంజలి



గౌరీనాథశాస్త్రి

పూర్ణిమ

శ్రీరంజని

శబ్దం: ఏ బెల్ జీవా

ఛాయ: ప్రభాకర్

కళ: గోడుగాంకర్

దర్శకుడు: తంగిరాల

కవి: ఊటుకూరు

స్టూడియో: చిత్రకళ



విడుదల

5-3-48 శుక్రవారం

ఈ దిగువ కేంద్రములలో

బెజవాడ	-	శ్రీ దుర్గాకళామందిరం
బందరు	-	మినర్వా టాకీస్
కాకినాడ	-	క్రౌన్ టాకీస్
రాజమహేంద్రవరం	-	శ్రీరామా టాకీస్

మహాశివరాత్రికి ఇతర కేంద్రములలో

మహాత్మునికత్యంత ప్రియమైన,
"రఘుపతిరాఘవ రాజారాం" "వైష్ణవజనతో" అను పాటలు యిందు వినండి.

For Andhra & Ceded Dts:
FAMOUS FILM CIRCUIT, NELLORE

FOR OTHER ZONES APPLY TO:

Manager, SRI SYAMALA FILMS,
84, Santhome High Road, Mylapore, MADRAS

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, No. 7 Thambu Chetty St., G. T. Madras.
). H. M. S. No. 857—10,000 Copies.